V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం
07-07-2024

సంపుటి : 01 | సంచిక : 64 | పేజీలు : 12 | వెల : 5/- | తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. పదేళ్లుగా పరిష్కారం కాని విభజన హామీలు, ఆస్తుల పంపకానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రజా భవన్‌లో సమావేశమైన తెలుగు రాష్ట్రాల సీఎంలు రెండు గంటలపాటు చర్చలు జరిపారు. మరోసారి భేటీ కావాలని ఇద్దరు నేతలు నిర్ణయించారు. విభజన సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు వీలుగా రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులతో ఓ కమిటీని వేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# నిర్ణయిద్దాం

## విభజన సమస్యలపై ముఖ్యమంత్రుల భేటీ

- కమిటీలు వేయాలని నిర్ణయించిన సీఎంలు
- ఏపీలో కలిసిన ఐదు గ్రామాలు ఇవ్వాలని కోరిన రేవంత్ రెడ్డి
- తెలంగాణలో భవనాలు ఇవ్వాలన్న చంద్రబాబు నాయుడు
- అధికారుల, ప్రజాప్రతినిధుల కమిటీ ఏర్పాటు
- వివరాలు వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రధానంగా భద్రాచలం నుండి ఏపీలో కలిపిన ఏడు మండలాల్లోని 5 గ్రామాలను తమకు తిరిగి ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ విషయంలో చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. భద్రాచలం పట్టణానికి అనుకుని ఉన్న ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలన్న డిమాండ్ ఎప్పటి నుండో వినిపిస్తుంది. ఈ గ్రామాల విలీనంతో భద్రాచలం పట్టణ అభివృద్ధికి అవకాశం ఉంటుందని చెబుతోంది. అయితే ఓ రాష్ట్రంలోని గ్రామాలను వేరే రాష్ట్రంలో కలపాలంటే.. కేంద్ర అనుమతి తప్పనిసరి. కేంద్ర హోంశాఖకు లేఖ రాయాలని సమావేశంలో నిర్ణయించారు.

**సమస్యల పరిష్కారానికి రోడ్ మ్యాప్**

ప్రజాభవన్ భేటీలో విభజన సమస్యల పరిష్కారానికి రోడ్ మ్యాప్ ఖరారు చేశారు ఇరువురు ముఖ్యమంత్రులు. రాష్ట్ర ప్రయోజనాలపై రాజీపడకుండా ఉమ్మడి అజెండాపై కలిసిపని చేయాలని రెండు రాష్ట్రాలు మొదటి నుంచి భావిస్తున్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ఉమ్మడిగా ప్రయత్నించాలని, ఎగువ రాష్ట్రాలతో నీటి

మిగతా2లో...



## ఇదేనా మీ పాంచ్ న్యాయ్?

### ఫిరాయింపుదార్లతో రాజీనామా చేయించి ఎన్నికల్లోకి వెళ్లే దమ్ముందా?

- ఉప ఎన్నికలొస్తే అన్ని స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం తథ్యం
- బీజేపీలోకి రావాలంటే రాజీనామా చేసి రావాల్సిందే
- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది
- ఇరు రాష్ట్రాల సీఎంల భేటీని స్వాగతిస్తున్నాం
- బీజేపీ తలుచుకుంటే ఎంఐఎం నేతలు బయట తిరగగలరా?
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి

**విశ్వంభర, హైదరాబాద్:** ఒక పార్టీ నుండి గెలిచి ఇతర పార్టీల్లోకి వెళ్లే ప్రజా ప్రతినిధులను అనర్హులుగా చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ 'పాంచ్ న్యాయ్ పత్ర్' పేరుతో ఇచ్చిన హామీ ఏమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులు, అవినీతి, అక్రమాలు, హామీల మోసం విషయంలో కాంగ్రెస్ కు,

మిగతా2లో...



## కాంగ్రెస్‌లోకి గద్వాల ఎమ్మెల్యే

- కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి
- కృష్ణమోహన్ రెడ్డితో కలిపి ఏడుకు చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య
- వ్యతిరేకత వచ్చినా వెనక్కి తగ్గని కాంగ్రెస్ చీఫ్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి షాకుల మీద షాకులు తగులుతూనే ఉన్నాయి. ప్రలోభాలకు లొంగకండి, నేనున్నాను అని కేసీఆర్ ఎంతగా ధైర్యం నూరిపోసినా వర్కౌట్ కాలేదు. ఆయన మీటింగ్ పెట్టి పార్టీ మారకండి, వచ్చేది

మిగతా2లో...



కాంగ్రెస్ ప్రభుత్వానికి

## బిగ్ రిలీఫ్..

- ఏడు బిల్లులకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్
- రాజ్‌భవన్‌కు పంపిన బిల్లుల్లో ఏడింటికి ఆమోదం

2

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు

## రాజీపడితే ఊరుకోం


- ఓటమి భయంతోనే కాంగ్రెస్ పంచాయతీ ఎన్నికలకు దూరం
- ప్రజాపాలన అని చెప్పకోవడానికి సిగ్గుండాలి
- బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



3

## జులై 22 నుంచి బడ్జెట్ సమావేశాలు


- ఆగస్టు 12 వరకు కొనసాగనున్న సమావేశాలు
- ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్



9

## పెన్షన్లలో భారీ కోత?

- వచ్చే నెలలో భారీగా కటింగులు
- అనర్హులను గుర్తించే పనిలో అధికారులు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు



10

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



9

## గుజరాత్‌లో బీజేపీని ఓడిస్తాం

### అయోధ్యలో ఓడించాం.. ఇప్పుడు మోడీ సొంత రాష్ట్రం మిగిలింది

**రాహుల్ గాంధీ వ్యాఖ్యలు**

అయోధ్యలో మాదిరిగానే గుజరాత్‌లో కూడా బీజేపీని ఓడిస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. తనకు దేవుడితో ప్రత్యక్ష సంబంధం ఉందని మోదీ అన్నారని, అలాంటప్పుడు అయోధ్యలో బీజేపీ ఎందుకు ఓడిపోయిందని ఆయన ప్రశ్నించారు.

**నేటి చికెన్ ధరలు**

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 114 | ₹ 136 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 197 | ₹ 224 |

# కాంగ్రెస్ మరో సిక్సర్

### మంత్రి శ్రీధర్ బాబును కలిసిన ఆరుగురు ఎమ్మెల్యేలు

- అంతా గ్రేటర్ పరిధిలోని శాసనసభ్యులే..
- కాంగ్రెస్ గూటిలో చేరేందుకు రంగం సిద్ధం?
- మర్యాద పూర్వక భేటీనే అంటున్న ఎమ్మెల్యేలు
- అభివృద్ధి పనులకు నిధులు రిలీజ్ చేయాలని రిక్వెస్ట్



**విశ్వంభర, హైదరాబాద్:** కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీకి మరో భారీ షాక్ తగిలేలా ఉంది. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. తాజాగా ఏకంగా ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జీ శ్రీధర్ బాబును కలవడం చర్చనీయాంశంగా మారింది.

మిగతా2లో...

# గ్రూప్2 పరీక్ష వాయిదా..?

**విశ్వంభర, హైదరాబాద్ :** నిరుద్యోగుల ఉద్యమ సెగ ప్రభుత్వానికి గట్టిగానే తగిలినట్లుంది. ఇన్నాళ్లూ బెట్టుచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఓ అడుగు దిగివచ్చింది. డీఎస్సీ లేదా గ్రూప్2 పరీక్షల్లో ఏదో ఒకటి వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే గ్రూప్2 పరీక్షను ప్రభుత్వం వాయిదా వేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు టాక్.ఇప్పటికే ఈ విషయం నిర్ణయం తీసుకున్నదని, నేడు దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుందని తెలుస్తోంది. డీఎస్సీ, గ్రూప్2 పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ, ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్2 పరీక్షలు వెంటవెంటనే ఉన్నాయి. అయితే ఇవి రెండూ ఒకదాని వెంటే మరొకటి నిర్వహిస్తుండడాన్ని అభ్యర్థులు వ్యతిరేకిస్తున్నారు. డీఎస్సీని సెప్టెంబర్‌లో నిర్వహించాలని అభ్యర్థులు గతకొంతకాలంగా డిమాండ్ చేస్తూవస్తున్నారు. శుక్రవారం నాడు డీఎస్సీ వాయిదా, గ్రూప్1 మెయిన్స్‌తోపాటు పలు సమస్యల పరిష్కారానికి నిరుద్యోగులు టీఎస్పీఎస్సీ ముట్టడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో పరీక్షల తేదీల విషయంలో టీజీపీఎస్సీ, విద్యాశాఖతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని సీఎం ప్రకటించారు.

# బాలిక అవాంఛనీయ గర్భం తొలగించేందుకు హైకోర్టు అనుమతి

**విశ్వంభర, హైదరాబాద్ :** అత్యాచార బాధితురాలైన ఓ బాలిక అవాంఛనీయ గర్భాన్ని తొలగించేందుకు అనుమతినిస్తూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మెడికల్ బోర్డు నివేదిక సమర్పించిన నేపథ్యంలో ఆ బాలిక, తల్లి అనుమతి తీసుకుని గర్భం తొలగించాలంటూ గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ కు ఆదేశాలు జారీ చేసింది. నగరానికి చెందిన ఓ బాలిక పై 10 మంది కామాంధులు 6 నెలల పాటు అత్యాచారానికి పాల్పడిన దారుణ ఘటన పై గతంలో పోలీసు కేసు నమోదు అయింది. ఈ ఘటనలో బాలిక అవాంఛనీయ గర్భం దాల్చడంతో తొలగింపు నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా..డాక్టర్లు తిరస్కరించారు. దీంతో బాలిక తల్లి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విజయ్ సేన్ రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరుపు న్యాయవాది వసుధా నాగరాజ్ తమ వాదనలు వినిపిస్తూ దుర్మార్గుల చర్య వల్ల బాలిక గర్భం దాల్చిందన్నారు. దాదాపు 26 వారాల గర్భస్థ పిండాన్ని తొలగించడానికి గాంధీ ఆసుపత్రి డాక్టర్లు నిరాకరించారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి బాలిక ఆరోగ్య పరిస్థితులపై నివేదిక సమర్పించాలంటూ గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ బాలిక ఆరోగ్య పరిస్థితి పై సీల్డ్ కవర్ లో నివేదిక అందజేశారు. నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి ఇలాంటి ఘటనలు బాధాకరమని, బాలిక భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. బాలిక, ఆమె తల్లి అనుమతితో అబార్షన్ కు చర్యలు తీసుకోవాలని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ కు ఆదేశాలు జారీ చేస్తూ పిటిషన్ పై విచారణను మూసివేశారు.

# విద్యాశాఖ కీలక నిర్ణయం.. సంవత్సరానికి రెండు సార్లు టెట్ పరీక్ష



**విశ్వంభర, హైదరాబాద్ :** ఉపాధ్యాయ అర్హత పరీక్ష పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సంవత్సరానికి 2 సార్లు టెట్ నిర్వహించాలని నిర్ణయించింది. జూన్, డిసెంబర్ నెలల్లో టెట్ పరీక్ష నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఒక అభ్యర్థి ఎన్నిసార్లైనా టెట్ రాసుకోవచ్చని జీవోలో పేర్కొంది. డీఎస్సీలో టెట్ మార్కులకు వెయిటేజీ ఉంటుంది. ఇదిలా ఉంటే... షెడ్యూల్ ప్రకారం జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ, ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్2 పరీక్షలు వెంటవెంటనే ఉన్నాయి. అయితే ఇవి రెండూ ఒకదాని వెంటే మరొకటి నిర్వహిస్తుండడాన్ని అభ్యర్థులు వ్యతిరేకిస్తున్నారు. డీఎస్సీని సెప్టెంబర్‌లో నిర్వహించాలని అభ్యర్థులు గతకొంతకాలంగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. శుక్రవారం నాడు డీఎస్సీ వాయిదా, గ్రూప్1 మెయిన్స్‌తోపాటు పలు సమస్యల పరిష్కారానికి నిరుద్యోగులు టీఎస్పీఎస్సీ ముట్టడించిన విషయం తెలిసిందే.

# అడవుల్లో నివసించే వారికి కులాయి నీళ్లు

## మంత్రి సీతక్క ఆదేశాలు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లై కార్పొరేషన్‌తో అన్ని ఆవాసాలను అనుసంధానం చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. మిగిలిపోయిన అన్ని ఆవాసాలకు రక్షిత మంచి నీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అడవుల్లో నివసించే ప్రజలకు సైతం కుళాయి నీళ్లు అందించాలని ఆదేశించారు.అడవుల్లో విద్యుత్ లైన్లు వేసేందుకు కేంద్ర అటవీ శాఖ అనుమతులు ఇవ్వడం లేదని, అడవుల్లో ఉన్న ఆవాసాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి బోర్ల ద్వారా తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు. నీటి సోర్స్ పాయింట్లు దగ్గర్లో ఉండేలా చూసుకోవా లన్నారు.గ్రామపంచాయతీల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు శుభ్ర పరచాలని సూచించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న తాగునీటినీ వినియోగించే విధంగా ప్రజలకు నమ్మకం కలిగించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కాగా.. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై బడ్జెట్ సన్నాహక సమావేశం ఈరోజు (శనివారం) నిర్వహించారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు నివేదించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 51 వేల కోట్ల బడ్జెట్‌ను పీఆర్ అండ్ ఆర్డీ ప్రతిపాదించింది.

# ఇదేనా మీ పాంచ్ న్యాయ్?

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ కు తేడా ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ నిజంగా 'పాంచ్ న్యాయ్ పత్ర్' కు కట్టుబడి ఉంటే కాంగ్రెస్ లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలందరి చేత రాజీనామా చేయించి ఎన్నికల్లో పోటీ చేయించాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ లోకి 26 మంది ఎమ్మెల్యేలు ఫిరాయించబోతున్నారని వార్తలొస్తున్నాయని, వారందరితో రాజీనామా చేయించి ఎన్నికల్లోకి వెళితే... ఆ సీట్లన్నీ బీజేపీ కైవసం చేసుకోవడం తథ్యమన్నారు. బీజేపీలోకి రావాలనుకునే ఎమ్మెల్యేలంతా రాజీనామా చేసి చేరాల్సిందేనని స్పష్టం చేశారు. గతంలో హుజూరాబాద్, మునుగోడు ఎమ్మెల్యేలు రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్ విచ్చేసిన బండి సంజయ్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా ముచ్చటిస్తూ విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు. అందులోని ముఖ్యాంశాలు...

**విభజన చట్టంలోని అంశాలపై రెండు రాష్ట్రాల సీఎంల భేటీపై...**

విభజన చట్టంలోని అంశాలపై రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కావడాన్ని స్వాగతిస్తున్నా. ఇరు రాష్ట్రాల మధ్య సఖ్యత ఉంటే సమస్యలు పరిష్కారం సులువు అవుతుంది. అయితే చిత్తశుద్ధితో ఆయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. గతంలో మాదిరిగా చేపల పులుసు, రొయ్యల వేపుడు పేరుతో తెలంగాణకు అన్యాయం జరిగే నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదనుకుంటా. కొంతమంది గోతికాడ నక్కలా ఈ భేటీని అడ్డం పెట్టుకుని మళ్లీ సెంటిమెంట్ రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నరు. అట్లాంటి వాళ్లకు అవకాశం ఇవ్వకూడదని కోరుకుంటున్నా. తెలంగాణ బిడ్డగా నా అభిప్రాయాలు నాకు ఉంటాయి. కానీ భారత ప్రభుత్వ ప్రతినిధిగా నేను రెండు రాష్ట్రాల ను సమంగా చూడాలి. కేంద్రానికి అధికారం ఉంది కదా అని రాష్ట్రాల పై రుద్దలేము. కొందరు



పదవుల్లో వుంటే అధికారం చూస్తారు...మేము అది బాధ్యతగా భావిస్తాం. సమస్యల పరిష్కారానికి బాధ్యతతో కృషి చేస్తా.

**పార్టీ ఫిరాయింపులపై..**

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాల్సింది పోయి ఫిరాయింపుల పై సీఎం రేవంత్ రెడ్డి దృష్టి పెట్టడం అన్యాయం. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ వెలువరించిన ' పాంచ్ న్యాయ్ పత్ర్' లో ఏమని చెప్పారు? 'ఒక పార్టీలో గెలిచి ఇతర పార్టీల్లోకి ఫిరాయించే ప్రజాపతినిధులపై అనర్హత వేటు వేస్తాం' అని పేర్కొన్నారు కదా? మరి మీరు చేస్తుందేమిటి? ఇదేనా న్యాయ్ పత్ర్? 26 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లోకి వస్తారని చెబుతున్న ఆ పార్టీ నేతలను నేను అడుగుతున్నా... పార్టీ మరినొళ్ళను "పాంచ్ న్యాయ పత్ర" ప్రకారం రాజీనామా చేయించి ఎన్నికల్లో పోటీ చేయించే దమ్ముందా? అట్లా చేస్తే అన్ని సీట్లను బీజేపీ కైవసం చేసుకోవడం తథ్యం. రాజ్యసభ సభ్యులు కేశవ రావు ఒక్కడితోనే ఎట్లా రాజీనామా చేయిస్తారు? నిజంగా కాంగ్రెస్ ప్రజా పాలన మీద అంత నమ్మకం ఉంటే రాజీనామా చేయించి ఎన్నికల్లోకి రావాలి.

**బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న చోట్ల ఓడిన కాంగ్రెస్ అభ్యర్థులకు నిధులు ఎట్లా ఇస్తారు?**

రాష్ట్రంలో బీజేపీ గెలిచిన ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయడం లేదు. నిధుల పంపిణీ బాధ్యత అక్కడ ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులకు అప్పగించడం దుర్మార్గం. ప్రజా తీర్పును, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. కాంగ్రెస్ మాదిరిగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తే... వాళ్ల పరిస్థితి ఎట్లుంటదో ఆలోచించాలి. ఇకనైనా రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అన్ని పార్టీలకు ఎమ్మెల్యేలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. నిధుల కేటాయింపు జరపాలని కోరుతున్నా.

**స్థానిక సంస్థల సమస్యలపై...**

స్థానిక సంస్థల్లో అనేక సమస్యలున్నాయి. గ్రామపంచాయతీలకు బిల్లుల పేరిట దాదాపు రూ.3 వేల కోట్ల బకాయిలివ్వాలి. మాజీ సర్పంచులు బిల్లులు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆ బిల్లుల చెల్లించాలి. కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. స్థానిక సంస్థల ఎన్నికలెప్పుడొచ్చినా బీజేపీ గెలుపు ఖాయం.

**నిరుద్యోగ సమస్యలపై...**

ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెసోళ్లకు ఉద్యోగాలు దొరికనయ్. కానీ నిరుద్యోగులకు మాత్రం ఇంతవరకు ఒక్క ఉద్యోగం కూడా దొరకలే. ఇప్పటికే అధికారంలోకి వచ్చి 7 నెలలైంది. ఒక్క ఉద్యోగం ఇవ్వని ఈ కాంగ్రెస్ సర్కార్ మిగతా 5 నెలల్లో 2 లక్షల ఉద్యోగాలు ఎట్లా భర్తి చేస్తారో చెప్పాలి. ఇచ్చిన హామీలు నిల్బెట్టుకొనందుకే పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు తగ్గినయని కాంగ్రెస్ అధిష్టానానికి డౌట్ వచ్చింది. అందుకే ఇయ్యాల కురియన్ కమిటీ వచ్చ హామీల అమలుపై కసరత్తు చేస్తున్నట్లుంది.

# కాంగ్రెస్ మరో సిక్సర్

(మొదటి పేజీ తరువాయి)

ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద రెడ్డి శనివారం మంత్రి శ్రీధర్ బాబును కలిశారు. తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి ప్రతిపాదనలను మంత్రి శ్రీధర్ బాబుకు ఎమ్మెల్యేలు అందించారు. జీహెచ్ఎంసీకి నిధులు విడుదల చేయాలని మంత్రిని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నుంచి జీహెచ్ఎంసీకి నిధులు ఇవ్వలేదన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని చెరువులు, కుంటల్లో పెరిగిపోయిన గుర్రపు డెక్క తొలగించాలని, దోమలను నివారించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో ఎలక్ట్రికల్ పోల్స్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో నెలకొన్న శానిటేషన్ సమస్యలు పరిష్కరించాలని, అలాగే కూకట్‌పల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు రాజకీయాలకు అతీతంగా పనులు చేయడం జరుగుతుందన్నారు. తప్పకుండా మీ సమస్యలను తీరుస్తామని ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.

**ముందస్తు భేటీనేనా..?**

అయితే, ఒకేసారి ఆరుగురు ఎమ్మెల్యేలు మంత్రిని కలవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీరంతా కూడా పార్టీ మారతారని ప్రచారం జరుగుతోంది. సుమారు 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరతారంటూ మంత్రులు ఇప్పటికే ప్రకటనలు చేస్తుండటం గమనార్హం. ఇందులో భాగంగానే ఇవాళ మంత్రిని కలిసినట్టు సమాచారం. నేడో, రేపో ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు ఒకేసారి పార్టీ మారనున్నారని రాజకీయ వర్గాల సమాచారం.

# నిర్ణయిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

వాటాలపై కలిసి పోరాడేలా ఉమ్మడి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని నిర్ణయించారు.

**చర్చకు వచ్చిన అంశాలు ఇవే...**

ఉమ్మడి ఏపీ విభజన జరిగి పదేళ్లు పూర్తైనా కూడా.. అనేక కీలకాంశాలు ఇంకాపెండింగ్‌లో ఉండిపోయాయి. అధికారుల స్థాయిలో కొన్నిసార్లు చర్చలు జరిగినా చాలా విషయాలు ఇంకా కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా ఉమ్మడిగా తొమ్మిది ఎజెండా అంశాలను ఖరారు చేశారు. ఈ ఎజెండాలో రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం షెడ్యూలు 9, 10లో పేర్కొన్న సంస్థల ఆస్తుల పంపకాలు, విభజన చట్టంలో చేర్చని సంస్థల ఆస్తుల పంపకాలు, ఏపీ ఫైనాన్షియల్ కార్పొరేషన్ అంశాలు, పెండింగ్ విద్యుత్తు బిల్లులు, విదేశీ రుణ సాయంతో నిర్మించిన ప్రాజెక్టుల ఆస్తులుఅప్పుల పంపకాలు, ఉమ్మడి సంస్థలకు చేసిన చెల్లింపులు, లేబర్ సెస్ పంపకాలు, ఉద్యోగుల విభజన అంశాలపై చర్చించారు.

**పాల్గొన్నది ఎవరెవరు అంటే..?**

ముఖ్యమంత్రుల భేటీలో ఏపీ నుంచి సీఎం చంద్రబాబుతో పాటు మంత్రులు కందుల దుర్గేష్, సత్యప్రసాద్, బీసీ జనార్ధన్‌రెడ్డి పాల్గొనగా, తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతోపాటు ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు.

**'నా గొడవ' పుస్తకాన్ని బహూకరణ**

హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. పది అంశాల అజెండాపై వారి మధ్య చర్చ సాగుతోంది. ఈ సమావేశానికి ఇరు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, అధికారులు హాజరయ్యారు. భేటీ సందర్భంగా చంద్రబాబుకు రేవంత్ రెడ్డి తెలంగాణ రచయిత కాళోజీ నారాయణరావు రాసిన 'నా గొడవ' పుస్తకాన్ని బహూకరించారు. ఏపీ సీఎంను శాలువతో సత్కరించారు. మరోవైపు, రేవంత్ రెడ్డికి చంద్రబాబు వెంకటేశ్వరస్వామి పటాన్ని బహూకరించారు.

**కమిటీలతో విభజన**

**సమస్యలకు పరిష్కారం : డిప్యూటీ సీఎం భట్టి**

రెండురాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బతినకుండా విభజన సమస్యలు పరిష్కరించుకోవాలని ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు సమావేశంలో నిర్ణయించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందుకు కమిటీల ద్వారా విభజన సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని భట్టి విక్రమార్క వివరించారు. ప్రజాభవన్‌లో తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశం ముగిసిన తర్వాత భేటీ వివరాలను భట్టి విక్రమార్క, ఏపీ మంత్రి అనగాని సత్య ప్రసాద్ మీడియాకు వెల్లడించారు. గత పదేళ్లుగా పరిష్కారానికి నోచుకోని అంశాలపై సమావేశంలో మాట్లాడుకున్నామని ఇరురాష్ట్ర మంత్రులు తెలిపారు. రెండురాష్ట్రాల ముఖ్యమంత్రులు కూలంకషంగా చర్చించిన తర్వాత ఒక నిర్ణయానికి వచ్చామన్న అమాత్యులు, ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**పెండింగ్ అంశాలపై చర్చించాం... రేవంత్ రెడ్డి**

హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమావేశం అనంతరం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రుల సమావేశం దాదాపు రెండు గంటలు కొనసాగింది. ఆ తర్వాత చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు జూబ్లీహిల్స్‌లోని తమ తమ నివాసాలకు చేరుకున్నారు. అనంతరం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఏపీ సీఎం చంద్రబాబు, ఆ రాష్ట్ర మంత్రులు, అధికారులతో సమావేశమైనట్లు తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న అంశాలపై పరిష్కారం కోసం చర్చించినట్లు పేర్కొన్నారు.

**ఇరు రాష్ట్రాలకు మేలు కలుగుతుందనే నమ్మకం కలిగిందన్న చంద్రబాబు**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో హైదరాబాద్‌లో మంత్రివర్గ సహచరులతో కలిసి సమావేశమై విభజన సమస్యలపై చర్చలు జరిపామని చంద్రబాబు ట్వీట్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ఇరు రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా ఉండే పరిష్కారాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే విధంగా చర్చలు సాగాయని, ఇరురాష్ట్రాలకు మేలు కలుగుతుందనే నమ్మకం ఈ సమావేశం ద్వారా కలిగిందని పేర్కొన్నారు.

**మంచి వాతావరణంలో సమావేశం జరిగింది: శ్రీధర్ బాబు**

మంచి వాతావరణంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. విభజన అంశాలపై అధికారుల కమిటీని వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు మరోసారి కూర్చొని చర్చిస్తారని తెలిపారు. ఏడు మండలాలు, విద్యుత్ బకాయిలు... ఇలా ప్రతి అంశంపై అధికారుల కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. అప్పటికీ పరిష్కారం కాకుంటే కేంద్రం వద్దకు వెళతామన్నారు.

**కమిటీల ఏర్పాటు**

ప్రజా భవన్ వేదికగా జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ ముగిసింది. గత పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన అంశాల పరిష్కారం కోసం ఈ భేటీలో తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారం కోసం రెండు కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మంత్రుల నేతృత్వంలో ఒక కమిటీ, అధికారుల స్థాయిలో మరొక కమిటీ వేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు డెసిషన్ తీసుకున్నాయి. ఈ కమిటీలు గత పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమస్యల పరిష్కార కోసం చర్చలు జరపనున్నాయి. మంత్రుల కమిటీలో తెలంగాణ నుండి శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, హైదరాబాద్‌లోని ప్రజా భవన్ వేదికగా సాయంత్రం 6.10 నిమిషాలకు స్టార్ట్ అయిన ఈ భేటీ.. దాదాపు గంటన్నర పాటు సాగింది.

# కాంగ్రెస్‌లోకి గద్వాల ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి)

మన ప్రభుత్వమే అని చెప్పిన తర్వాత కూడా ఎమ్మెల్యేలు జంప్ అవుతున్నారు. శనివారం మధ్యాహ్నం మరో ఎమ్మెల్యే బీఆర్ఎస్‌కి గుడ్ బై చెప్పారు. గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కృష్ణమోహన్ రెడ్డితో కలిపి ఇప్పటివరకు ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

**కృష్ణమోహన్ రెడ్డిని పార్టీలో చేర్చుకోవద్దంటూ ఆందోళనలు**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని కాంగ్రెస్ లో చేర్చుకోడానికి వీల్లేదంటూ కార్యకర్తలు రోడ్డెక్కారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన కాంగ్రెస్ కార్యకర్తలని ఇబ్బందులు పెట్టాడని, కేసులు పెట్టి హింసించాడని, అలాంటి వాడిని ఇప్పుడు పార్టీలోకి చేర్చుకోవడానికి వీల్లేదంటూ ఆందోళన చేస్తున్నారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణమోహన్ పై పోటీ చేసి ఓడిపోయిన జెడ్పీ చైర్‌పర్సన్ సరిత.. ఆయన కాంగ్రెస్‌లో చేరడాన్ని వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఈ మేరకు ఆమె ఇటీవల నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రవేశానికి అనుమతి ఇవ్వకుండా పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. గురువారం ఆమె మద్దతుదారుల్లో ఒకరైన ప్రసాద్ అనే యువకుడు పట్టణంలోని నల్లగుంట వద్ద ఉన్న మొబైల్ నెట్‌వర్క్ టవర్ పైకి ఎక్కాడు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలోకి రావడాన్ని కాంగ్రెస్ అధిష్టానం ప్రోత్సహిస్తే టవర్ పైనుండి దూకుతానని బెదిరించాడు. ప్రసాద్ తో పాటు పార్టీ కార్యకర్తలు టవర్ వద్ద బైఠాయించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానికులు అప్రమత్తం చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రసాద్‌ని ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడొద్దని కోరారు. అతనిని కిందకి దించారు. అలాగే, జిల్లాలోని కేతిదొడ్డిలో ఇదే తరహాలో సరిత మద్దతుదారుడు కృష్ణ తనపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసాడు. అతనితో పాటు మరికొందరు మద్దతుదారులు కేతిదొడ్డి మండలం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. కాగా, తెలంగాణలోని కాంగ్రెస్ నాయకత్వం ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న తరుణంలో, ముఖ్యంగా బీఆర్ఎస్ నుండి ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడంపై స్థానిక నేతల నుంచి వ్యతిరేక స్వరాలూ వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్ లో చేరినప్పుడు బాన్సువాడ, జగిత్యాలలో స్థానిక కాంగ్రెస్ నేతలు ఇదే తరహాలో నిరసనలు చేపట్టారు.

## తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా

# కేకే నియామకం



**విశ్వంభర, హైదరాబాద్ :** కే. కేశవరావును రాష్ట్ర సలహాదారుగా నియమిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పబ్లిక్ ఎఫైర్స్‌కు ఆయన సలహాదారుడిగా వ్యవహరిస్తారని.. ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు. కాగా ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు కేకే. కేకే తన రాజ్యసభ సభ్యత్వానికి గురువారం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కడ్‌ను కలిసి స్వయంగా రాజీనామా లేఖ అందించారు. ఒకపార్టీ నుంచి పదవి పొంది మరో పార్టీలో చేరినప్పుడు రాజీనామా చేయడం నైతిక బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అందుకే రాజీనామా చేసినట్టు కేకే వివరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి బిగ్ రిలీఫ్..

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపిన బిల్లుల్లో తాజాగా ఏడింటికి ఆమోదం లభించింది. మరో 4 బిల్లులు పరిశీలనలో ఉన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల రాజ్ భవన్ వెళ్ళి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో భేటీ అయిన సందర్భంగా బిల్లుల గురించి ప్రస్తావించగా దానికి కొనసాగింపుగా ఏడు బిల్లులకు గవర్నర్ శనివారం ఆమోదం తెలిపారు.దీనికి సంబంధించి రాజ్ భవన్, ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడకపోయినా త్వరలోనే గెజిట్ జారీ కానున్నట్లు తెలిసింది. ఆమోదం పొందిన ఏడు బిల్లుల్లో మూడు పంచాయతీరాజ్ విభాగానికి చెందినవి , ఒకటి పురపాలక శాఖకు సంబంధించినది. ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటు, టిమ్స్ (తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆస్పత్రుల నిర్మాణం, మైనారిటీ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన బిల్లులకు కూడా ఆమోదం లభించింది. దీంతో మొత్తం 7 బిల్లులకు క్లియరెన్స్ రావడంతో పరిశీలనలో ఉన్న మరో 4 బిల్లులపై త్వరలో స్పష్టత రానున్నది.

# తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు రాజీపడితే ఊరుకోం

- ఓటమి భయంతోనే కాంగ్రెస్ పంచాయతీ ఎన్నికలకు దూరం
- ప్రజాపాలన అని చెప్పుకోవడానికి సిగ్గుండాలి
- బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** విభజన సమస్యల పరిష్కారం కోసం రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీని స్వాగతిస్తున్నామని, అయితే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడితే మాత్రం ఊరుకునేది లేదని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. విభజన సమస్యల పరిష్కారంకు కేంద్రం సానుకూలంగా ఉందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెడితే చూస్తూ ఊరుకోని తెలిపారు.

### తెలంగాణ స్పీకర్ కనబడటం లేదు

ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యత్వాన్ని రద్దు చేయకపోతే ప్రజాస్వామ్యం పై ప్రజలకు నమ్మకం పోతుందని మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంలో పిటీషన్ తీసుకోకుండా స్పీకర్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ కార్యాలయానికి ఎన్నిసార్లు వెళ్లినా కనపించడం లేదన్నారు. స్పీకర్ గారికి రిజిస్టర్ పోస్టులో పంపిస్తే , లెటర్స్ ను మళ్ళీ తిరిగి పంపిస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో ఇప్పటికే హై కోర్టులో కేసు ఉందని, అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని తెలిపారు.

### రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం

రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెంది అవినీతిలో కూరుకుపోయిందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. సర్కార్ పెద్దలు, వివిధ ట్యాక్సుల పేరుతో అవినీతికి పాల్పడితే వాస్తవాలతో సహా బయపెట్టామని తెలిపారు. ముఖ్యంగా సివిల్ సప్లయ్ శాఖలో జరిగిన అవినీతి అక్రమాలపై కేంద్రానికి నివేదిక ఇచ్చామని, త్వరలోనే విచారణ జరుగుతుందని తెలిపారు.

### ఓటమి భయంతోనే ... కాంగ్రెస్ సర్కార్ పంచాయతీ ఎన్నికలకు వెళ్లడం లేదు

ఓటమి భయంతోనే కాంగ్రెస్ సర్కార్... పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు వెనకాడుతోందని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఇన్ని రోజులు పంచాయతీల్లో స్పెషలాఫీసర్ల పాలన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకుండా తాత్సారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తమది ప్రజాపాలన అని చెప్పుకోవడానికి సిగ్గుండాలని ఎద్దేవా చేశారు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి ప్రతీకలైన పంచాయతీలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలకు ఏడాదిన్నర కాలంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు దాదాపు రూ. 2వేల కోట్ల విడుదల కావడంలేదన్నారు. పంచాయతీ వ్యవస్థలో ఎన్నికైన స్థానిక ప్రజా ప్రతినిధులు ఉంటేనే కేంద్రం నుంచి నిధులు వస్తాయని గుర్తు చేశారు. పాలవర్గాలు లేకపోవడంతో గ్రామపంచాయతీల్లో నిధులు లేక పల్లెలు కూనరిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సర్పంచులు అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగిస్తే...ఆరు నెలల నుంచి ప్రత్యేక అధికారులు అప్పులు చేసి పల్లెల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు.

### ఏడు నెలల నుంచి పంచాయతీ సిబ్బందికి వేతనాలు, గ్రామ పంచాయతీకి నిధులు లేవు

ప్రజా పాలన అని గొప్పులు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలనలోనే ఏడు నెలలుగా పంచాయతీలకు నిధుల్లేవు. పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గత్యంతరం లేక వారు కుటుంబ జీవనం కోసం కూలీ పనులకు వెళ్తున్నారని చెప్పారు.దీంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కనీసం చెత్తను ఎత్తేసేందుకు దిక్కులేదని తెలిపారు. కాని కాంగ్రెస్ నేతలు మాత్రం మీడియాలో ప్రజా పాలన అంటూ గొప్పులు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని మొత్తం 12,769 గ్రామ పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. కమీషన్ల కోసం గత ప్రభుత్వం సర్పంచ్ లతో బలవంతంగా ట్రాక్టర్లు కొనుగోలు చేయించిందని, ఇప్పుడు వాటి ఈఎంఐలు కట్టేందుకు కూడా ఎవరు దిక్కులేరన్నారు.

### అవుట్ సోర్సింగ్ గ్రామ కార్యదర్శులకయితే ఆరు నెలల నుంచి వేతనాలు లేవు

రాష్ట్రంలో ప్రస్తుతం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య దాదాపు రెండు వేల వరకు ఉంటుందని అంచనా. అవుట్ సోర్సింగ్ గ్రామ కార్యదర్శులే కాదు, రెవెన్యూ, విద్యా శాఖ వంటి ఇతర విభాగాల్లో కూడా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రత్యేకించి కంప్యూటర్ ఆపరేటర్లకు కూడా నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదంటున్నారు. పదవీ కాలం పూర్తి చేసుకున్న మాజీ సర్పంచులు, ఎంపీటీసీ, జడ్ పిటీసీ సభ్యులకు ఆరు నెలల గౌరవ వేతనం పెండింగులో ఉందని వాపోతున్నారు.

### ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్ మీద ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రజల మీద లేదు

సర్కార్ పెద్దలకు ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్ మీద ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రజల మీద లేదని మహేశ్వర్ రెడ్డి ఎద్దేవా చేశారు. కాంట్రాక్టర్లకు, మంత్రుల కంపెనీలకు వందల కోట్లు ఇవ్వడానికి నిధులు ఉంటాయి తప్పితే కనీసం పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వడానికి చేతులు రావడం లేదని దుయ్యబట్టారు. నాలుగు వేలకు పెంచుతామన్న పింఛన్ల సంగతీ ఏమోగాని కనీసం ఇప్పుడిస్తున్న 2వేల పింఛన్ కూడా రెండు నెలలు ఆలస్యంగా ఎందుకు ఇస్తున్నారో చెప్పాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం కార్మికులకు కూడా ఏడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు.

### బీ ట్యాక్స్ ఇస్తాలేరని సర్పంచ్ల బిల్లులు ఆపుతున్నారా?

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పారని, వర్క్ ఆర్డర్ తో సర్పంచులు సొంతంగా లక్షల రూపాయలు అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేయించారు.. వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డులు, రైతు వేదికలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర పనులు చేపట్టారు. కానీ, కేసిఆర్ సర్కారు ఆపనులకు సంబంధించిన నిధులు విడుదల చేయలేదు. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల్లో పలు సందర్భాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం రూ.3 లక్షల నుంచి రూ.కోటి వరకు బకాయి ఉన్నట్లు సర్పంచులు చెబుతున్నారు. ఈ లెక్కన రాష్ట్రం మొత్తమ్మీద రూ.1000 కోట్లకు పైగా బిల్లుల బకాయి ఉన్నట్లు సమాచారం.అసెంబ్లీకి ఎన్నికలు జరిగి బీఆర్ఎస్ సర్కారు పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. సర్పంచుల పదవీకాలం ముగిసి ఐదు నెలలైంది. అయినా మాజీ సర్పంచులు చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇంకా విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పది శాతం కమిషన్లు ఇస్తే తప్ప ఆర్థిక శాఖ బిల్లులు ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. బహుశా ఈ మాజీ సర్పంచులు పది శాతం కమిషన్లు ఇచ్చుకోలేకపోవడం వల్లే బిల్లులు విడుదల కావడం లేదేమో అనే అనుమానాలున్నాయి. వెయ్యి కోట్లకు పైగా ఉన్న పెండింగు బిల్లులను క్లియర్ చేసేందుకు పది శాతం కమిషన్ అంటే వంద కోట్లు ముడుపులు చెల్లించాలేమో.

### ప్రజలకు పింఛన్లు కూడా ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఉందా ..?

నిజంగా కనీస సంక్షేమ కార్యక్రమాలకు కూడా నిధులు ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా అని మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. అలా అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తప్పకపోతే ఆర్థిక పరిస్థితుల మీద ఎమర్జెన్సీ పెట్టాలన్నారు. నిధులు లేక గ్రామ పంచాయతీలు విలవిలలాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన అని చెప్పడం కాదు, పల్లె బాట పట్టాలని మంత్రులకు హితవు పలికారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.




## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

### ఇక నుంచి రెండు సార్లు టెట్ నిర్వహణ

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇక నుంచి సంవత్సరానికి రెండు సార్లు టెట్ నిర్వహించనుంది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను శనివారం తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. అయితే గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన సమయంలో మాత్రమే టెట్ నిర్వహణ జరిగేది. టీచర్ ఎలిజిబిలిటీ కోసం జరిగే ఈ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి డీఎస్సీలో కూడా వెయిటేజీ ఉంటుంది. ఇక నుంచి జూన్, డిసెంబర్ నెలలో ఈ టెట్ పరిక్షను నిర్వహించనున్నారు. కాగా ఈ విషయం టెట్ అభ్యర్థులకు సంతోషాన్ని అందించింది.




## ఆమనగల్ ఎస్సై బదిలీ

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మండల పోలీస్ స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఎస్సై పీ శ్రీనివాసులు పది రోజులు కూడా గడవకముందే శంషాబాద్ ఎయిర్ పోర్టు పోలీస్ స్టేషన్‌కు ట్రాన్స్ఫర్ అయ్యారు. ఆయన స్థానంలో శంషాబాద్‌లో పనిచేస్తున్న పీ వెంకటేష్ నియామకం అయినట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.




## ధోని 100 ఫీట్ల కటౌట్ ఆవిష్కరణ

**విశ్వంభర, అమరావతి :** టీమిండియా మాజీ కెప్టెన్ ధోనికి ప్రపంచ వ్యాప్తంగా కోట్ల కొద్ది అభిమానులున్నారు. అందులో తెలుగు వాళ్ల సంఖ్య కూడా ఎక్కువే. అయితే.. తాజాగా తెలుగు వాళ్లు ధోనిపై తమ వంద అడుగుల అభిమానం కురిపించారు. ధోని పుట్టిన రోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో వంద అడుగుల భారీ కటౌట్ ఏర్పాటు చేసి.. ధోనిపై తమ అభిమానం చాటుకున్నారు. ఏపీలోని నందిగామలో తెలుగు ధోని ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఈ భారీ కటౌట్ ఏర్పాటు చేశారు. ధోని బర్త్ డేకు ఒక రోజు ముందు అంటే జులై 6(శనివారం) ఈ కటౌట్‌ను ఫ్యాన్స్ తో స్థానిక ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య ఆశిష్కరించారు. ధోని బర్త్‌డేను రోజున దేశవ్యాప్తంగా ఉన్న ధోని అభిమానులు స్వీట్లు పంచడం, అన్నదానం చేయడం లాంటి కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ ఉంటారు. అయితే.. నందిగామ తెలుగు అభిమానులు ఒక అడుగు ముందుకేసి.. వంద అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేయడం విశేషం.



# మూడు దశాబ్దాల పోరాటం సాకారమయ్యేనా!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో షెడ్యూలు కులాల రిజర్వేషన్ వర్గీకరణ సాధన కోసం ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామం లో జులై 7 1994న ఏర్పడిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం మహోద్యమంగా మారి 30 సంవత్సరాలు గడుస్తున్నా ఎందుకు పరిష్కారం కాలేదు. మూడు రోజుల్లో పరిష్కరించాల్సిన ఈ సమస్యను 30 సంవత్సరాలుగా కొనసాగడానికి ఎవరు కారణం. అధినాయకత్వమా రాజకీయ పార్టీలా రాజ్యాంగ ప్రక్రియ అనే అంశాలు అర్థం కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని కోటిన్నర మాదిగ ఉపకులాలు దక్షిణ భారత దేశంలోని సుమారు మూడు కోట్ల జనాభా కలిగిన ఈ కులాలను మోసం చేస్తున్నది ఎవరు. యధాతథముగా వివరించాల్సిన బాధ్యత మాదిగ జాతి విద్యావంతునిగా నా బాధ్యత. ఎందుకంటే గత 20 సంవత్సరాలుగా గల్లి నుండి ఢిల్లీ దాకా నా సమయం ప్రతిభ పైసలు ఉద్యమం కోసం వెచ్చించిన వాడిగా నాలాగా లక్షలాదిమంది నా జాతి బిడ్డల త్యాగాల ఫలితాలు ఒక్కడు అనుభవిస్తూ అన్ని రాజకీయ పార్టీలకు జాతిని తాకట్టు పెడుతూ తన భజన భజనపరులతో దండాలు చేస్తూ గత 30 ఏళ్లుగా జాతిని మోసం చేస్తున్న అధినాయకుని తప్పుడువిధానాల వలన కోట్లాదిమంది దళిత జాతి కి దక్కాల్సిన సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయంతో పాటు ఈ దేశ సంపదలో అన్ని రంగాల్లో తమ జనాభాకు రావలసిన వాటా దక్కక పోవడానికి ప్రధాన కారణం వారిని వర్గీకరణ పేరుతో వంచిస్తూ పక్కదారి పట్టిస్తున్నది ఎవరు రాజకీయ అధికారమే అన్ని సమస్యలకు పరిష్కారం అన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాన్యశ్రీ కాన్షీరామ్ రాజకీయ ఉద్యమాలను పక్కనపెట్టి వర్గీకరణ చట్టం అన్ని సమస్యలకు పరిష్కారం అనే తప్పుడు సిద్ధాంతంతో దళిత జాతిని మోసం చేస్తున్న మాల మాదిగ ఉపకులాల ఉద్యమ నాయకుల వలన దళిత ప్రజలు రాజకీయ అధికారం వైపు వెళ్లలేని దుస్థితికి గత 30 ఏళ్ల వర్గీకరణ ఉద్యమం కారణమైంది. ఇది పరిష్కారం కాకపోవడానికి ప్రధాన కారకులు అగ్రకుల పాలకులు వారిని టార్గెట్ చేయకుండా పాలిత మాల ఉప కులాలను టార్గెట్ చేస్తూ మాదిగ దండోరా ఉద్యమం దళిత జాతిని తప్పు తోవా పట్టిస్తున్న కారణంగా రెండు తెలుగు రాష్ట్రాలలో లక్షల కోట్ల రూపాయల బడ్జెట్లో వాటా దక్కకుండా పరిశ్రమల్లో ఉద్యోగాల్లో సంపదలో ఇలా అన్ని రంగాల్లో వాటా కోల్పోతున్నది. దళిత జాతి కాదా అందుకు కారణమైన ఈ దళిత దగా నాయకత్వాన్ని ప్రశ్నించకపోతే కోట్లాదిమంది దళిత జాతి ప్రజల జీవితం వేల సంవత్సరాల బానిసత్వంలో నుండి తిరిగి నయా అగ్రకుల రాజకీయ బానిసత్వంలోకి నెట్టబడుతుంది.

**పరిష్కార మార్గాలు చెప్పడమే నా బాధ్యత**

బాధ్యతాయుతమైన అంబేద్కర్ వాదిగా ఈ సమస్యకు మూలాలు వాటి పరిష్కార మార్గాలు చెప్పడమే నా బాధ్యత అందుకే ఈ వ్యాసం వర్గీకరణ సమస్య కులం కంటే ఎక్కువ ప్రాంతీయ సమస్య ఈ సమస్యకు పరిష్కారం ప్రాంతీయ రాజ్యాంగ అధికరణ 371 డి తప్ప జాతీయ రాజ్యాంగ అధికరణ 341 సవరణ కాదు నేను పైన చెప్పినట్లు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల వర్గీకరణ సమస్య జాతీయ సమస్య కాదు. అందుకే 341 సవరణ అవసరం లేదు అది అసాధ్యం 2001 నుండి నేను ఎందుకు అంటున్నాను. అంటే భారత రాజ్యాంగం అధికరణ 341 ప్రకారం భారతదేశంలోని 1500కు పైగా ఉన్న షెడ్యూల్ కులాల జాబితాను సవరించాలంటే రెండు 2/3 మెజార్టీ లోకసభలో మరియు రాజ్యసభలో స్పెషల్ మెజార్టీ అనగా 50 శాతానికి పైగా రాష్ట్రాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు కులాల రిజర్వేషన్ల వర్గీకరణ సమస్యకు అనుకూలంగా 15 రాష్ట్రాల్లో అసెంబ్లీ తీర్మానం జరగాలి. అది సాధ్యం కాదు ఎందుకంటే గత 30 ఏళు గా కేవలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రస్తుతం తెలంగాణలో మాత్రమే అసెంబ్లీ తీర్మానం జరిగింది.

**నేను పెద్ద మాదిగను.. మాదిగ జాతి ముద్దుబిడ్డను..**

నేను పెద్ద మాదిగను మాదిగ జాతి ముద్దుబిడ్డను అని చెప్పుకున్న ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2000 సంవత్సరం నుండి 2004 వరకు తనకు అధికారం లేకపోయినప్పటికీ మాదిగల ఓట్ల కోసం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల రిజర్వేషన్ వర్గీకరణ చట్టం 2000 సంవత్సరములు తెచ్చి 2004 వరకు అమలు చేసి సుమారు పదివేల ఉద్యోగాలు మాదిగ ఉపకులాలకు కల్పించి న్యాయం చేసిన నారా చంద్రబాబు నాయుడు ఆనాడు కేంద్రంలో బిజెపి అధికారంలో ఉంది. 341 సవరణ అధికారము రాష్ట్రానికి లేదని 2004లో సుప్రీంకోర్టు వర్గీకరణ చట్టాన్ని కొట్టేస్తే కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి పార్లమెంటులో బిల్లు తెచ్చే వరకు నారా చంద్రబాబు నాయుడు ఎందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేదు. ఎంఆర్పిఎస్ అధినేత ఢిల్లీలో చేయాల్సిన పోరాటాన్ని గల్లి పోరాటముగా ఎందుకు పరిమితమయ్యాడు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా 2014లో అధికారాన్ని చేపట్టి దళిత కులాల్లో మెజారిటీ గా ఉన్న మాలలకు భయపడి ఆంధ్రప్రదేశ్లో అసెంబ్లీ తీర్మానం కూడా చేయలేదు. అలాంటి వ్యక్తి తిరిగి 2024లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రెండవ సారి బిజెపి సహకారంతో రాష్ట్రంలో కేంద్రంలో అధికారాన్ని అనుభవిస్తున్నాడు. బిజెపి ప్రభుత్వం 2014 నుండి నేటి వరకు కేంద్రంలో కొనసాగుతున్నప్పటికీ 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి పదేళ్లు గడిచినప్పటికీ పార్లమెంటులో చట్టం చేయని బిజెపి పై ఎటు చంద్రబాబు నాయుడు అటు మందకృష్ణ మాదిగ పోరాటం చేయకుండా వారితో ఎందుకు పొత్తు పెట్టుకున్నారు. అధికారం కోసము చంద్రబాబు నాయుడు ప్యాకేజీ కోసము మందకృష్ణ మాదిగ మాదిగ జాతిని బిజెపికి తెలుగుదేశానికి తాకట్టు పెట్టలేదా? మాదిగల్లో 80 శాతం క్రైస్తవులు ఉన్న కారణంగా తెలంగాణలో ఒక్క ఎమ్మెల్యే గాని ఎంపీ గాని చివరికి మందకృష్ణ మాదిగ సొంత జిల్లా వరంగల్లో బిజెపి నుండి ఎవరు గెలవలేదు. మాదిగ జాతి మొత్తం మందకృష్ణ చెప్పినట్టు వింటే కనీసం ఎమ్మెల్యే కూడా తన సొంత రాష్ట్రం తెలంగాణలో ఎందుకు గెలవలేదు. గత 30 సంవత్సరాలుగా అన్ని రాజకీయ పార్టీలు చివరికి ఉద్యమ నేత మాదిగ మాదిగ ఉపకులాలను మోసం చేస్తూ సాధ్యం కానీ 341 అధికరణ సవరణ పై డిమాండ్ చేస్తూ క్లిష్టమైన రాజ్యాంగ ప్రక్రియ భారత రాజ్యాంగ అధికరణ 341 సవరించాలంటే నేను పైన చెప్పినట్లు దాదాపు అసాధ్యం. 303 సీట్లతో సొంత మెజార్టీ ఉన్నప్పుడే వర్గీకరణ చేయని బిజెపి ప్రభుత్వం 240కి పడిపోయిన నేటి పరిస్థితులలో ముఖ్యంగా చంద్రబాబు మద్దతు కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వం వారికి మద్దతు ఇచ్చిన మందకృష్ణ మాదిగ ఈ పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎందుకు డిమాండ్ చేయడం లేదు.

**మందకృష్ణ మాదిగ, చంద్రబాబు నాయుడువి స్వార్థ రాజకీయాలు**


సుప్రీంకోర్టులో ఆయన కేసు వేయలేదు. పెండింగ్ లో ఉన్న తీర్పుకు ఆయనకు సంబంధం లేదు. అయినా సుప్రీంకోర్టు నెపంతో ఇటు బిజెపి అటు మందకృష్ణ మాదిగ, చంద్రబాబు నాయుడు తమ స్వార్థ రాజకీయాల కోసం మరోసారి మాదిగల ఉప కులాలను మోసం చేయడానికి పార్లమెంటులో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేయకపోవడం ఈ అంశాలను వర్గీకరణకు మద్దతిస్తున్న ఏ రాజకీయ పార్టీ కూడా లేవనెత్తకపోవడం దేశంలో ఉన్న 30 కోట్ల మంది దళిత జాతిని మోసం చేయడం కాదా? అయినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సమస్యకు 341 సవరణతో సంబంధం ఏమిటి? ఎందుకు దానితో లింకు పెట్టి అటు అగ్రకుల జాతీయ ప్రాంతీయ పార్టీలు ఇటు మందకృష్ణ మాదిగ ఇతర మాదిగ సంఘాలు మాల మహానాడు గత 30 సంవత్సరాలుగా మాల మాదిగ ఉపకులాలను మోసం చేస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారం 341 సవరణ లో లేదు దాన్ని సవరించడం అసాధ్యం. నేను మొదటి నుండి చెబుతున్నట్లుగా 371 డి ద్వారా మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్ట ప్రకారం అన్ని సమస్యలు పరిష్కారము ఆంధ్ర తెలంగాణ మధ్య పరిష్కరిష్కరించుకుంటున్న రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వర్గీకరణ సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల కోట్లాదిమంది దళిత జాతిని ఇంకెంతకాలం మీరు మోసం చేస్తారు. ఆంధ్రప్రదేశ్లో నారా చంద్రబాబు నాయుడు తెలంగాణలో ఎనుముల రేవంత్ రెడ్డి ఇద్దరు వర్గీకరణ జరగాలని మొదటి నుండి మాదిగ దండోరా ఉద్యమాన్ని సంపూర్ణంగా మద్దతు ఇచ్చిన నాయకులు గురు శిష్యులు కూడా జులై 6న ఈ ఇద్దరు సమావేశం జరుపుతున్నారు. రెండు రాష్ట్రాల మధ్య సుదీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న అనేక సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనాలని చర్చలు చేయబోతున్న క్రమంలో వర్గీకరణ సమస్యను కూడా పరిష్కరించాలని మాదిగ దండోరా కానీ మాల మహానాడు కానీ ఎందుకు డిమాండ్ చేయడం లేదు.

**బీజేపీ ఎందుకు పరిష్కరించదు..?**

మరి తెలంగాణ కంటే సామాజిక ప్రజాస్వామ్య న్యాయబద్ధ పోరాటమైన వర్గీకరణ సమస్యను బిజెపి ఎందుకు పరిష్కరించడం లేదు. ఎందుకంటే ఈ రెండు అగ్రకుల జాతీయ పార్టీలు దేశంలోని అగ్రకుల ప్రాంతీయ పార్టీలకు వర్గీకరణ సమస్య పరిష్కరించబడితే దళిత జాతి ఉత్తరప్రదేశ్లో మన్య శ్రీ కాన్షీరామ్ బాటలో పైనుంచి రాజకీయ అధికారాన్ని చేపట్టి తమ సమస్యల్ని తామే పరిష్కరించుకునే స్థాయికి ఎదుగుతారని కుట్ర పన్నిన నయా మనపు నారా చంద్రబాబు నాయుడు ఆడిన కుట్రలో భాగంగా భారత రాజ్యాంగాన్ని మార్చి మను ధర్మాన్ని యధాతథంగా అమలు చేయడానికి కుట్ర చేసిన బిజెపిని 2024 ఎన్నికల్లో భగ్నం చేసిన భారత దళిత జాతి ప్రజాస్వామ్య లౌకిక శక్తులు ఏకమై అడ్డుకున్నాయి కాబట్టే బిజెపి 400 సీట్లు వస్తాయని ఛాలెంజ్ చేస్తే 240 సీట్లకు పరిమితం చేశారు సామాన్య ప్రజలు దళిత ద్రోహి క్రైస్తవ మైనార్టీ ద్రోహుల పార్టీ బిజెపిని తన స్వార్థం కోసం ప్యాకేజీ కోసం క్రైస్తవుడైన మందకృష్ణ మాదిగ క్రైస్తవుల వ్యతిరేకి మణిపూర్ లో మారణ హెూమాన్ని సృష్టించి వందలాదిమంది క్రైస్తవులను మంటల్లో కాల్చి వేలాదిమంది క్రైస్తవులను తమ సొంత ప్రాంతము నుండి బలవంతంగా తరిమేసిన బిజెపిని సమర్థిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దక్షిణాదిలో బిజెపిని బలోపేతం చేయడానికి ప్రయత్నించిన మందకృష్ణ మాదిగ దళిత ద్రోహి బిజెపి మనువాద ఎత్తుగడలను భగ్నం చేసింది దళిత జాతి అందులో ప్రధానంగా క్రైస్తవ మాదిగలు తెలంగాణలో ఒక్క ఎమ్మెల్యే గాని ఎంపీ గాని షెడ్యూల్ కులాల రిజర్వు స్థానాల్లో బిజెపి గెలువక పోవడానికి ప్రధాన కారణం మాదిగలంతా క్రైస్తవ వ్యతిరేకి లౌకిక ప్రజాస్వామ్యక వ్యతిరేకి అయిన బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించారు తన సొంత గడ్డ వరంగల్ పార్లమెంటులో సైతం మాదిగకు సీటు ఇవ్వని కాంగ్రెస్ పార్టీని బలపరిచారు మాదిగలు ఎందుకంటే కాంగ్రెస్ మీద ప్రేమతో కాదు బిజెపి మీద ఉన్న వ్యతిరేకతతో నాగర్ కర్నూల్ పెద్దపల్లి పార్లమెంట్ లలో కూడా మాదిగలకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోయినప్పటికీ మను ధర్మ పార్టీ అయినా బిజెపిని గెలిపించకుండా సెక్యులర్పా ర్టీ అయినా కాంగ్రెస్ పార్టీని మెజార్టీ క్రైస్తవ మాదిగలంతా బలపరిచారు అయినా కూడా ఆత్మ పరిశీలన చేసుకొని అధినాయకుడు ఇంకా మాదిగ జాతిని వేలాది సంవత్సరాలుగా బానిసత్వంలోకి నెట్టిన మనుధర్మాన్ని పాటిస్తున్న బిజెపిలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్న మందకృష్ణ మాదిగను మాదిగ జాతి క్షమిస్తే శాశ్వత బానిసత్వంలోకి మాదిగ జాతి నెట్టబడుతుంది అందుకే జూలై 7 2024 సంవత్సరములు ఆంధ్రప్రదేశ్లోని ఏ ఈదిమూడి గ్రామంలో మాదిగ దండోరా ఉద్యమం మొదలైందో అదే గ్రామంలో మాదిగల జన జాతర పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఎంఆర్పిఎస్మా దిగ జాతిని మోసం చేస్తున్న అది నాయకత్వాన్ని ప్రశ్నించడానికి సిద్ధమైంది.

## 30 ఏళ్ల వర్గీకరణ సమస్యను పరిష్కరించాలి





### మందకృష్ణ మాదిగ ఇంకెంతకాలం మాదిగ జాతిని మోసం చేస్తారు?


సుప్రీంకోర్టు జడ్జిమెంట్ పేరుతో మందకృష్ణ మాదిగ ఇంకెంతకాలం మాదిగ జాతిని మోసం చేస్తారు. సుప్రీంకోర్టు 341 సవరణకు ఒకవేళ అనుకూలంగా జడ్జిమెంట్ ఇచ్చినప్పటికీ నేను పైన చెప్పిన రాజ్యాంగ ప్రక్రియ జరగకుండా కేంద్ర ప్రభుత్వము సుప్రీంకోర్టు జడ్జిమెంట్ మీద ఆధారపడి పార్లమెంట్లో చట్టం చేయకుండా నిర్ణయం తీసుకోలేదు జమ్మూ కాశ్మీర్ సుదీర్ఘ సమస్యను కేవలం రాష్ట్రపతి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా పరిష్కరించిన బిజెపి ప్రభుత్వము అంతకంటే సింపుల్ పరిష్కారమైన 371 డి రాష్ట్రపతి ఉత్తర్వలను సవరించి వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వకుండా సుప్రీంకోర్టు తీర్పు కోసం వేచి చూడడం అంటే మళ్లీ దేశంలోని కోట్లాదిమంది దళిత జాతిని మోసం చేయడమే సుప్రీంకోర్టు జడ్జిమెంట్ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చినప్పటికీ పార్లమెంట్లో చట్టం చేయడము అసాధ్యం ఎందుకంటే షెడ్యూల్ కులాల పార్లమెంటు సభ్యులు 100కు పైగా వర్గీకరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారు. కేవలము 8 మంది మాత్రమే ఈ సమస్యకు అనుకూలంగా ఓటు వేసే అవకాశం పార్లమెంట్లో ఉంది దేశంలోని ఏ అగ్రకుల పార్టీకి ఈ సమస్యను పరిష్కరించడం ఇష్టం లేదు. తెలంగాణ ఉద్యమం ఎంతైతే ప్రజాస్వామ్యమైన ఉద్యమమో అంతకంటే ఎక్కువ ప్రజా సామ్యమైనది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల రిజర్వేషన్ వర్గీకరణ సమస్య గత 30లుగా ఎందుకు పరిష్కరించడం లేదు. దేశంలో ఉత్తరాది ఆధిపత్యాన్ని శాశ్వతంగా కొనసాగించడానికి తెలంగాణ పేరుతో కేవలం 42 ఎంపీ స్థానాలు ఉండి అన్ని రంగాల్లో ఉత్తరప్రదేశ్ కంటే అభివృద్ధి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజించి అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ కంటే వెనుకబడిన 80 ఎంపీలు కలిగిన ఉత్తరప్రదేశ్ ను నాలుగు రాష్ట్రాలుగా విభజించాలని 2013లో ఆనాటి ముఖ్యమంత్రి కుమారి మాయావతి అసెంబ్లీ తీర్మానం చేస్తే వ్యతిరేకించిన ఉత్తరాది జాతీయ పార్టీలైన కాంగ్రెస్ బిజెపిలు యూపిని విభజించకుండా ఏపీని మాత్రమే విభజించి దక్షిణాది రాష్ట్రాల్లో పెద్ద రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ను విభజించి తెలంగాణ సమస్య పరిష్కరించారు.



- ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్
మాజీ డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ లా "ఉస్మానియా & తెలంగాణ విశ్వ విద్యాలయం,
ఫోన్: 93901 19889

# సాహిత్య రంగంలో వసంత పురోగమనం

నిత్య కృషితో సాహిత్య, సామాజిక సేవా కార్యక్రమాలలో రాణిస్తూ ఎన్నో విశిష్ట అవార్డులు, పురస్కారాలను కరీంనగర్కు చెందిన ఉపాధ్యాయురాలు,కవయిత్రి పత్తెం వసంత పొంది పేరొందారు. చిన్ననాటి నుండి ఏర్పడిన సాహిత్యాభిలాషతో జరిగే సంఘటనల పట్ల ఆమె స్పందిస్తూ కవిత్వం రాసేవారు. క్రమంగా సాహిత్యం అధ్యయనంతో పట్టు సాధించి అనేక కవితలు, వ్యాసాలను ఆమె రచించి పేరు పొందారు. ఎన్నో ప్రతిష్టాత్మకమైన పురస్కారాలు, అవార్డులు, సత్కారాలను ప్రభుత్వం నుండి, పేరొందిన సాహిత్య సాంస్కృతిక సంస్థల నుండి ఆమె అందుకున్నారు.




**మధ్యతరగతి నుండి...**

కరీంనగర్లోని కట్టా రాంపూర్లో మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంలో అమృతమ్మ దేవయ్య దంపతులకు జన్మించిన వసంతకు పదవ తరగతి పూర్తి కాగానే వివాహమైంది. ఆగిపోయిన చదువు భర్త అమిరిశెట్టి కిషన్ ప్రోత్సాహంతో కొనసాగించారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ రాసి ఉత్తీర్ణులై మూడేళ్లు చదివి బిఏ డిగ్రీని పూర్తి చేశారు. తన పేరు పక్కన బిఏ డిగ్రీని చూసుకోవాలన్న కల నెరవేరడంతో ఇంకా ఎంతో ఆత్మవిశ్వాసం పెంచుకుని కాకతీయ యూనివర్సిటీ ఎస్డిఎల్సిఇ నుండి ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేశారు. అనంతరం ఎంఏ తెలుగులో చేరి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. తదనంతరం బి.ఇడి, ఎంఏ సోషియాలజీ, ఎంఇడి, పిజిడిడిఇ విద్యార్హతలను ఎంతో దీక్షతో చదివి సాధించారు.

**విద్యా రంగంలో గుర్తింపు**

ఉన్నత విద్యార్హతలు పొందాక కాకతీయ యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాలలో కౌన్సిలర్గా డిగ్రీ, పిజి విద్యార్థులకు ఆదివారం తరగతులను బోధించడం ప్రారంభించారు. బిఇడి, టిపిటి కళాశాలల్లో టీచర్ ఎడ్యుకేటర్గా దశాబ్దానికి పైగా పని చేసి ఎందరో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించారు. అనంతరం ఆడపిల్లల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కెజిబివి పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరారు. బాలికల విద్యా ప్రగతికి తోడ్పడంతో పాటు పర్యావరణం వంటి అంశాలపై అవగాహనను పెంపొందింపజేస్తున్నారు. తాను పనిచేసే తిమ్మాపూర్ కెజిబివి పాఠశాలలో విద్యార్థినులు, సిబ్బందితో కలిసి పర్యావరణ పరిరక్షణలో భాగంగా 1000 మొక్కలు నాటగా అందులో దాదాపు 750 మొక్కలు వృక్షాలుగా ఎదిగి చల్లని గాలి, నీడతో పాటు మంచి ఫలాలను కూడా అందిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమంతో పాటు ఉపాధ్యాయ సంఘాల కార్యక్రమాలు, మహిళా , సామాజిక , సాహిత్య , విద్య, సాంస్కృతిక సదస్సులు, సమావేశాలలో ఆమె పాల్గొన్నారు. పదవ తరగతితో ఆగిపోయిన చదువును గృహిణిగా ఆత్మ నిబ్బరంతో ఉన్నత స్థాయి వరకు కొనసాగించి హైస్కూల్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు బోధించే వరకు చేరుకోవడం, కవయిత్రిగా సాహిత్య రంగంలో రచనలు చేస్తూ మూడు పుస్తకాలను వసంత ప్రచురించడం ప్రశంసనీయం.

**సాహిత్యం లో నిత్య కృషి**

సాహిత్యంపై ఉన్న ఆసక్తితో అనేక కవితలు, వ్యాసాలు రాసి వివిధ పత్రికలలో వసంత ప్రచురించారు. పలు యూట్యూబ్ ఛానల్లలో ఇతర ప్రసార మాధ్యమాలలో కూడా వివిధ ప్రత్యేక సందర్భాలలో ఆమె కవితలు, ప్రసంగాలు ప్రసారమయ్యాయి. ఆడపిల్లల చదువు, పర్యావరణం, సమానత, సాధికారత సంస్కృతీ సంప్రదాయాలు తదితర ఎన్నో అంశాలపై వసంత రచనలు చేసి ప్రముఖుల నుండి ప్రశంసలు పొందారు.

**కుటుంబ నేపథ్యం**

ఎంఏ తెలుగు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఎంఇడి, పిజిడిడిఇ విద్యార్హతలున్న వసంత భర్త అమిరిశెట్టి కిషన్ మూడు దశాబ్దాలు ఉపాధ్యాయులుగా సేవలందించి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేశారు. పెద్దకూతురు విద్యశ్రీ ఎంపిటి ఆర్థో, అల్లుడు నరేందర్ ఎండి పల్మనాలజీ, చిన్న కూతురు డాక్టర్ మానసవీణ ఎంపిటి కార్డియో, అల్లుడు కరుణాకర్ ఎండి అనస్థీసియా పూర్తి చేసి వైద్య వృత్తిలో రాణిస్తున్నారు. స్నితిక్ పటేల్, అదిత్ పటేల్, అరుష్ పటేల్ మనవళ్లు కాగా చెరిష్య పటేల్ మనవరాలు. వసంత ప్రోత్సాహంతోనే ఆమె మనవడు మాస్టర్ స్నితిక్ పటేల్ 6వ తరగతిలోనే ఆంగ్లంలో కథలు రాసి ది టువెల్ పెరల్స్ అనే పేరుతో సంకలనాన్ని వెలువరించి రాష్ట్ర స్థాయిలో బాలరత్నతో పాటు కరీంనగర్ జిల్లాలో అవార్డులను, సత్కారాలను, ప్రముఖుల ప్రశంసలను పొందారు.

**లభించిన పురస్కారాలు**

- సాధికారిక బతుకమ్మ (తెలంగాణ ఉమెన్ ఎంప్లాయిస్ అసోసియేషన్) 2014
- కృషి సహస్ర కవి సమ్మేళనం 2017
- ప్రపంచ తెలుగు మహాసభలు 2017
- అస్తిత్వం రాష్ట్ర స్థాయి సాహిత్య అవార్డు 2018
- శిల్పకళా కవితా వైభవం ... యాదాద్రి 2018
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ( శతాధిక జాతీయ మహిళా కవి సమ్మేళనం 2019)
- ఉదయ సాహిత్య అర్ధశతాధిక కవిసమ్మేళనం 2019
- పాలమూరు జాతీయ మహిళా కవిసమ్మేళనం 2019
- మల్లీనాధుని కళాపీఠం వారి దిశ కవిసమ్మేళనం 2019
- పూల సంగిడి రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం 2019
- పూల సంగిడి... తెలంగాణ జాగృతి 2019
- తెలంగాణ తెలుగు భాష సంరక్షణ సంఘం 2019
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం (ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పిఆర్టియూ 2020)
- అస్తిత్వం రాష్ట్ర స్థాయి తెలుగు భాష ఉపాధ్యాయ అవార్డు 2020
- జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కరీంనగర్ 2020
- ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రశంసాపత్రం 2020
- మహారాష్ట్ర తెలుగు మంచ్ పురస్కారం 2020
- పున్నమి సాహిత్య పురస్కారం 2020
- మహానటి సావిత్రి కళాపరిషత్ కొత్తపట్నం 2020
- రాష్ట్రేతర తెలుగు సమాఖ్య 2020
- బతుకమ్మ ఫౌండేషన్ 2020
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాయలసీమ యూనివర్సిటీ, కర్నూల్ 2020
- శ్రీ పద్మావతి మహిళా కళాశాల, తిరుపతి 2020
- ఇంటర్నేషనల్ వెబినార్ 21 సెంచరీ ఉమెన్ నావెల్స్ 2020
- చిలకమారి లచ్చయ్య పురస్కారం 2020
- మహారాష్ట్ర మంచ్ సాహితీ అవార్డు 2021
- ఉత్తమ మహిళా ఉపాధ్యాయ అవార్డు 2021
- సావిత్రిబాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డు 2022
- గోల్కొండ కవి యాత్ర సన్మానం 2023
- స్త్రీ శక్తి పురస్కారం కరీంనగర్, తిమ్మాపూర్ 2023
- కరీంనగర్ జిల్లా ప్రభుత్వ యంత్రాంగ ప్రపంచ మహిళా దినోత్సవ ఉత్తమ రచయిత్రి పురస్కారం 2024

**సమీక్షకురాలిగా సత్కారాలు**

- మనిషి మేల్కొని దెన్నడో హైద్రాబాదు రవీంద్రభారతి 2018
- పసి మొగ్గలు హైద్రాబాదు 2019

మానవ జీవితాన్ని వెలుగు వైపు నడిపించే బలమైన శక్తి కవిత్వానికి ఉందని భావించి ఆలోచనాత్మకమైన రచనలు అందిస్తున్న కవయిత్రి, రచయిత్రి వసంత. భవిష్యత్తులో జీవన లోతులను ప్రతిబింబించే ఎన్నో విశిష్టమైన రచనలు చేయడంతో పాటు ఉపాధ్యాయురాలిగా బోధనారంగంలో సైతం ముందుకు సాగాలని కోరుకుందాం.

### వెలువరించిన పుస్తకాలు

రచనలెన్నో చేసిన వసంత 2020లో ఆకుపచ్చని ఆశ పేరుతో తొలి కవితా సంపుటి ప్రచురించి కరీంనగర్లో అప్పటి జిల్లా అదనపు పరిపాలనాధికారి జి శ్యామ్ప్రసాద్లాల్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. 2022లో వసంత రెండవ కవితా సంపుటి ఆలోచనల రెక్కలును కరీంనగర్లోని అధ్యయన కేంద్ర సమావేశ మందిరంలో విద్యార్థుల సమక్షంలో అప్పటి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాజేందర్రెడ్డి ఆవిష్కరించారు. 2023లో ప్రచురితమైన వసంత మూడవ కవితా సంపుటి ఆకాశమే అవధిగా హైద్రాబాదు బుక్ఫెయిర్లో ఢిల్లీ ప్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, ప్రఖ్యాత కవి ఆశారాజు, సీనియర్ రచయిత నేలంటి మధు చేతుల మీదుగా ఆవిష్కృతమైంది. ఆకుపచ్చని ఆశ, ఆలోచనల రెక్కలు, ఆకాశమే అవధిగా కవితా సంపుటులకు అనేక సాహితీవేత్తల నుండి మంచి ప్రశంసలందాయి. ఆకుపచ్చని ఆశ కవితా సంపుటి 2021 - 22 సంవత్సరానికి గాను ప్రభుత్వం ఆధ్వర్యంలోని ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి రాజారాం మోహన్రాయ్ లైబ్రరీ ఫౌండేషన్, కలకత్తా వారి పుస్తక స్వీకరణ పథకం క్రింద ఎంపికై వసంత నిత్య సాహిత్య కృషికి మంచి గుర్తింపును తెచ్చింది.



- తాడిశెట్టి శ్రీనివాస్
ఫోన్ : 92905 89562




# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే**

**విశ్వంభర, భూపాలపల్లి :** యువత మత్తు పదార్థాలు వాడితే జీవితం అంధకారమవుతుందని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శనివారం కాటారం పోలిసు స్టేషన్ ఆవరణలో కాటారం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో యువత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల పట్ల దూరంగా ఉండాలని, అవగాహన కార్యక్రమం నిర్వహించగా.. ఎస్పి హాజరయ్యారు. ఆ తర్వాత గంజాయి సేవించే వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు మందు వాడడం వలన శరీరంలో తెలియని మార్పులు చోటు చేసుకొంటాయన్నారు. విద్యార్థులు చెడు మార్గాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ బారిన పడి ఎంతో మంది జీవితాలు దుర్భరం అయ్యాయని, వ్యసనాలకు బానిసలుగా కారాదన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు, గంజాయి గురించిన సమాచారం తెలిస్తే ప్రజలు, స్థానిక పోలీసులకు గాని, డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అన్నారు. అంతకు ముందు నూతన సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్)తో కాటారం సబ్ డివిజన్ పరిధిలో పోగొట్టుకున్న 11 ఫోన్లను ఎస్పి బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాటారం డిఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, కాటారం సిఐ నాగార్జునరావు, అభినవ్, నరేష్, మహేందర్, హరీ శంకర్, చక్రపాణి పాల్గొన్నారు.

# ఐటీఐ భవన నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** ఐటిఐ కాలేజి భవన నిర్మాణ పనులను త్వరిత గతిన ప్రారంభించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం కాటారం మండలం గంగారం గ్రామంలో ఐటిఐ కాలేజి నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంగారం గ్రామంలోని కేజీవిబి పాఠశాలకు ఆనుకొని 7 ఎకరాల స్థలాన్ని ఐటిఐ కాలేజి నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. గతంలో టెండర్లు పిలువగా ఒక గుత్తేదారు నిర్మాణ పనులు దక్కించుకోవడం జరిగిందని, కానీ ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదని అధికారులు తెలుపగా వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని, లేదంటే గుత్తే దారు కాంట్రాక్టు రద్దు చేసి మరొకరికి కేటాయిస్తామని తెలిపారు. స్థలం అన్యాక్రాంతం కాకుండా స్థలం చుట్టూ కంచె వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నాగరాజు, ఐటీఐ కళాశాల పాల్గొన్నారు.

# మాదిగల దండోరా రజతోత్సవాలకు తరలిరావాలి

**ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కుమ్మరికుంట్ల గణేష్ మాదిగ**



**విశ్వంభర, ఆత్మకూరు (ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు భారత తొలి ప్రధాని సమసమాజ స్థాపనకై కృషిచేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించి దండోరా రజతోత్సవాల కరపత్రాన్ని రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కుమ్మరి కుంట్ల గణేష్ మాట్లాడుతూ మాదిగ హక్కుల ఉద్యమం మొదలైన నుంచి 30 సంవత్సరాలు రజతోత్సవాలు జరుపుకోవడానికి ప్రతి పల్లె నుంచి ఢిల్లీ వరకు 30 వసంతాలు(7 జులై 1994)పూర్తి చేసుకున్న మన మహా శబ్దం డప్పుకు మాదిగ కులంలో పుట్టిన ప్రతి ఒక్కరి బాధ్యతగా జులై 7న దండోరా పుట్టిన సంబరాలను అంబరాలకు తాకేటట్లుగా ప్రతి మాదిగ ఇంట్లో పండుగ జరపాలన్నారు. రవీంద్రభారతిలో ఆదివారం జరిగే మాదిగల దండోరా రజతోత్సవాలకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్తుపుల స్వామి మాదిగ, మండల ఇంచార్జ్ మేడి శ్రీనివాస్ మాదిగ, మాజీ మండల అధ్యక్షుడు పంది రవీందర్ మాదిగ, సంఘ పాక స్వామి మాదిగ, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు కదిరే నవీన్ మాదిగ, మండల నాయకులు వస్తువుల ఎల్లయ్య మాదిగ, మేడి చంద్రయ్య మాదిగ, మేడి బాలకృష్ణ మాదిగ, కదిరే దశరథ మాదిగ, గట్టు శంకర్ మాదిగ, మేడి నర్సింగరావు మాదిగ, కొమ్ము ముత్తయ్య మాదిగ తదిరులు పాల్గొన్నారు.

# సంపూర్ణత అభియాన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా యాస్పిరేషనల్ బ్లాక్ ప్రారంభం
- కలెక్టర్ రాహుల్ శర్మ




**విశ్వంభర, భూపాలపల్లి :** వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా యాస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. పలిమెల మండల కేంద్రంలో సంపూర్ణత అభియాన్ ప్రారంభ కార్యక్రమంలో కలెక్టరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నుంచి సంపూర్ణతా అభియాన్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో గ్రామీణ అభివృద్ధి శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖలచే ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా నీతి ఆయోగ్ దేశవ్యాప్తంగా 500 బ్లాకులను ఎంపిక చేయగా అందులో మన జిల్లా నుంచి మహాముత్తారం, పలిమెల మండలాలు ఎంపికైనట్లు తెలిపారు. జూలై 4 నుంచి సెప్టెంబర్ 30, 2024 వరకు సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సూచించిన పారామీటర్ల ప్రకారం అన్ని శాఖలు పనిచేయాలని ఆదేశించారు. మండలంలోని ప్రతీ గడపకు ఈ కార్యక్రమం చేరాలని నూటికి నూరు శాతం లక్ష్యం సాధించాలని కోరారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన నవజాత శిశువులు జన్మిస్తారని, గర్భ నిర్ధారణ జరిగిన నాటి నుంచి క్రమం తప్పక వైద్య సేవలు పొందే విధంగా వైద్య, మహిళా సంక్షేమ శాఖలు కృషి చేయాలని ఆదేశించారు. మండలంలో 30 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ మధుమేహం, బీపీ పరీక్షలు చేయించుకోవాలని నిర్ధారణ అయినవారికి ఉచితంగా మందులు అందించనున్నట్లు తెలిపారు. వానాకాలంలో దోమలు వ్యాప్తితో వ్యాధులు ప్రభలకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. మహిళలు సాధికారత లక్ష్యంగా మహిళా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ మంజూరు చేస్తామన్నారు. మండలంలో 22 సంఘాలకు 3.30 లక్షల రివాల్వింగ్ ఫండ్ మంజూరైనట్లు తెలిపారు. 113 అంగన్వాడీలలో 31 పోషన్ వాటికలో 50 అంగన్వాడీలలో ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ద్వారా పరిశుభ్రమైన తాగునీరు అందిస్తూ.., పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం కోసం గర్భిణులుకు వారానికి 4 కోడి గుడ్లు అందిస్తున్నామన్నారు. అంగన్వాడీలలో పండ్లు, కూరగాయల మొక్కలు పెంచాలని, రక్తహీనత ఉన్నవారిని గుర్తించి పౌష్టిక ఆహారం అందించాలని పిల్లల నుంచి వృద్ధుల వరకు మహిళా సంక్షేమ శాఖ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు, పిల్లలు వేధింపులు, హింసకు గురైతే 1088 నంబర్ ద్వారా సహాయక కేంద్రాలకు సమాచారం ఇవ్వాలన్నారు. మండలంలో 1850 మంది రైతులు 5 వేల ఎకరాల్లో మిర్చి, పత్తి, వరి పంటలను సాగుచేస్తున్నారని, మట్టి నమూనాలను సేకరించి అనువైన పంటల గురించి అవగాహన కల్పిస్తామన్నారు. రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. సారవంతమైన భూమి మండలాన్ని అన్ని రంగాల్లో అగ్రగామగా నిలిచేందుకు ఈ సంపూర్ణతా అభియాన్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా పరిషత్ పాఠశాలగా మార్చాలని, తాగు నీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కలెక్టర్‌ని కోరారు. అంతకు ముందు కలెక్టర్ పోలీస్ స్టేషన్ దగ్గర ఎంపీడీవో, తహసిల్దార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. తక్షణమే నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, యాస్పిరేషనల్ ప్రొఫెషనల్ గాయత్రి, సిపిఓ సామ్యూల్, డిఎంహెచ్ ఓ మధుసూదన్, డిపిఓ నారాయణరావు, డిఆర్డిఓ నరేష్, ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు, వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, మహిళా సంక్షేమ అధికారి అవంతి, డీఈఓ రాజేందర్, పిఆర్ ఈఈ దిలీప్, తహసీల్దార్ హేమ, ఎంపిడిఓ శ్రీనివాస్, సీడీపీవో ఆర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

విద్యార్థులు వ్యాధుల బారినపడకుండా వ్యక్తి గత పరిశుభ్రత పాటించే విధంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆయన పలిమెలలోని కేజీబీవీ పాఠశాలను అకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. పాఠశాలలో పెండింగ్ ఉన్న మరమతులను పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కళాశాల ఆవరణలోని ఖాళీ ప్రాంతంలో మునగ, కరివేపాకు, చింత తదితర మొక్కలు నాటాలని సూచించారు. విద్యార్థులకు అనుగుణంగా మరుగుదొడ్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పీఆర్ ఈఈ దిలీప్, తహసిల్దార్ హేమ, ఎంపీడీవో శ్రీనివాస రావు, కెజిబివి ఎస్ ఓ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**విశ్వంభర, చివ్వెంల :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తూ వస్తుందని, ఇది చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని కుంటి సాకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ వేణారెడ్డి, మండల అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్, గాయం చంద్రశేఖర్ రెడ్డి, వాసుదేవ రావు, ఏడుకొండలు, శివరాత్రి కృష్ణ, అనంతుల సైదులు, లింగాల సంతు, హరికృష్ణ, యల్లయ్య, వెంకన్న, గుద్దేటి వెంకన్న, రమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.



# 24 గంటల్లో సమస్యకు పరిష్కారం

- 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**విశ్వంభర, షాద్‌నగర్ :** కొందుర్గ్ మండలం ఆగిర్యాల, వెంకిర్యాల, విశ్వనాథ్ పూర్, తంగెళ్లపల్లి, తిరుమల దేవుని పల్లి, ఘాటియ తాండ, నాగార్జున హచరిస్ రైతులు కరెంట్ ఓవర్‌లోడ్‌తో విద్యుత్ అంతరాలను ఎదుర్కొం టూన్నారు. ఇట్టి సమస్యను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొందుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకొచ్చిన వెంటనే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి 24 గంటల్లోనే 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ ను మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో 24 గంటల్లో 5 ఏంవిఏ పవర్ ట్రాన్స్ఫర్‌ను మంజూరు చేయించుకోవడమే కాకుండా వెంటనే పనుల ను కూడా ప్రారంభించడంతో 10 గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# డీఎస్సీ పరీక్షలపై అభ్యర్థులకు టీ సాట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్స్

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించబోయే డీఎస్సీ పరీక్షపై అభ్యర్థులకు అవగాహన కల్పించేందుకు టీ సాట్ స్పెషల్ లైవ్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసినట్లు సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి శనివారం ఈ పత్రికా ప్రకటనలో తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 11,062 పోస్టులకు నిర్వహించే డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు జూలై ఎనిమిదవ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు గంట పాటు నిపుణ ఛానల్‌లో అనుభవం కలిగిన ఫ్యాకల్టీ చే ప్రత్యేక లైవ్ కార్యక్రమాలు ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పండిట్స్, పీఈటీ, స్పెషల్ క్యాటగిరీ టీచర్లకు ఉపయోగపడే విధంగా ప్రత్యక్ష ప్రసారాలుంటాయని సీఈవో వేణుగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య ఛానల్‌లో సాయంత్రం ఏడు నుంచి ఎనిమిది గంటల వరకు పునః ప్రసారమౌతాయన్నారు.



# గ్రామ పంచాయతీల బకాయిలు చెల్లించాలి

- బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డికి రాష్ట్ర సర్పంచుల సంఘం వినతి

**విశ్వంభర, ఆమనగల్లు :** తెలంగాణ గ్రామ పంచాయతీలలో పెండింగ్‌లో ఉన్న బిల్లుల విషయమై భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, నిర్మల్ శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో 2019 – 2024 కాలవ్యవధిలో సర్పంచులుగా కొనసాగి రాష్ట్రవ్యాప్తంగా సొంత గ్రామ పంచాయతీ పరిధిలో అప్పటి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు మరియు ఆదేశాల మేరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, గ్రామపంచాయతీలలో వీధిలైట్ల నిర్వహణ, అంతర్గత మురుగు కాలువల ఏర్పాటు, పల్లె ప్రకృతి వనం, రైతు వేదిక, వైకుంఠధామం, మనఊరు – మనబడి, పల్లెప్రగతి, మిషన్ భగీరథ లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో చేపట్టి తెలంగాణ గ్రామ పంచాయతీలను దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడంలో మా వంతు కృషి చేయడం జరిగిందని ఎమ్మెల్యేకు తెలియజేసినట్లు సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి తెలియజేసారు. పాలకమండలి గడువు ముగిసి ఐదు నెలలు కావోస్తున్నా.. ఇప్పటికీ పెండింగ్ బిల్లులు అందక 12,769 గ్రామపంచాయతీ సర్పంచుల బాధలు వెలకట్టలేనివని తెలిపారు. గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు, పారిశుధ్య కార్మికుల వేతనాలు మొత్తం వెంటనే చెల్లించే విధంగా అసెంబ్లీ సమావేశాలలో చర్చించి తమకు న్యాయం చేయాలని విన్నవించినట్లు సంఘం నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, ఉపాధ్యక్షులు సుర్వీ యాదయ్య గౌడ్, నత్తి మల్లేష్ ముదిరాజ్, మధుసూదన్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీరామ్ రెడ్డి, మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లా రెడ్డి, రామేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్, ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్ తదితరులు
– విశ్వంభర, హైదరాబాద్

# భయం గుప్పెట్లో భీమారం

- క్షుద్ర పూజల కలకలం
- వరుస ఘటనలతో ప్రజలు బెంబేలు
- అసలు ఏం జరుగుతుందని ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నిజాలను నివృత్తి చేయాలి



**విశ్వంభర, మెట్పల్లి :** మండలం మూఢనమ్మకాల ఊబిలో గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత లేని అమాయక ప్రజలు మూఢనమ్మకాలు కుబీలో కూరుకుపోతున్నారనడానికి వరస సంఘటనలు నిజం చేస్తున్నాయి. ఓవైపు ప్రభుత్వం ప్రజలు మూఢనమ్మకాల నిర్మూలనకై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే ఓ అధికారి మూఢనమ్మకాలను ప్రోత్సహించడం ఆందోళన కలిగించే పరిణామం మండల కేంద్రంలో చోటు చేసుకోవడం గమనార్హం. ఇటీవల తరచుగా భీమారం మండలంలో క్షుద్ర పూజలు మండల ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. మొన్నటికి మొన్న మండలంలోని ఒక ఇంటి దగ్గర క్షుద్ర పూజల అనవాళ్లు కనిపించాయి. అలాగే మన్నెగూడెం ఉన్నత పాఠశాల క్షుద్ర పూజల కలకలం రేపాయి. అనంతరం కమ్మరిపేట గ్రామంలో ఒక ఇంటి ముందు క్షుద్ర పూజల ఆనవాళ్లు ఆందోళనకు గురిచేశాయి. ఇవన్నీ మర్చిపోక ముందే తాజాగా మండల కేంద్రంలోని ఒక ఇంట్లో క్షుద్ర పూజలు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయని పెద్ద ఎత్తున వదంతులు రావడంతో పాటు కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు ఆ ఇంటిలోని పూజ గది మధ్యలో నాలుగు ఫీట్ల వెడల్పు ఎనిమిది ఫీట్ల పొడవు ఫ్లోరింగ్ తొలగించడం భారీ గుంత తవ్విన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో ఆ ప్రదేశాన్ని గ్రామస్తుల సమక్షంలో మట్టిని ఐదు పిట్ల లోతు వరకు తొలగించి చూడగా అందులో ఎలాంటి ఆనవాళు దొరకలేదు. భయంతో ఇల్లు కాలి చేస్తున్న చుట్టుపక్కల వాళ్లు సదరు ఇంటి పక్కనే ఉంటున్న లక్ష్మి తన భర్త మల్లయ్య కరోనా సమయంలో చనిపోయి ఒంటరిగా ఉంటున్న లక్ష్మి పక్కింట్లో జరుగుతున్న తతంగం చూసి భయంతో ఏకంగా ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయింది. మరొక కుటుంబంలోని భర్త ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లగా కుటుంబ సభ్యులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అదే వరుసలో నివాసం ఉంటున్న గుగ్గిల రవి గౌడ్ మాట్లాడుతూ స్థానికుల్లో ఇంకా భయం పోలేదని పూర్తిస్థాయిలో ప్రజల సమక్షంలో తవ్వకాల ప్రదేశాన్ని పరిశీలిస్తేనే అనుమానాలు తొలగిపోయి అవకాశం ఉంటుందని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా ఆ తవ్వకాలు జరిపిన ఇల్లు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ సెక్షన్ అధికారికి చెందినదని సదరు అధికారి కరీంనగర్ జిల్లాలో ఫారెస్ట్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. ఆ ఇంటిలో గత ఏడాది జులై నెల నుంచి అంటే సంవత్సరం కాలం పాటు భారీ ఎత్తున తవ్వకాలు జరుగుతున్నాయని రాత్రిపూట కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కారుల్లో వచ్చి తవ్వకాలు జరిపి ఉదయమే వెళ్లడం, గుప్త నిధుల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వ్యక్తులను రప్పించి సదరు ఇంటి యజమాని తవ్వకాలు జరుపుతున్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూజా సమయంలో జంతుబలులు కూడా జరుగుతున్నాయని వాటిని లోపలికి తీసుకెళ్లగా చూసినట్లు వడ్లకొండ శ్రీనివాస్ దురిశెట్టి శ్రీహరి తోపాటు కాలనీవాసులు చెబుతున్నారు. ఈ తతంగం మొత్తానికి 35 లక్షల వరకు ఖర్చు చేశాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని చెబుతుంటే సీసీ కెమెరా ఎందుకు పెట్టారని గొడవకు దిగిన ఇంటి యజమాని ఎదురింట్లో ఉండే తోట్ల అశోక్ తో పాటు చుట్టుపక్కల కుటుంబాల వారు రక్షణ కొరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో సదరు ఇంటి యజమాని తన ఇంటి వైపు సీసీ కెమెరా ఎందుకు బిగించారని గొడవకు దిగినట్లు తెలుస్తోంది. దీంతో కాలనీవాసులు అంతా ఏకమై ఇంటి రక్షణ కొరకు కెమెరా బిజిస్తే అభ్యంతరం తెలపడం ఎందుకని ప్రశ్నించినట్లు సమాచారం. ఇంటి యజమానులు కాక అజ్ఞాతవాక్తులు రావడం ఏందని అసలు ఇంట్లో ఏం చేస్తున్నారని ప్రశ్నించగా.. నా ఇల్లు నా ఇష్టం నేను నా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాను ప్రశ్నించడానికి మీరెవరు వచ్చే అమావాస్య లోపు మీ అంతు చూస్తాను అని బెదిరించడంతో కాలనీవాసుల్లో ఆందోళన మొదలైంది. ఇంతకు ఆ ఇంట్లో ఏం జరుగుతుంది. క్షుద్ర పూజల లేదా గుప్త నిధుల కోసం తవ్వకాల, లేదా వాటిని అడ్డుపెట్టుకొని ఇతర ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నార అర్ధరాత్రి వేళ మహిళల మాటలు కూడా వినిపించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమైతున్నాయి. వచ్చిన వారు ఎవరు ఆ ఇల్లు నే ఎందుకు ఎంచుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగి వారికి ఎందుకు సహకరిస్తున్నాడు దీని వెనుక మర్మం ఏమిటి గ్రామస్తులకు అంతుచిక్కని ప్రశ్నగానే మిగిలిపోయింది. ఏది ఏమైనా.., ఎలాంటి అవంచనీయ సంఘటన జరగకముందే అధికారులు స్పందించి ప్రజల ఆందోళనలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## భారీగా బెల్లం, పట్టిక పట్టివేత



### ఐదుగురి అరెస్ట్

**విశ్వంభర, కల్వకుర్తి :** తెలంగాణలో ఎక్సైజ్ శాఖ ఆగస్టు 31 నాటికి నాటు సారాని పూర్తిగా తుద ముట్టించాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ కల్వకుర్తి సర్కిల్ పరిధిలో ఉమ్మడి మహబూబ్నగర్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో నాటుసారా తయరీ దారులు, సరఫరా, అమ్మకం మరియు నల్ల బెల్లం రవాణ దారులపై జరిపిన తనిఖీల్లో 7 కేసులు నమోదు చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఈ సంధర్భంగా 26 లీటర్ల నాటుసారా, 40కేజీల బెల్లం,15 కేజీల పటిక స్వాధీనం చేసుకొని, 800 కిలోల బెల్లం పానకం ధ్వంసం చేశారు. శుక్రవారం రాతి కొట్ర గేట్ దగ్గర రూట్ వాచ్ చేస్తుండగ హైదాబాద్ గంజ్ నుండి అచ్చంపేట బోల్గట్ పల్లి తండాకు బాలెనో కారులో 19 బస్తాల్లో 570 కేజీల నల్ల బెల్లం 50 కేజీల పట్టిక తరలిస్తుండగ ముఢావత్ శివ అనేవ్యక్తిని అరెస్ట్ చేసి, కారు, జెల్లం స్వాధీనం చేసుకొని కేసునమోదు చేశామని ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్ తెలిపారు. ఈ దాడుల్లో సీఐ లు వెంకట్ రెడ్డి, రాజ్యలక్ష్మి, బాలకృష్ణారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి శారదలతో పాటు ఎస్సై సృజన్ లో టీటీఎఫ్ ఎస్టి టీం లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**విశ్వంభర, ఆమనగల్లు :** కడ్తాల్ మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా బాబు జగ్జీవన్ యూత్ అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ పాల్గొని నివాళులర్పించారు. అహర్నిశలు శ్రమించి ఎన్నో హక్కులను సాధించిపెట్టిన గొప్ప వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో మంగళపల్లి నరసింహ, ఐక్యవేదిక అధ్యక్షులు రాఘవేందర్, మంకీ శ్రీను, సిద్దిగారి వెంకటేష్, సిద్దిగారి దాసు, కొప్పు కృష్ణ, సిద్ధిగారి సురేష్, కాలే శీను, కంబాలపల్లి అంజి, కంబాలపల్లి శ్రీకాంత్ రాజేష్ పాల్గొన్నారు.

## బదిలీ అయిన టీచర్లకు ఘన సన్మానం



**విశ్వంభర, చింతపల్లి :** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఎస్ఎంసి చైర్మన్ కందుకూరి గిరి ఆధ్వర్యంలో శనివారం ప్రాథమిక పాఠశాలలో ఉత్తమ సేవలందించిన ప్రధానోపా ధ్యాయులు కొండూరు ఆంజనేయులు, ఉపాధ్యాయిరాలు లక్ష్మి, రాజేశ్వరి, అలివేలు, లక్ష్మీబాయి, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కందుకూరి గిరిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి, పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. బదిలీపై విచ్చేసిన ప్రధానో పాధ్యాయుడు బాలకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులను కూడా శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రైసున్నిసా బేగం, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, డిఆర్పి శేషు, ఓరుగంటి యాదయ్య, యుటిఎఫ్ అధ్యక్షుడు హనుమంతు, పలు పాఠశాలలు ఉపాధ్యాయులు, అటెండర్ మల్లేష్, మండల విద్యాశాఖ సిబ్బంది షఫీ, సీఆర్‌పి సైదులు, మధు, మహేష్ గ్రామ పెద్దలు, మధ్యాహ్న భోజనం వర్కర్స్ తదితరులు ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ అందజేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**విశ్వంభర, ఆత్మకూరు (ఎం) :** మండల కేంద్రానికి చెందిన ఎలిమినేటి దామోదర్ రెడ్డి, అదేవిధంగా పల్లెపహాడ్ గ్రామానికి చెందిన సంధ్య, వెంకటేష్ లకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వవిప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి, నాయకులు ముద్దసాని సిద్ధులు, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేష్ గౌడ్, దొంతరబోయిన భాస్కర్, ఏగ్గిరి యాదగిరి, పంజాల నరసయ్య, బొంత అంజయ్య, ఉగ్గే నరేష్, చిన్నపెంటయ్య పాల్గొన్నారు.



## ఇష్టమైన వారి పేరు మీద మొక్క నాటండి

### మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ నాయక్

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ నాయక్ , వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య పట్టణంలోని ప్రకృతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరిలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం హరితహారం పథకంలో భాగంగా ఈ వర్షాకాలంలో 'వనమహొూత్సవం' పేరుతో కార్యక్రమం చేపట్టెందుకు సన్నాహాలు చేస్తుందన్నారు. ప్రతి ఇంటిలో ఇష్టమైన వారి పేరు మీద ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు.

## మొక్కలు నాటిన భాజాపా నాయకులు

**విశ్వంభర, చింతపల్లి :** మండల కేంద్రంలోని అయ్యప్ప సన్నిధానం వద్ద శనివారం బీజేపీ మండల అధ్యక్షులు శివర్ల రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో డా.శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు మాట్లాడుతూ శ్యామ ప్రసాద్ ముఖర్జీ నిజమైన అర్థంలో మానవత్వం యొక్క ఆరాధకుడు మరియు సిద్ధాంతకర్త ప్రజల హృదయాల్లో ఆయనపై అపారమైన ప్రేమ మద్దతు కూడగట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో %మోర్చ జిల్లా కార్యదర్శి వెన్నం శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్ గౌడ్, గజ్జె అభినవ్, కొప్పుల నరేష్ గౌడ్, శివర్ల నగేష్, మొగిలమోని మల్లేష్ యాదవ్, మొగిలమోని రవి,



గడ్డి మహేందర్, పాలకుర్ల రాజు గౌడ్, కుందేళ్ళ శ్రీశైలం యాదవ్, కోడిధాల శ్రీనివాస్, ఇడమోని ఆంజనేయులు, కొక్కు శివ, గంట జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప సంఘసంస్కర్త బాబు జగ్జీవన్‌రాం

**విశ్వంభర, వలిగొండ :** అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన తొలి దళిత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి భువనగిరి జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా వద్ద మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, ఇతర ప్రజా ప్రతినిధులతో పాటు, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రాం అని కొనియాడారు.





## సీఎం రేవంత్ సొంత గ్రామానికి రోడ్డు పనులకు శంకుస్థాపన

**విశ్వంభర, ఆమనగల్లు :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లికి 21 కోట్లతో డివైడర్ రోడ్డు మంజూరైందని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. కాగా శనివారం ఉమ్మడి మహబూబ్నగర్ ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి, రాజేష్ రెడ్డి, శంకర్, ప్రజా ప్రతినిధులతో కలిసి పదర మండలం రాయలగండిలోని లక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం, మద్దిమడుగు ఆంజనేయ స్వామి దేవస్థానం, శ్రీశైల మల్లికార్జున దేవస్థానాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## రోడ్డు సమస్యలు పరిష్కరించండి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** డాక్టర్స్ కాలనీలో ప్రజలకు రోడ్డు సమస్యలు పరిష్కరించాలని కాలనీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ అధికారులను కోరారు. శనివారం డిప్యూటీ కమీషనర్ సుజాతకి కాలనీ ఉపాధ్యక్షులు దండెం జనార్ధన్ రెడ్డి, కాలనీ వాసులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ డాక్టర్స్ కాలనీ లోంచి మునిసిపల్ కార్యాలయానికి, సరూర్నగర్‌కి కానీ రావాలంటే హైవే ఎక్కిరావలసి వస్తుంది. వీఎం హోం రోడ్డు వర్క్ అవుతుంది. కాలనీ అనుకుని ఉన్న రోడ్లు ఫెన్సింగ్ మూసివేశారు. క్రాంతి నగర్ కాలనీ లో రెండు రోడ్లు, వికాస్ నగర్ ఒకరోడు వైర్ తో బ్లాక్ ఫెన్సింగ్ డిస్మెంటల్ అడ్డం వేశారు. పరిశీలించి రోడ్స్ ఓపెన్ చేయాలని కోరారు.



## ఆడపిల్లల రక్షణకు అవగాహన సదస్సు

**విశ్వంభర, హైదరాబాద్ :** సోషల్ ఎంటర్ప్ న్యూ ఇయర్, ఉద్యమ నాయకురాలు జీ వరలక్ష్మి హైదరాబాద్ సిటీ పోలీస్ ఉమెన్స్ రక్షణ శాఖ, రాచకొండ పోలీస్ కమిషనరేట్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్, సైబర్ క్రైమ్స్, సైబరాబాద్ అధికారుల ఆధ్వర్యంలో ఆడపిల్లల రక్షణ కొరకు అవగాహన, స్పై కెమెరాల దుర్వినియోగం, డ్రగ్స్ వాడకంపై అవగాహన, రహదారి భద్రతపై అవగాహన ఈ నాలుగు అంశాలపై విస్తృత అవగాహన సదస్సు పోలీస్ కమిషనర్ ఆఫీస్ హైదరాబాద్ తెలంగాణలో నిర్వహించారు. ఈ నేపథ్యంలో హెవెన్స్ హోమ్స్ సొసైటీ అధ్యక్షురాలు జీ వరలక్ష్మి దశాబ్ద తన ఉద్యమ దీప్తిని " ఒలింపిక్ టార్చ్" లాగా పట్టుకొని విస్తృతం చేయాలనే దృఢ సంకల్పంతో ఉన్న జీ వరలక్ష్మికి హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌రేట్ అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. దీనిలో భాగంగా 20, 030 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బుర్ర వెంకటేశం ఐఏఎస్, ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రభుత్వ విద్యాశాఖ తెలంగాణ ప్రభుత్వం కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఐపీఎస్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, ద్వారా కవిత డీసీపీ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు గీత, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

### వేంకటేశ్వర హెచరీస్ పౌల్ట్రీ ఫార్మ్‌లో కార్మికుల ఆందోళన



**విశ్వంభర, షాద్‌నగర్ :** రోజుకు 10 గంటలు పని చేస్తున్నా.. పనికి తగ్గ వేతనం లేక కుటుంబ పోషణ భారమై రోజు రోజుకూ నరకయాతన అనుభవిస్తున్నామని వేంకటేశ్వర హెచ్చరీస్ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు పనికి తగ్గ వేతనం చెల్లించాలంటూ హెచ్చరీస్ ఎదుట శనివారం కార్మికులు ఆందోళనకు దిగారు. కార్మికులు వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలోని కొత్తపేట, మంగళగూడెం గ్రామాల శివారుల మధ్య వెంకటేశ్వర హేచరీస్ పౌల్ట్రీ ఫార్మ్ లో సుమారుగా 106 మంది కార్మికులు పనిచేస్తు న్నారు. రోజు ఉదయం 8 గంటల నుంచి సా యంత్రం 6 గంటల వరకు సుమారు 10 గం టలుగా వెట్టి చాకిరి చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యవసర సరుకు లు, ఇతర ధరల దృష్ట్యా తమకు కుటుంబ పోషణ భారమవుతుందని, కనీసం పిల్లలను కూడా చదివించుకునే స్థితిలో లేమని వారు ఆందోళన చెందుతున్నారు. 2018లో ఇదే తరహాలో ఆందోళన చేస్తే రోజుకు 30 రూపా యల చొప్పున నెలకు 1250 పెంచారని ఇప్పటి వరకు మరల ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. రోజుకు 10 గంటలు పనిచేస్తే 353 రూపాయలు ఇస్తున్నారని, ఈ జీతంతో కుటుంబ పోషణ భారం అవుతుందని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి తమకు వేతనాలు పెంచాలని కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్నారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ



**విశ్వంభర, షాద్‌నగర్ :** నియోజకవర్గంలోని కేశంపేట మండలం ఎక్లాస్ ఖాన్ పేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వడ్డె మౌళి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో వారికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ వారి కుటుంబానికి అండగా ఉంటూ ప్రత్యేక చొరవతో బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ ద్వారా 2,00,000/- రూపాయలను మంజూరు చేయించారు. పార్టీ ఇన్స్యూరెన్స్ చెక్కును వడ్డె మౌళి భార్య వడ్డె భాగ్యమ్మకి బీఆర్ఎస్ యువ నాయకులు రవీందర్ యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, పీఎసిఎస్ వైస్ చైర్మన్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయ స్వామి పల్లకీ సేవ



**విశ్వంభర షాద్‌నగర్ :** మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలం గౌడ్, అన్నారం రఘుగౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, రఘునందన్‌రెడ్డి, లక్ష్మణ్, క్యాసెట్ శ్రీనివాస్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మికాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకరయ్యయాదవ్, వీఆర్వో బచ్చన్న, యాదగిరి, ప్రవీణ్ గౌడ్, పద్మావెంకటేష్ పాల్గొన్నారు.

## తెలంగాణ జర్నలిస్ట్‌కు అమెరికా ఆహ్వానం



**విశ్వంభర, హైదరాబాద్ :** అమెరికా ప్రభుత్వం ఆహ్వానం మే- రకు క్లైమెట్ క్రైసెస్ ఫర్ వెదర్ ఇన్ఫ్లూయెన్సర్స్ ప్రాజెక్టులో పార్టిసిపెంట్‌గా తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక సీనియర్ జర్నలిస్ట్ వాకిటి వెంకటేశం ముదిరాజ్. ఈ ప్రాజెక్టు ఈ నెల 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకు అమెరికాలోని వాషింగ్టన్ డీసీ, ఓక్లహోమ్, కొలరాడో, ఫ్లోరిడా ప్రాంతాల్లో పర్యటించి, వాతావరణంపై అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఈ అధ్యయన నివేదికను అమెరికా ప్రభుత్వానికి అప్పగించి, సుమారు నెల రోజుల తర్వాత తిరిగి ఇండియాకు చేరుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే గూగుల్ న్యూస్ ఇన్సియేటివ్ ప్రాజెక్టులో భాగస్వామి అయిన వాకిటి, 25 ఏళ్లుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో వివిధ స్థాయిల్లో చేశారు. యాదాద్రి జిల్లా యాదగిరిగుట్ట మండలం మారుమూల గ్రామం మాసాయిపేటలోని సాధారణ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. 1999లో ప్రజాశక్తి తెలుగు దినపత్రికలో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ సబ్ ఎడిటర్, చీఫ్ సబ్ ఎడిటర్‌గా వివిధ స్థాయిలో పని చేశారు. ఆ తర్వాత టీవీ9లో సబ్‌ఎడిటర్ నుంచి డెస్క్ ఇన్‌చార్జ్ వరకు సుమారు 16 ఏళ్ల పాటు సుదీర్ఘ కాలం పని చేశారు. అనంతరం 99టీవీ, సీవీఆర్, భారత్ టుడే, స్వతంత్ర, ఐన్యూస్ వంటి ఛానళ్లకు అవుట్ ఎడిటర్‌గా సేవలు అందించారు. 2006 సునామీ సమయంలో డిజాస్టర్ రెస్పాన్స్ టీంలతో కలిసి, వరద బాధితులకు అత్యవసరాలు అందించడంతోపాటు వరదలు, తుఫాన్ వార్తలను కవర్ చేయడంలో తన వంతు పాత్ర పోషించారు. వరదల నష్టాలు, తుఫాన్ బాధితుల ధీనస్థితి, విపత్తు గురించి విస్రృత కథనాలను ప్రత్యేకంగా న్యూస్ బులెటిన్లు ఏర్పాటు చేసి, ప్రసారం అయ్యేలా చేశారు. వాతావరణ వార్తల సేకరణపై మక్కువతో ఇప్పటికీ తన సోషల్‌మీడియా అకౌంట్లల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్లు పెడుతున్నారు. తెలుగు మీడియాపై తనదైన ముద్ర వేసిన సీనియర్ జర్నలిస్ట్ వాకిటి వెంకటేశం ముదిరాజ్‌ని అమెరికా ప్రభుత్వం గుర్తించి, వెదర్ ప్రాజెక్టులో భాగస్వామి చేయడం, ఒక తెలంగాణ జర్నలిస్ట్‌కు దక్కిన అరుదైన గౌరవం.

## శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం



**విశ్వంభర, నారాయణఖేడ్ :** జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ భారతదేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పెద్ద శంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. శనివారం పెద్ద శంకరంపేట లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కోణం విఠల్ మాట్లాడుతూ.. అఖండ భారతావని కోసం ప్రాణాలర్పించిన భరతమాత ముద్దుబిడ్డ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు శ్రావణ్ కుమార్, మంగళ కృష్ణ, ఎర్ర శ్రీహరి, సాయిలు, బుగుడాల కృష్ణ, వడితే సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ఉపాధ్యాయులకు వీడ్కోలు సభ



**విశ్వంభర, కూకట్‌పల్లి :** కూకట్ పల్లి సర్కిల్, ఎల్లమ్మబండ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుల వీడ్కోలు సభ నిర్వహించారు. యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, ఉపాధ్యాయులను శాలువతో సత్కరించారు. పాఠశాలకు నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు స్వాగతించారు. ఈ సందర్భంగా రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలలో సేవలందించిన ప్రతి ఒక్క ఉపాధ్యాయులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత స్థానాలకు బదిలీ అవ్వుతున్న వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది హెచ్ఎం రాధపద్మజ, గోవింద్, కేకే మోహన్ రావు, లక్ష్మప్ప, సిద్దయ్య, పండు, విఠల్ గౌడ్, కిరణ్మయి, సంధ్యారాణి, విజయలక్ష్మి, సీహెచ్ భాస్కర్, పాండుగౌడ్, షౌకత్ అలీ మున్నా, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాజ్ గౌడ్, సయ్యద్, మహేష్, ఫారూఖ్, ఖలీమ్, బషీర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు బుక్‌ల పంపిణీ

**విశ్వంభర, కూకట్‌పల్లి :** పసులూరి కాంచన శ్రీవల్లి మెమోరియల్ చారిటబుల్ ఆధ్వర్యంలో వంగర ఆంజనేయులు సహకారంతో కెపిహెచ్బిలోని సరస్వతి శిశు మందిర్ హై స్కూల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి చదివే 100 మంది విద్యార్థులకు శనివారం ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ డివిఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ 12 సంవత్సరాల నుంచి విద్యార్థులకు నోటి పుస్తకాలు అందజేస్తున్నామని తెలియజేశారు. నగరంలో తమ ట్రస్ట్ ద్వారా ఉచితంగా సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పిల్లలు చిన్నతనం నుంచి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. కార్యక్రమంలో ట్రుస్టీలు అద్దంకి అమరేశ్వరరావు, పణికుమార్, శ్రీనివాసు, నాగ శ్రీనివాస్, నారాయణ, నాగేశ్వర రామ్ పాల్గొన్నారు.



## శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో అభివృద్ధి పనులకు దాతలు ముందుకు రావాలి

**విశ్వంభర, షాద్‌నగర్ :** పట్టణంలోని సుమారు 100 సంవత్సరాల చరిత్ర గల పురాతన శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అభివృద్ధి పనులకు దాతలు సహకరించాలని దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రెటికల్ నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య కోరారు. దేవాలయం దినదిన అభివృద్ధి చెందుతుందని, దేవాలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు.



## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

**విశ్వంభర, నారాయణఖేడ్ :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పెద్దశంకరపేట మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. శనివారం అమ్మ పేరుతో చెట్టు కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేటలోని ప్రదేశాలలో బిజెపి నాయకులు కార్యకర్తలు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు గ్రామాలలో బూత్ స్థాయి వరకు ప్రతి ఇంటికి మొక్కలు నాటేలా బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాగా మండల పరిధిలోని చీలపల్లి, బుజరాన్ పల్లి, గొట్టిముక్కుల, జూకల్ ఆరేపల్లి, మూసాపేట్ బూరుగుపల్లి, లక్ష్మాపూర్, కమలాపూర్ ఆయా గ్రామాలలో బిజెపి కార్యకర్తలు నాయకులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు సూర్య ప్రకాష్, శ్రావణ్ కుమార్, మంగలి కృష్ణ, బుగుడాల కృష్ణ సుభాష్, గంగారెడ్డి, మల్లేశం, విజయ్, అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## సిద్దులగుట్టకి బస్ సౌకర్యం కల్పించాలి

### మంత్రి పొన్నంకు వినయ్ రెడ్డి వినతి

**విశ్వంభర, ఆర్మూర్ :** పట్టణంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం నవనాథ సిద్ధులగుట్టకి ప్రతి సోమవారం భక్తులు ఎక్కువగా వస్తుండటం వలన గుట్ట పైకి వచ్చే భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నయని, గుట్ట పైకి బస్ సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని ఆలయ కమిటీ సభ్యులు, మరియు భక్తుల విజ్ఞప్తి మేరకు శనివారం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి రవాణా శాఖ మంత్రి పొన్నాం ప్రభాకర్‌ను కలిసి సిద్దులాగుట్ట పైకి ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి త్వరలోనే సిద్దుల గుట్ట పైకి ఆర్టీసీ బస్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే ఆర్మూర్ పట్టణంలోని బస్ డిపో లో బస్ ల కొరత ఉందని, దీనితో నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆర్మూర్ డిపోకు కొత్త బస్‌లను మంజూరు చేయాలనీ చేయాలని కోరారు.

## బీజేపీ చేసే ప్రతీ పని దేశ హితం కోసమే

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** భారతీయ జనతా పార్టీ చేసే ప్రతీ పని దేశ హితం కోసం, సమాజ నిర్మాణానికి దోహదపడతాయి. అందులో భాగంగానే మన ప్రధాని నరేంద్ర మోడీ మన్ కి బాత్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ తల్లుల గౌరవార్థం మొక్కలు నాటాలని ఇచ్చిన పిలుపు మే-రకు శనివారం మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు గజరాజ్ కాశినాథ్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి లోడి మహేష్, బూత్ అధ్యక్షులు లోడి వెంకటయ్య పాల్గొని మొక్కలు నాటారు.



## డ్రగ్స్ నివారణపై హోంమంత్రి

# స్పెషల్ ఫోకస్

**• సరిహద్దుల్లో గట్టి నిఘా • ప్రత్యేక బృందాలు ఏర్పాటు**



**విశ్వంభర, విశాఖ పట్నం :** హోంమంత్రిగా వంగలపూడి అనిత బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి తన మార్క్ ఏంటో చూపిస్తున్నారు. నేను అందరిలా కాదు.. అక్రమార్కులకు చెమటలు పట్టిస్తా అంటున్నారు. మరీ ముఖ్యంగా ఆమె బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి గంజాయి, డ్రగ్స్ మాఫియాను అరికట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఏపీని డ్రగ్స్, గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని శపథం చేస్తున్నారు. ఇందుకోసం ఆమె తీసుకుంటున్న నిర్ణయాలు కూడా అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఆమె ఇంతగా గంజాయి, డ్రగ్స్ సరఫరాపై దృష్టి పెట్టడానికి చాలా కారణాలు ఉన్నాయి. ఎందుకంటే దేశంలో ఎక్కడ డ్రగ్స్, గంజాయి కేసులు నమోదైనా సరే.. దాని మూలాలు ఏపీలోనే ఉంటున్నాయి. అంతెందుకు మొన్న ఎన్నికల సమయంలో విశాఖ పోర్టులో భారీ డ్రగ్స్ పట్టుబడటంతో దేశం మొత్తం ఉలికిపాటుకు గురైంది. విశాఖ పోర్టులో ఏకంగా 25 వేల కేజీల డ్రగ్స్‌ను సీబీఐ స్వాధీనం చేసుకుంది. దీని విలువ కొన్ని వేల కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అప్పట్లో దానిపై ఎంత రచ్చ జరిగిందో చూశాం. ఇక హోం మినిస్టర్ అనిత మొన్న విశాఖలోని సెంట్రల్ జైల ను సందర్శించారు. అందులో శిక్ష అనుభవిస్తున్న వారిలో 80 శాతానికి పైగా మైనర్లే ఉన్నారు. వారంతా కూడా గంజాయి, డ్రగ్స్‌ను సరఫరా చేస్తుంటారు. స్మగ్లర్లు ఎక్కడకు చేరవేయమంటే అక్కడకు చేరవేస్తుం టా. ఐదువేలు, పదివేలకు వీరంతా ఇలా చేసి ఇప్పుడు జైల్లో ఉంటున్నారని తెలుసుకుఉన్న అనిత.. దీన్ని అరికట్టాలని గట్టి నిర్ణయం తీసుకున్నారు. అందుకే పోలీసులకు స్ట్రిక్ట్ ఆర్డర్స్ వేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ అనేవి కనిపించొద్దంటూ ఆదేశించారు. ఎక్కడ సమాచారం వస్తే అక్కడ తనిఖీలు చేసి పట్టుకోవాలన్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా టోల్ ఫ్రీ నెంబర్లను కూడా ఆమె ఏర్పాటు చేస్తామన్నారు. సామాన్య ప్రజలు ఎవరైనా ఈ టోల్ ఫ్రీనెంబర్‌కు కాల్ చేసి గంజాయి, డ్రగ్స్ సమాచారం ఇస్తే వారికి నగదు రివార్డుకూడా ఇస్తామని ఆఫర్ చేశారు. అంతే కాకుండా పోర్టుల దగ్గర, రాష్ట్ర సరిహద్దుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. పోలీసులను భారీ ఎత్తున సరిహద్దుల్లో మోహరించారు. ఏపీలోకి ఒక్క గ్రాము డ్రగ్స్ కూడా రావొద్దని హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎక్కడెక్కడ గంజాయి సాగు చేస్తున్నారో అక్కడ ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించేందుకు రెడీ అవుతున్నారు. అనిత్ ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి, అరకు లాంటి పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎస్టీలు ఎక్కువగా గంజాయి సాగుచేస్తున్నట్టు ఆమె దృష్టికి వచ్చింది. అందుకే అక్కడ కూడా ఎస్టీలకే ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపించి గంజాయిని సాగు చేయకుండా చూసేందుకు చర్యలు తీసుకోబోతున్నారు. ఇక పేద, మధ్య తరగతి మైనర్లను గంజాయి, డ్రగ్స్ సరఫరాకు వాడుకోకుండా పకడ్బంధీ చర్యలు తీసుకోవాలని, స్కూల్, కాలేజీ స్టూడెంట్లకు అవగాహన కల్పించాలని ఆమె ఇప్పటికే పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఇలా అన్ని విధాలుగా గంజాయి, డ్రగ్స్‌ను ఉక్కుపాదంతో అణచివేయడానికి ఆమె ప్రయత్నించడాన్ని అంతా ప్రశంసిస్తున్నారు.




# జాతీయ పురస్కార గ్రహీత

**దిలీప్‌రెడ్డికి డబ్ల్యూజేఐ సన్మానం**

**విశ్వంభర, హైదరాబాద్ :** సీనియర్ పాత్రికేయుడు, సమాచార హక్కు చట్టం (ఆర్ టీ ఐ) పూర్వ కమిషనర్, పర్యావరణ ప్రేమికుడు, రాజకీయ విశ్లేషకుడు, సమాజ సేవకుడు, ప్రజాస్వామ్య ప్రియుడు దిలీప్ రెడ్డికి క్యాపిటల్ ఫౌండేషన్ వారు జర్నలిజంలో జాతీయ పురస్కారం ప్రకటించడం హర్షణీయం. శనివారం నల్సార్ యూనివర్సిటీలో భారత అటార్నీ జనరల్ వెంకటరమణి, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేల సమక్షంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని స్వీకరించిన దిలీప్‌రెడ్డి గారికి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేసింది. ఈ సందర్భంగా వారికి డబ్ల్యూజేఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ శాలువా కప్పి సన్మానించారు. దిలీప్ రెడ్డిని జర్నలిస్టులు ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. దిలీప్ రెడ్డి మిత్రులు, సహచర పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనను అభినందించారు.

## నేడు యుద్ధంలో పావురం పుస్తకావిష్కరణ

**విశ్వంభర, మహబూబ్‌నగర్ :** టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ రచించిన కవితా సంకలనం యుద్ధంలో పావురం ఆవిష్కరణ సభ ఆదివారం మహబూబ్నగర్ పట్టణంలోని అల్మాస్ ఫంక్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఏ తిమ్మప్ప, కో కన్వీనర్ కేసీ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ జి హరగోపాల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి కే శివారెడ్డి ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారని, కవి యాకుబ్, సామాజికవేత్త జిలకర శ్రీనివాస్ వక్తలుగా హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. కాచం సత్యనారాయణ, రాఘవాచారి, హనీఫ్ అహమ్మద్ ఇతర ప్రముఖులు ఆప్త వాక్యం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, విద్యార్థులు, మేధావులు, కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.


### వైశ్య భవన కమిటీ సిద్దిపట ఆధ్వర్యంలో

## సిద్దిపటలో సర్వసభ్య సమావేశం

**విశ్వంభర, సిద్దిపేట :** ఆదివారం ఉదయం 11 గంటలకు వైశ్య భవన కమిటీ సిద్దిపట ఆధ్వర్యంలో సిద్దిపటలో సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఓ ప్రకట నలో తెలియజేశారు. సమావేశం అనంతరం భోజన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. జై వాసవి వైశ్య భవనం గౌరవ సభ్యులు, వైశ్య భవన కమిటీ సిద్దిపట సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

# ఘర్షణలపై సిట్ ఏర్పాటు

**• ఎన్నికల తర్వాత జరిగిన గొడవలపై ప్రభుత్వం సీరియస్**
**• సిట్ ఏర్పాటుకు సన్నాహాలు**
**• నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు రెడీ**



**విశ్వంభర, విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి జరిగిన ఎన్నికలు నెవ్వర్ బిఫోర్ ఎవ్వర్ ఆఫ్టర్. నోటిఫికేషన్ రాక ముందు నుంచే పార్టీలు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ ఎన్నికల సందర్భంగా చాలా ప్రాంతాల్లో ఘర్షణపూరిత వాతావరణం నెలకొంది. పోలింగ్ రోజున మొదలైన కొట్లాటలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అధికార మార్పిడీ జరగడంతో కొన్ని చోట్ల ఉత్సాహంతో మరికొన్ని చోట్ల పగతో ఇంకొన్ని ప్రాంతాల్లో గెలవలేదన్న ఆగ్రహంతో గొడవలు జరుగుతున్నాయి. ఘర్షణ ఎలాంటిదైనా నిజానిజాలు ఎలా ఉన్నప్పటికీ అన్ని వేళ్లు మాత్రం ప్రభుత్వంవైపే చూపిస్తున్నాయి. అందుకే ఇలాంటి వాటికి తావు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత జరిగిన ఘర్షణలపై సిట్ వేయాలని ఆలోచన చేస్తున్నట్టు ప్రభుత్వం నుంచి అందుతున్న సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లోని సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ముఖ్యమైన అధికారులతో కలిసి అసలేం జరిగింది, గొడవలకు కారణమేంటీ, నిజంగా పార్టీ కక్షలోతనే ఘర్షణలు జరిగాయా లేకుండా వ్యక్తిగత కక్షలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో సిట్ దర్యాప్తు సాగనుందనట. దీనిపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని ఇంకా పూర్తి క్లారిటీ రాలేదని సమాచారం. ప్రస్తుతానికి ఆర్థిక వనరుల సమీకరణ, బడ్జెట్ కూర్పుపై ప్రభుత్వ పెద్దలు ఫోకస్డ్‌గా ఉన్నారు. వీటిపై క్లారిటీ వచ్చిన తర్వాత సిట్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారు. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఒకట్రెండు ఘర్షణలను పార్టీలకు ఆపాదించడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణనిస్తోంది. అదే టైంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారంతో ప్రజల్లో అనుమానాలు రాకుండా ఉండేలా సిట్ ఏర్పాటుతో వైసీపీకి చెక్ పెట్టాలని భావిస్తోంది. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా నివేదిక ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వబోతున్నారు. ఎన్నికల టైంలో జరిగిన ఘర్షణలపై ఎన్నికల సంఘం ఒక సిట్ వేసింది. ప్రాథమికంగా ఓ నివేదిక ఇచ్చినప్పటికీ ఆ తర్వాత సిట్ ఏమైందో ఎవరూ చెప్పడం లేదు. నేతలతో సమావేశమైన ప్రతిసారీ ప్రతికార రాజకీయాలు వద్దని చంద్రబాబు నేతలతో చెబుతున్నారట. అలాంటి రాజకీయమే వైసీపీని దెబ్బ తీసిందని ఎట్టి పరిస్థితిలో తొందరపాటు నిర్ణయాలు వద్దని ప్రజలతో మమేకమయ్యే చర్యలు మాత్రమే చేపట్టాలని సూచిస్తున్నారు. ఈ మధ్య జరిగిన రెండు పరిణామాలు కూడా అదే విషయాన్ని స్పష్టం చేశాయి. తిరువూరు ఎమ్మెల్యే దూకుడుగా వైసీపీ నేత ఇంటిపైకి వెళ్లడంతో చంద్రబాబు క్లాస్ తీసుకున్నారట. పోలీసులతో మంత్రి రామ్‌ప్రసాద్ భార్య వ్యవహరించిన తీరుపై కూడా చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటివి రిపీట్ చేస్తే బాగోదని క్లాస్‌తీసుకున్నారు. ఇంత జాగ్రత్తగా వెళ్తున్నప్పటికీ స్థానికంగా ఉండే విభేదాలతో జరిగిన ఘర్షణలను పార్టీకి ఆపాదించడంపై చంద్రబాబు సీరియస్‌గా ఉన్నట్టు చెబుతున్నారు. దీని లెక్క తేల్చేందుకే సిట్ ఏర్పాటు ఆలోచన చేస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



# మీడియా ముందుకు భోలేబాబా

**• తొక్కిసలాట కలచివేసింది**
**• బాధితులకు శక్తి ఇవ్వాలని దేవుడిని ప్రార్థించా**
**• కారకులన విడిచిపెట్టొద్దని కోరుతున్నానంటూ ప్రకటన**

**విశ్వంభర, లక్నో :** ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హత్రాస్‌లో తీవ్ర విషాదాన్ని నింపిన తొక్కిసలాట ఘటనపై సత్సంగ్ నిర్వహించి 121 మంది మృతికి కారణమైన భోలేబాబా తొలిసారి మీడియా ముందుకు వచ్చాడు. తొక్కిసలాట తర్వాత పరారీలో ఉన్న అతను ఈ ఘటన తనను తీవ్రంగా బాధపెట్టిందని చెప్పాడు. "ఘటన మిగిల్చిన విషాదాన్ని భరించే శక్తి దేవుడు మాకు ప్రసాదించాలి. ప్రభుత్వం, పాలనా యంత్రాంగంపై నమ్మకం ఉంచండి. కారకులను విడిచిపెట్టరనే విశ్వాసం నాకుంది. మరణించిన కుటుంబాలు, గాయపడిన వారికి జీవితాంతం అండగా నిలబడాలని, సాయం చేయాలని నా న్యాయవాది ఏపీ సింగ్ ద్వారా కమిటీ సభ్యులను అభ్యర్థించాను" అని మీడియాకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడాడు.

**నామమాత్ర పరిహారం..**

121 మంది మృతుల కుటుంబ సభ్యులకు నామమాత్ర పరిహారం ప్రకటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు దులుపుకున్నాయి. వారి కుటుంబాల భవిష్యత్తు ఏంటని భోలేబాబా లాయర్ ఏపీ సింగ్‌ని ప్రశ్నించగా.. మృతుల జాబితాలు తమ వద్ద ఉన్నట్లు చెప్పారు. తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబాల పిల్లల చదువు, ఆరోగ్యం, పెళ్లి ఖర్చులను భోలే బాబాకు చెందిన నారాయణ్ సాకర్ హరి ట్రస్టే భరిస్తుందని వివరించారు. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఎలాంటి సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో సమావేశానికి లక్షల్లో హాజరైనట్లు చెప్పారు. 80 వేలకు అనుమతి ఉండగా.. లక్షల్లో హాజరైనట్లు తెలిపారు. భోలే బాబా పరారీలో లేడని.. విచారణకు అతను సహకరిస్తారని లాయర్ తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటికే ఆరుగురు వాలంటీర్లను అరెస్ట్ చేశారు.

### సెయింట్ మేరి ఉన్నత పాఠశాల న్యూ నల్లకుంటలో

# ఉచిత యూనిఫామ్స్ పంపిణీ



**విశ్వంభర, నల్లకుంట :** సెయింట్ మేరి ఉన్నత పాఠశాల న్యూ నల్లకుంట ఫ్రీ ప్రైమరీ విద్యార్థులకు పాఠశాల నిర్వాహకుడు వై వెంకట్ రెడ్డి విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్ ఉచితంగా పంపణీ చేశారు. ప్రతీ ఒక్కరు విద్యారంగంలో ప్రావీణ్యం సాధించి ఉన్నత శిఖరాలకు ఏదిగే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. బాల్యం నుంచే విద్యార్థులకు మంచి నడవడికను సంస్కృతి సంప్రదాయాలను బోధనల రూపంలో తెలపడంతో వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాల చేరుకోగలరని అన్నారు. అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుకెళ్లడానికి పిల్లల తల్లి దండ్రుల, ప్రోత్సాహం, తోట్పాటు ఎంతైన అవసరమన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎం స్వరూప, ఉపాధ్యాయులు వీ సరిత, తబుసమ్, మనీష, భరతి, విజయలక్ష్మి, మైథిలీ మరియు తల్లి దండ్రులు పాల్గొన్నారు.

### గోవా వెళ్లేవారికి

# శుభవార్త

**• సికింద్రాబాద్ నుంచి నేరుగా ట్రైన్**
**• ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం**




**విశ్వంభర, హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల నుంచి గోవా వెళ్లే ప్రయాణీకులకు గుడ్ న్యూస్ అందించింది రైల్వే శాఖ. సికింద్రాబాద్ టూ వాస్కోడగామా (గోవా) వెళ్లేందుకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు(17039/17040) పట్టాలెక్కింది. ఇప్పటివరకు వారానికి ఒక రైలు 10 కోచ్‌లతో సికింద్రాబాద్ నుంచి బయలుదేరి గుంతకల్ చేరుకుని.. అక్కడ తిరుపతి నుంచి గోవాకు వెళ్లే మరో 10 కోచ్‌లతో కలిపి ఒక నూతన రైలుగా మారి గోవాకు ప్రయాణం సాగించేది. ఇది కాకుండా కాచిగూడ – యలహంక మధ్యన ప్రయాణించే డైలీ ఎక్స్‌ప్రెస్ రైలుకు గోవాకు వెళ్లే 4 కోచ్‌లను కలిపేవారు. ఈ 4 కోచ్‌లను తిరిగి గుంతకల్ వద్ద షాలిమార్ – గోవా మధ్యన తిరిగే అమరావతి రైలుకు కలిపి ప్రయాణం సాగించేవారు. ఇలా సికింద్రాబాద్ టూ గోవా మధ్య రైళ్లన్నీ 100 ఆక్యుపెన్సీతో వెళ్లడం, చాలామంది సీట్లు దొరక్క ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కేంద్ర రైల్వేశాఖ.. దక్షిణ మధ్య రైల్వేకి ఇటీవలే తీపికబురు అందించింది. సికింద్రాబాద్ టూ వాస్కోడగామా(గోవా) మధ్య బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తున్నట్లు రైల్వేశాఖ శుక్రవారం ప్రకటించింది. ఈ నిర్ణయానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో అవసరమైన ఈ రైలును ప్రకటించినందుకు ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్ నుంచి బయలుదేరుతుంది. అలాగే వాస్కోడగామా నుంచి గురు, శనివారాల్లో తిరుగు ప్రయాణమవుతుంది. ఇది సికింద్రాబాద్, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్ సిటీ, డోన్, గుంతకల్, బళ్లారి, హోస్‌పేట్, కొప్పల్, గడగ్, హుబ్బళ్లి, ధార్వాడ్, లోండా, క్యాసిల్ రాక్, కులెం, సాన్వోర్డెమ్, మడగావ్ జంక్షన్లలో ఆగుతూ.. వాస్కోడగామా చేరుకుంటుంది. ఇంకా ఈ ట్రైన్ టికెట్ ధరలు, ఎప్పటినుంచి అందుబాటులోకి రానుందో తెలియాల్సి ఉంది.

# బీఎస్పీ తమిళనాడు అధ్యక్షుడి హత్య

- ఇంట్లోకి చొరబడి నరికిన దుండగులు
- దర్యాప్తుకోసం ప్రత్యేక బృందాలు
- తీవ్రంగా ఖండించిన మాయావతి



**విశ్వంభర, చెన్నై :** తమిళనాడులో దారుణం చోటు చేసుకుంది.. బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్ స్ట్రాంగ్ దారుణ హత్యకు గురయ్యారు. సెంబియం ప్రాంతంలో ఆర్మ్ స్ట్రాంగ్ తన నివాసానికి సమీపంలో కొంతమంది పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతుండగా బైకులపై వచ్చిన ఆరుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేసి.. అక్కడి నుంచి పారిపోయారు. తీవ్ర గాయాలపాలైన అతడ్ని కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తరలించినప్పటికీ ప్రాణాలు దక్కలేదు. ఈ హత్యపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. ఇది ప్రతీకార హత్య కావొచ్చని అనుమానిస్తున్నారు. నిందితులు ఫుడ్ డెలివరీ ఏజెంట్లు మాదిరిగా వచ్చి దాడి చేశారు. సీసీటీవీలో దుండగులు పారిపోతున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. గత ఏడాది ఆర్కాట్ సురేష్ అనే గ్యాంగ్‌స్టర్ హత్యతో సంబంధం ఉన్నందున ఇది ప్రతీకార హత్య అయి ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు. సీనియర్ పోలీసు అధికారి మాట్లాడుతూ, “మేము విచారణ జరుపుతున్నాము. హత్య మునుపటి హత్యతో ముడిపడి ఉన్నట్లు తెలుస్తోంది.” అని పేర్కొన్నారు. హత్య కేసులో ఇప్పటి వరకు 8 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. అనుమానితులను విచారించిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు. హత్యకు పదునైన ఆయుధాలు ఉపయోగించారని.. విచారిస్తున్నామని.. చెన్నై సీనియర్ పోలీసు అధికారి అస్రా గార్గ్ చెప్పారు. కేసు దర్యాప్తుకి 10 ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశారు. పరారైన నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక టీంలతో గాలిస్తున్నట్లు సెంబియం పోలీసులు తెలిపారు. ఈ ఘటనను బీఎస్పీ చీఫ్ మాయావతి ఖండించారు. ఆర్మ్‌స్ట్రాంగ్ దళితుల బలమైన గొంతుక అని, అతడిని హత్య చేసిన దోషులను శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బీఎస్పీ అధ్యక్షుడి హత్యను తీవ్రంగా ఖండించారు తమిళ హీరో విజయ్. ఈ హత్య దిగ్భ్రాంతిని.. బాధను కలిగించిందన్నారు. సీఎం స్టాలిన్ వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు హీరో విజయ్.. ఆర్మ్‌స్ట్రాంగ్ డెడ్‌బాడీ ఉంచిన ఆసుపత్రి దగ్గర కార్యకర్తలు ధర్నా చేశారు. దుండగులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య నేపథ్యంలో అధికార డీఎంకేపై ప్రతిపక్ష ఏఐఏడీఎంకే విరుచుకుపడింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ఈ హత్యే అందుకు నిదర్శనమని తీవ్రంగా విమర్శించింది. ఒక జాతీయ పార్టీకి సంబంధించిన రాష్ట్ర అధినేత హత్యకు గురయ్యాక ఇంకేం మాట్లాడగలమని, రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితి సిగ్గుచేటని పళనిస్వామి తీవ్రంగా విమర్శించారు. సెంబియం ప్రాంతంలోని తన ఇంటి దగ్గర కొద్దిమంది పార్టీ కార్యకర్తలతో ఆర్మ్‌స్ట్రాంగ్ చర్చలు జరుపుతున్నప్పుడు ఆరుగురు వ్యక్తులు అతనిపై దాడి చేసి, ఆపై పారిపోయారు. కుటుంబసభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు.

# జులై 22 నుంచి బడ్జెట్ సమావేశాలు

- ఆగస్టు 12 వరకు కొనసాగనున్న సమావేశాలు
- ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్



**విశ్వంభర, ఢిల్లీ :** త్వరలో బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను 23న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు బడ్జెట్ సెషన్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బడ్జెట్ సమావేశాలు ఈ నెల 22న మొదలై.. ఆగస్టు 12 వరకు కొనసాగనున్నాయి. ఆర్థిక మంత్రి సీతారామన్ వరుసగా ఏడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మూడో ప్రభుత్వ ప్రాధాన్యాన్ని వెల్లడించనున్నారు. నిర్మలా సీతారామన్ చివరిసారిగా ఈ ఏడాది ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించారు. ఈ నెల 23న వరుసగా ఏడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి కొత్త రికార్డును సృష్టించనున్నారు. గతంలో మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో వరుసగా ఆరుసార్లు ప్రవేశపెట్టారు. నిర్మలా సీతారామన్ మోదీ ప్రభుత్వంలో వరుసగా రెండోసారి ఆర్థిక మంత్రిత్వ శాఖ బాధ్యతలు చేపట్టారు. మోదీ ప్రభుత్వంలో వరుసగా మూడోసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా రికార్డును నెలకొల్పారు. ఆమె రాజకీయ జీవితంలో ఎన్నో మైలురాళ్లను సాధించారు. 2017లో తొలి మహిళా రక్షణ మంత్రిగా పని చేశారు. అంతకు ముందు ఆమె పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రిగానూ సేవలందించారు. అరుణ్ జైట్లీ (ఆర్థిక మంత్రి 2014-19) అస్వస్థతకు గురైన సమయంలో 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత సీతారామన్ ఆర్థిక శాఖ బాధ్యతలు చేపట్టారు. స్వతంత్ర భారతదేశంలో పూర్తి కాలం మహిళా ఆర్థిక మంత్రిగా కొనసాగారు. అంతకు ముందు, ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కొద్దికాలం పాటు ఆర్థిక మంత్రి బాధ్యతలు నిర్వర్తించారు. సీతారామన్ 1959 ఆగస్టు 18న మధురైలో రైల్వేలో పనిచేసిన నారాయణ్ సీతారామన్-సావిత్రి దంపతులకు జన్మించారు. సీతారామన్ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో మాస్టర్స్ అండ్ ఎంఫిల్ చేశారు. 1986లో పరకాల ప్రభాకర్‌ను వివాహం చేసుకున్నారు. ఆమె హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ స్టడీస్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేశారు. 2003 నుంచి 2005 వరకు జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా సేవలందించారు.

# మాగుంట శ్రీనివాస్ ది తప్పుడు స్టేట్ మెంట్

- ఎన్డీయే ఎంపీ స్టేట్ మెంట్ ను ఆధారంగా తీసుకున్నారు
- ఆయన స్టేట్ మెంట్ ఆధారంగానే నా భర్త అరెస్ట్
- కేజ్రీవాల్ భార్య సంచలన ఆరోపణలు



**విశ్వంభర, ఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై ఆయన భార్య సునీత కేజ్రీవాల్ కీలక విషయాలు వెల్లడించారు. ఇందుకు బంధించిన వీడియోను ఆమె శనివారం విడుదల చేశారు. ఎన్డీయే ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తప్పుడు వాంగ్మూలం ఆధారంగానే లిక్కర్ కేసులో కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసిందని ఆ వీడియోలో ఆమె ఆరోపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 2022 సెప్టెంబర్ 22న ఎంఎస్ఆర్ నివాసంపై దాడి జరిపిందని, ఆసమయంలో కేజ్రీవాల్‌ను మీరు కలిసారా అని ఈడీ ప్రశ్నించిదని సునీత తెలిపారు. 2021 మార్చి 16న ఢిల్లీ సెక్రటేరియట్‌లోని సీఎం కార్యాలయంలో కేజ్రీవాల్‌ను తాను కలిసినట్టు ఎంఎస్ఆర్ బదులిచ్చారని చెప్పారు. ఢిల్లీలో ఫ్యామిలీ ఛారిటబుల్ ట్రస్టును ప్రారంభించేందుకు భూమి కోసం కేజ్రీవాల్‌ను ఎంఎస్ఆర్ కలిశారని, అయితే ఆ భూమి ఎల్జీ పరిధిలోకి వస్తుందని, ఆయనను కలిసి అప్లికేషన్ ఇవ్వమని కేజ్రీవాల్ చెప్పడంతో ఆ పని చూసుకుని ఆయన వెళ్లిపోయారని సునిత తెలిపారు. ఎంఎస్ఆర్ చెప్పిన జవాబు నచ్చకపోవడంతో ఆయనపై ఒత్తిడి తెచ్చేందుకు ఆయన కుమారుడు రాఘవ రెడ్డిని ఈడీ అరెస్టు చేసిందన్నారు. రాఘవకు బెయిల్ కూడా రాకుండా చేసిందన్నారు. ఆ సమయంలో రాఘవరెడ్డి భార్య, ఎంఎస్ఆర్ కోడలు ఆత్మహత్యా యత్నం చేయడం, తన కొడుకు పరిస్థితి చూసి ఎంఎస్ఆర్ కంటతడి పెట్టుకోవడం జరిగిందన్నారు. ఆ క్రమంలోనే 2023 జూలై 17న ఎంఎస్ఆర్ తన స్టేట్‌మెంట్‌ను మార్చుకున్నారని తెలిపారు. లిక్కర్ వ్యాపారం చేయమని, ఆప్‌కు రూ.100 కోట్లు ఇవ్వమని పది మంది సమక్షంలో కేజ్రీవాల్ అడిగినట్టు ఎంపీ స్టేట్‌మెంట్ ఇచ్చారని, ఆ తరువాత రెండ్రోజులకే రాఘవకు బెయిల్ వచ్చిందని సునీత గుర్తు చేశారు. దీనిని బట్టే ఎంపీ తప్పుడు వాంగ్మూలం ఇచ్చారని అర్థమవుతోందన్నారు. నిజాయితీ, విద్యావంతుడు, దేశభక్తి కలిగిన కేజ్రీవాల్‌ను తప్పుడు కేసులో ఇరికించారని, ఆయనకు మద్దతుగా నిలవాలని ప్రజలను సునీత ఆ వీడియోలో కోరారు. “రాజకీయ కుట్రలో కేజ్రీవాల్ బలి అయ్యారు. ఆయన సాధారణ వ్యక్తి, నీతివంతుడు, పుష్కలమైన దేశభక్తి ఉన్నవాడు. ఇవాళ మీరు ఆయనకు అండగా నిలవకుంటే, ఈ దేశంలో చదువుకున్న, నిజాయితీ కలిగిన వ్యక్తులెవరూ కూడా మ-ునుముందు రాజకీయాల్లోకి రారు. కేజ్రీవాల్ విషయంలో మోదీ ఇలాగేనా వ్యవహరించేది?” అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



# ఇరాన్ కొత్త అధ్యక్షుడికి మోడీ అభినందనలు

- మసూద్ పెజెష్కియాన్ ను అభినందించిన ప్రధాని నరేంద్రమోడీ

**విశ్వంభర, ఢిల్లీ :** ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌ను ప్రధాని నరేంద్రమోదీ అభినందించారు. ‘ఇరాన్ అధక్ష పీఠాన్ని అధిరోహిస్తున్న మసూద్ పెజెష్కియాన్‌కు హృదయపూర్వక అభినందనలు’ అని మోదీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేయడం కోసం ఇరాన్ నూతన అధ్యక్షుడితో కలిసి పనిచేస్తామని మోదీ తన పోస్టులో రాశారు. కాగా, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ (63) హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంతో ఆ దేశంలో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఇరాన్ కొత్త అధ్యక్షుడిగా సంస్కరణవాది అయిన మసూద్ పెజెష్కియాన్ విజయం సాధించారు. ఆయన తన ప్రత్యర్థి సంప్రదాయవాది సయీద్ జలీలీపై గెలిచారు. లెక్కించిన మొత్తం 3 కోట్ల ఓట్లలో పెజెష్కియాన్‌కు అనుకూలంగా 1.6 కోట్లకుపైగా ఓట్లు ( 53.3 శాతం) రాగా.. జలీలీకి 1.3 కోట్లకుపైగా ఓట్లు ( 44.3 శాతం) ఓట్లు వచ్చాయి. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం మొత్తం పోలైన ఓట్లలో 50 శాతం ఓట్లు సాధించిన అభ్యర్థినే అధ్యక్షుడిగా నియమిస్తారు. అలా రానప్పుడు అగ్రస్థానంలో ఉన్న ఇద్దరు అభ్యర్థుల మధ్య వారం రోజుల తర్వాత రన్‌ఆఫ్ పోలింగ్ నిర్వహించాలి. జూన్ 28న జరిగిన తొలి రౌండ్ ఎన్నికల్లో కేవలం 40 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. దాదాపు 60 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఆ రౌండ్‌లో ఏ అభ్యర్థికి మెజారిటీ రాలేదు. దీంతో జూలై 5న రన్‌ఆఫ్ పోలింగ్ నిర్వహించారు.

# గుజరాత్‌లో బీజేపీని ఓడిస్తాం

- అయోధ్యలో ఓడించాం
- ఇప్పుడు మోడీ సొంత రాష్ట్రం మిగిలింది
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



**విశ్వంభర, ఢిల్లీ :** అయోధ్యలో మాదిరిగానే గుజరాత్‌లో కూడా బీజేపీని ఓడిస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. తనకు దేవుడితో ప్రత్యక్ష సంబంధం ఉందని మోదీ అన్నారని, అలాంటప్పుడు అయోధ్యలో బీజేపీ ఎందుకు ఓడిపోయిందని ఆయన ప్రశ్నించారు. రాజ్‌కోట్ గేమింగ్ జోన్‌లో జరిగిన అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు రాహుల్ గాంధీ శనివారం గుజరాత్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అహ్మదాబాద్‌లో కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్యలో మాదిరిగా గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాగా, రాహుల్ గాంధీ లోక్‌సభలో హిందుత్వపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ యువజన విభాగం సభ్యులు జూలై 2న అహ్మదాబాద్‌లోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వద్ద విధ్వంసం సృష్టించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ‘మమ్మల్ని బెదిరించి, మా కార్యాలయాన్ని ధ్వంసం చేయడం ద్వారా వాళ్లు (బీజేపీ) సవాల్ విసిరారు. మా కార్యాలయాన్ని ధ్వంసం చేసినట్లుగా మేమంతా కలిసి వారి ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేయబోతున్నాం. రాత పూర్వకంగా తీసుకోండి. అయోధ్యలో చేసినట్లే గుజరాత్‌లోనూ నరేంద్ర మోదీని, బీజేపీని ఓడిస్తాం’ అని అన్నారు. గుజరాత్ నుంచే కొత్త ప్రారంభాన్ని కాంగ్రెస్ ప్రారంభిస్తుందని తెలిపారు.

# గుజరాత్‌లో కుప్పకూలిన భవనం


- ఆరు అంతస్తుల భవనం నేలమట్టం
- శిథిలాల కింద చాలామంది
- 15 మందికి గాయాలు



**విశ్వంభర, హైదరాబాద్ :** గుజరాత్‌లోని సూరత్‌లో ఆరు అంతస్తుల భవనం కుప్పకూలడంతో పెను ప్రమాదం సంభవించింది. భవనం కుప్పకూలడంతో దాదాపు 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరో 5 మంది భవనం శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించే చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. సూరత్‌లోని సచిన్ జిఐడిసి ప్రాంతంలో భారీ వర్షాల సమయంలో ఆరు అంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ భవనం చాలా శిథిలావస్థకు చేరుకుంది. అయినప్పటికీ ఇక్కడ 10-15 మంది నివసిస్తున్నారు. భవనం కుప్పకూలడంతో స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని భవనంలో చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. అగ్నిమాపక సిబ్బందిని అక్కడికి తరలించిన అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఇంకా కొంత మంది అందులో నివసిస్తున్నట్లు సమాచారం. సంఘటన తర్వాత, ఆ ప్రాంతంలో పోలీసు బలగాలను మోహరించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలంలో భవన శిథిలాలను తొలగిస్తున్నారు. భవనం కూలిపోవడంతో భవనంలో నివసిస్తున్న వారంతా బయటకు పరుగులు తీశారని చెబుతున్నారు. భవనం కుప్పకూలడంతో ఆ ప్రాంతమంతా గందరగోళ వాతావరణం నెలకొంది. భవనం కూలడంతో సమీపంలోని పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో నివసించే ప్రజల్లో భయానక వాతావరణం నెలకొంది. శిథిలాల కింద ఇంకా అన్వేషణ కొనసాగుతోంది. ప్రజలు చిక్కుకుపోయి ఉంటారనే భయంతో యంత్రాలతో చెత్తా చెదారాన్ని చాలా జాగ్రత్తగా తొలగిస్తున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఇరాన్ నూతన అధ్యక్షుడిగా మసూద్ పెజెష్కియాన్

- సయీద్ జలీలీపై ఘన విజయం
- సంస్కరణవాదికి జై కొట్టిన ఇరాన్



**విశ్వంభర, ఢిల్లీ :** హెలికాప్టర్ ప్రమాదంలో అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ (63) మృతితో ఆ దేశంలో ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో ఇరాన్ కొత్త అధ్యక్షుడిగా సంస్కరణవాది మసూద్ పెజెష్కియాన్ ఎన్నికయ్యారు. ఆయన తన ప్రత్యర్థి సంప్రదాయవాది సయీద్ జలీలీపై విజయం సాధించారు. లెక్కించిన మొత్తం 3 కోట్ల ఓట్లలో డాక్టర్ పెజెష్కియాన్‌కు అనుకూలంగా 1.6 కోట్లకు పైగా ఓట్లు (53.3 శాతం).. జలీలీకి 1.3 కోట్లకు పైగా ఓట్లు ( 44.3 శాతం) ఓట్లు వచ్చాయి. దాంతో పెజెష్కియాన్ ఎన్నికైనట్టు అధికారులు ధ్రువీకరించారు. ఈ మేరకు ఎన్నికల విభాగం అధికార ప్రతినిధి మొహసెన్ ఇస్లామీ ప్రకటన చేశారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం మొత్తం పోలైన ఓట్లలో 50 శాతం ఓట్లు సాధించిన అభ్యర్థినే అధ్యక్షుడిగా నియమిస్తారు. అలా రానప్పుడు అగ్రస్థానంలో ఉన్న ఇద్దరు అభ్యర్థుల మధ్య వారం రోజుల తర్వాత రన్‌ఆఫ్ పోలింగ్ నిర్వహించాలి. జూన్ 28న జరిగిన తొలి రౌండ్ ఎన్నికల్లో కేవలం 40 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. దాదాపు 60 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఆ రౌండ్‌లో ఏ అభ్యర్థికి మెజారిటీ రాలేదు. దీంతో జులై 5న రెండో బ్యాలెట్ (రన్‌ఆఫ్ పోలింగ్)ను నిర్వహించారు. ఈ పోలింగ్‌లో కొత్త అధ్యక్షుడిగా సంస్కరణవాదిని ఇరానియన్లు ఎన్నుకున్నారు.



# భోలేబాబాపై తొలికేసు

**విశ్వంభర, లక్నో :** ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హథ్రస్ తొక్కిసలాట ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సత్సంగ్ నిర్వహించి వందల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపిన భోలే బాబాపై తాజాగా తొలి కేసు నమోదైంది. పాట్నా చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు నమోదైనట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. కాగా, ఈనెల 2న హథ్రస్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. అలీగఢ్‌తోపాటు హథ్రస్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రతి మంగళవారం సత్సంగ్ పేరుతో భోలే బాబా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతుంటారు. ఈ సత్సంగ్‌కు వేల సంఖ్యలో హాజరవుతుంటారు. ఈ నేపథ్యంలో జూలై 2న నిర్వహించిన సత్సంగ్‌కు 80 వేల మందికి ఏర్పాట్లు చేయగా.. ఏకంగా రెండున్నర లక్షల మంది హాజరయ్యారు. ఈ క్రమంలో అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుని 121 మంది ప్రాణాలు కోల్పోయారు.

# పవన్ కల్యాణ్ వారాహిదీక్ష పరిసమాప్తం

- కలశోద్వాసన క్రతువుతో ముగింపు
- అమ్మవారికి నక్షత్ర హారతి



**విశ్వంభర, అమరావతి :** సమాజ సంక్షేమాన్ని, దేశ సౌభాగ్యాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి ఏకాదశ దిన దీక్ష... వారాహి అమ్మవారి ఆరాధన, కలశోద్వాసన క్రతువుతో పరిసమాప్తమైంది. ప్రదోష కాలాన వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ దీక్షాబద్ధులైన పవన్ కల్యాణ్ వారాహి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏక హారతితో పాటు నక్షత్ర హారతులు అమ్మవారికి సమర్పించారు. చివరిగా హారతితో వారాహి ఏకాదశ దిన ఆరాధన సంపూర్ణం అయింది. వేద పండితులు బ్రహ్మశ్రీ కోసిగంటి సుధీర్ శర్మ, హరనాథ్ శర్మ, వేణుగోపాల శర్మ పూజా క్రతువు పూర్తి చేసి ఆశీర్వచనాలు అందజేశారు. ఇకపై పవన్ కల్యాణ్ చాతుర్మాస దీక్ష చేయనున్నారు. గతంలోనూ పవన్ ఈ దీక్షను అవలంబించిన విషయం తెలిసిందే. చాతుర్మాస దీక్షను రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ దీక్ష ఆషాడం, శ్రావణం, భాద్రపదం, అశ్వీయుజమాసం కలిసి నాలుగు మాసాల పాటు ఈ దీక్ష కొనసాగుతుందని వెల్లడించారు. గృహస్తాచార రీతిలో ఈ దీక్షను తలపెడుతున్నారు. అధికార కార్యకలాపాలను కొనసాగిస్తూనే శుభ తిథుల్లో మాత్రం దీక్షా వస్త్రాలు ధరిస్తారు.

# దాడులు ఆపండి

## లేదంటే మీకు కూడా ఇదే గతి : మాజీ సీఎం జగన్ వార్నింగ్



**విశ్వంభర, కర్నూలు :** దాడుల సంప్రదాయాన్ని ఆపాలని, లేకపోతే రేపు మీకు ఇలాంటే గతి పడుతుందని వైఎస్సార్సీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్ శనివారం కడప జిల్లా పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో కడప రిమ్స్ కు వెళ్లి వెంపల్లిలో ప్రత్యర్థుల దాడిలో గాయపడిన వైసీపీ కార్యకర్త అజయ్‌కుమార్ రెడ్డిని వైఎస్ జగన్ పరామర్శించారు. బాధితుడికి తాము అండగా ఉంటామని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. బాధితుడి గాయాలు, మెడికల్ కండీషన్ పై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

### టీడీపీ శ్రేణుల దారుణాలు..

అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ.. '25 ఏళ్ల యువకుడు అజయ్ కుమార్ రెడ్డిని టీడీపీ శ్రేణులు దారుణంగా కొట్టాయి. ఎందుకంటే తను వైఎస్సార్ సీపీ పార్టీకి ఓటు వేశాడని, అదే పనిగా కావాలని వాహనాల్లో వెంపల్లెకు వచ్చి అతడి బైక్ అడ్డుకుని దాడికి పాల్పడ్డారని వైఎస్ జగన్ ఆరోపించారు. పాతికేళ్ల యువకుడిపై ఎందుకంత కోపం, వైసీపీకి సంబంధించిన వ్యక్తులు కనిపిస్తే ఇలాగే దాడులు చేస్తారా అని మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఇలా దాడులు చేసి అమాయకులపై నిర్దాక్షిణ్యంగా దాడులు చేసి ఆసుపత్రి పాలు చేస్తే మీకు కలిగే ప్రయోజనం ఏముంది, ఏం సాధిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎన్నో ఎన్నికలు జరిగాయి, కానీ పులివెందులలో తొలిసారి తమకు ఓటు వేయని వారిపై ఇలాంటి దాడులు చేయడం కరెక్ట్ కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి భయాందోళన కలిగించే చర్యలకు దిగుతున్నారు. ఇప్పుడు మీరు వేస్తున్న బీజం, చేసే పనులు రేపు పొద్దున టీడీపీ కార్యకర్తలకు చుట్టుకుంటుంది. ఇలా భయందోళన కల్పిస్తే తనకు ప్రయోజనం ఉందని భావిస్తున్నారు. కానీ చంద్రబాబు దయచేసి ఈ చెడు సంప్రదాయాన్ని తప్పకుండా ఆపేయండి. ఎప్పటికీ మీరే అధికారంలో ఉండరు. శిశుపాలుడి పాపాల్లా పెరిగిపోతున్నాయి. వీటిని గమనిస్తున్న ప్రజలు, ఇప్పుడు దెబ్బతిన్న వారు రేపు అటువైపు ఇలాంటి దాడులు చేయడానికి చంద్రబాబు బీజం వేస్తున్నారు. నాయకులుగా మేం ఇలాంటి చర్యలకు దిగకూడదు. దయచేసి వీటిని ఇక్కడితో ఆపేయాలి. లేకపోతే భవిష్యత్తులో టీడీపీ శ్రేణులపై దాడులకు ఇవి ప్రేరేపిస్తున్నాయని' వైఎస్ జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

### హామీలు అమలు చేయడం లేదని విమర్శలు

మధ్యాహ్న భోజన పథకం సరిగ్గా అమలు కావడం లేదని వైఎస్ జగన్ ఆరోపించారు. 90 మంది చిన్నారులు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. వారికి బ్యాగులు, కిట్లు సైతం సరిగ్గా పంపిణీ చేయడం లేదని విమర్శించారు. మాకు రావాల్సిన 10 శాతం ఓట్లు మీకు ఎందుకు పడ్డాయంటే, చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలే కారణం. స్కూళ్లు ప్రారంభమయ్యాయి. కానీ అమ్మ ఒడి డబ్బులు ఇంకా అకౌంట్లో వేయడం లేదన్నారు. ప్రతి ఇంటికి రూ.3 వేల నిరుద్యోగ భృతి కోసం జాబ్స్ లేని యువత ఆశగా ఎదురు చూస్తోంది. కావాలంటే ఇలాంటి హామీలు నెరవేర్చాలి కానీ తమకు ఓటు వేయలేదనన కక్షతో దాడులు చేయడం సరికాదని వైఎస్ జగన్ హితవు పలికారు.

# రేపు ఏపీ బీజేపీ విస్తృతస్థాయి సమావేశం

- పురంధేశ్వరి అధ్యక్షతన మీటింగ్
- కేంద్రమంత్రులు హాజరు



**విశ్వంభర, విశాఖపట్నం :** ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా బీజేపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ తెలిపారు. రాజమహేంద్రవరంలో జులై 8న ఉదయం నుంచి సాయంత్రం వరకూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన సమావేశం జరగనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రులు మురుగన్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, జాతీయ నేతలు శివప్రకాశ్ జీ, అరుణ్ సింగ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఇతర నేతలు పాల్గొంటారని సామించి శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ.."గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ కేంద్రంగా తిరుమల శ్రీవారి ఆస్తులు, నిధులు దుర్వినియోగం చేశారు. పవిత్ర పుణ్యక్షేత్రాన్ని జగన్ రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు. వైసీపీ అభ్యర్థిని గెలుపించుకోవాడనికి తిరుమల నిధులను అప్పటి టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వాడుకున్నారు. వైసీపీకి అనుకూలంగా ఉన్న వీర విధేయులకు మాత్రమే తిరుమల కొండ మీద షాపులు కేటాయించారు. హాకర్ లైసెన్స్ కలిగిన వారికి కూడా షాపులు పెట్టుకునేలా గత బోర్డు సమావేశంలో నిర్ణయాలు తీసుకుంది. ఆ తీర్మానం కాపీని బయటకు రాకుండా కరుణాకర్ రెడ్డి దాచిపెట్టారు. వైసీపీకి అనుకూలంగా పనిచేయాలని ఆదేశాలు ఇచ్చి మరీ 16మందికి షాపులు కేటాయించారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో డబ్బులు ఇచ్చిన వారంతా భూమనను నిలదీశారు. దీంతో పాత తేదీలతో సంతకాలు పెట్టి వారికి దుకాణాలు కేటాయించినట్లు పత్రాలు ఇచ్చారు. ఈ మొత్తం వ్యవహారంపై ఇప్పటి ఈవో విజిలెన్స్ విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.

# పెన్షన్లలో భారీ కోత..?

- వచ్చే నెలలో భారీగా కటింగులు
- అనర్హులను గుర్తించే పనిలో అధికారులు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు




**విశ్వంభర, అమరావతి :** ఏపీలో సామాజిక పెన్షన్లు లెక్క తీసి చూస్తే 66 లక్షల పై చిలుకు ఉన్నాయి. వీటికి టీడీపీ కూటమి పెంచిన వేయి రూపాయలను కూడా జత చేసి చూస్తే నెలకు అదనంగా 900 వందల కోట్ల రూపాయలు ఖర్చు పెరుగుతోంది. అలాగే ఏటా 10 వేల కోట్లు అదనపు భారం పడుతోంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి నెల అంటే జూలైలో ఎలాంటి కటింగులు లేకుండా అందరికీ పెన్షన్ మొత్తం ఏడు వేల రూపాయలు పెంచి మరీ ఇచ్చేశారు. కానీ ఆగస్టు నెలకు అలా కుదరదు అని అంటున్నారు. ఈ పెన్షన్ల నుంచి అనర్హుల పేరుతో చాలా మందిని ఏరివేయాలని చూస్తున్నారు. సామాజిక పెన్షన్లలో అనర్హులు ఉన్నారా అంటే చాలా మందే అని లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగితే ఏకంగా రెండున్నర లక్షల మందికి పెన్షన్లు కట్ అయ్యాయి. వారంతా అనర్హులు అని తేలింది. అరవై ఏళ్ళు దాటిన వారందరికీ వృద్ధాప్య పెన్షన్లు వర్తింప చేస్తున్నారు. దాంతో చాలా మంది వయసు ఎక్కువ వేసుకుని విధంగా ఆధార్ కార్డులో కూడా ఏజ్ మార్చేసుకుని ఈ పెన్షన్లు పొందుతున్నారని తెలుస్తోంది. అలాంటి వారిని గుర్తించి మరీ పెన్షన్లు కట్ చేసే పనిలో అధికారులు ఉన్నారు. అదే విధంగా దివ్యాంగులు కాకపోయినా తప్పుడు సర్టిఫికేట్లు ఇచ్చి మరీ తెచ్చిపెట్టుకున్న అంగ వికలత్వం తో ఆ పేరుతో పెన్షన్లు పెద్ద ఎత్తున పొందుతున్న వారి జాబితా ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ విధంగా ఎవరికి పడితే వారికి విచ్చలవిడిగా దివ్యాంగుల సర్టిఫికేట్లు ఇచ్చేశారు. దాంతో వారంతా హ్యాపీగా పెన్షన్లు అందుకున్నారు. ఇపుడు వీరి అసలు గుట్టుని బయటపెట్టడానికి అధికారులు రంగం సిద్ధం చేశారని అంటున్నారు. అలాగే ఒంటరి మహిళ కేటగిరీలోనూ పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని అంటున్నారు. ఒంటరి మహిళ కానప్పటికీ ఆ విధంగా చెప్పుకుని పెన్షన్లు కొట్టేసిన వారి జాబితా పెద్దదిగానే ఉంది అని అంటున్నారు. అలాగే వితంతు పెన్షన్ల విషయంలో ఇలాగే అవకతవకలు చోటు చేసుకున్నాయి అంటున్నారు. వితంతువులు కాకపోయినా ఆ విధంగా సర్టిఫికెట్లు పుట్టించుకుని మరీ పెన్షన్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా పెన్షన్ల కేటగిరీలో ఇరవై ఎనిమిది రకాలు ఉంటే చాలా కేటగిరీలలో అవకతవకలు ఉన్నాయని అంటున్నారు. దాంతో వీరందరికీ పెన్షన్లు కట్ చేయాలని వారికి ఆ విధంగా తప్పుడు సర్టిఫికేట్లు ఎవరు ఇచ్చారో సంబంధిత అధికారుల మీద చర్యలు తీసుకోవాలని కూడా ప్రభుత్వం ఆదేశించినట్లుగా ఉంది. ఈ విధంగా ప్రభుత్వం కనుక పెన్షన్లలో అవకతవకలు నిరోధిస్తే లక్షల్లోనే పెన్షన్లు కట్ అవుతాయని అంటున్నారు. ప్రభుత్వానికి ఆర్థిక భారంగా ఉన్నా పెన్షన్లు పెంచి ఇస్తున్న నేపథ్యంలో అనర్హులను ఏరివేయకపోతే అసలైన వారికి ఇబ్బంది కలుగుతుందని కూడా అంటున్నారు. దాంతో దీని మీద పూర్తి విచారణ చేయించే పనిలో ప్రభుత్వం ఉందని అంటున్నారు.

# జగన్-షర్మిల భేటీ.. పులివెందుల వేదిక

- ఫ్యామిలీ వివాదాలపై చర్చ
- వైఎస్ జయంతి రోజున మీటింగ్

**విశ్వంభర, విజయవాడ :** ఏపీలో ఇప్పుడు సంచలన న్యూస్ వైరల్ అవుతోంది. అదే జగన్-షర్మిల భేటీ. అవును వీరిద్దరూ జులై 8న భేటీ కాబోతున్నట్టు తెలుస్తోంది. మొన్నటి వరకు ఉప్పు నిప్పులా వ్యవహరించిన వీరిద్దరూ ఇప్పుడు తల్లి విజయమ్మ సమక్షంలో భేటీ కాబోతున్నారనే సమాచారం వినిపిస్తోంది. వాస్తవానికి జగన్ కు గతంలో షర్మిల ఎంతో సపోర్టుగా ఉండేవారు. వైసీపీని 2019లో గెలిపించడంలో కీలక పాత్ర పోషించారు వైఎస్ షర్మిల. జగన్ తో సమానంగా పార్టీ కోసం కష్టపడ్డారు. కానీ జగన్ సీఎం అయిన తర్వాత ఇద్దరి మధ్య చాలా గ్యాప వచ్చింది. దానికి చాలానే కారణాలు ఉన్నాయంటారు. ప్రధానంగా చెప్పుకోవాల్సినవి ఆస్తి తగాదాలు, బాబాయ్ వివేకానంద హత్య, వైసీపీలో సముచిత స్థానం కల్పించకపోవడం లాంటివి షర్మిలను జగన్ కు దూరం చేశాయని ఆమె మద్దతు దారులు పదే పదే చెబుతున్నారు. ఆ తర్వాత తెలంగాణలోకి వచ్చి వైఎస్సార్టీపీ పార్టీని పెట్టారు. రెండేళ్లు కష్టపడి ఎన్నికల్లో పోటీ చేయకుండానే కాంగ్రెస్ లో విలీనం చేశారు. ఏపీ కాంగ్రెస్ పగ్గాలు తీసుకున్న తర్వాతనే జగన్ తో ఆమెకు గ్యాప్ ఇంకా పెరిగింది. ఎందుకంటే ఎన్నికల సమయంలో జగన్ మీద ఎంతలా ఆరోపణలు చేశారో అందరికీ తెలిసిందే. బాబాయ్ వివేకానంద కూతురు సునీతతో కలిసి ఆమె చేసిన ఆరోపణలు జగన్ ఇమేజ్ అమాంతం కుప్పకూల్చేశాయి. మొన్నటి ఎన్నికల్లో జగన్ ఓడిపోవడానికి షర్మిల చేసిన ఆరోపణలు కూడా పెద్ద కారణమే అంటారు. అప్పటి నుంచి షర్మిల, జగన్ ఎడముఖం, పెడముఖం అన్నట్టుగానే ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఇద్దరూ ఇప్పుడు భేటీ కాబోతున్నట్టు తెలుస్తోంది. అది కూడా పులివెందులలో. జులై 8న వారి తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఉంది. ఈ కార్యక్రమానికి వీరిద్దరూ ముందుగా పులివెందుల చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఇడుపుల పాయలో ఉన్న వైఎస్ సమాధి వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఆ తర్వాత వీరిద్దరూ భేటీ కాబోతున్నారని సమాచారం. ఈ భేటీలో రాజకీయ పరమైన విషయాలను చర్చిస్తారా లేదంటే కుటుంబ పరమైన విభేదాలను పరిష్కరించుకుంటారా అనేది తెలియాల్సి ఉంది. కానీ వీరిద్దరి భేటీలో మాత్రం కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని మాత్రం తెలుస్తోంది. అది రాష్ట్ర రాజకీయాలను మార్చేస్తాయని అంటున్నారు.



# ఘోర ప్రమాదం.. నలుగురు మృతి

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.. ఈ ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు.. ఈ ఘటన అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం మండలం కొండవాండ్లపల్లి సమీపంలో తెల్లవారుజామున జరిగింది. యాసిడ్ తీసుకుని వెళుతున్న వాహనం ఢీకొని కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.. మరొకరు ఆసుపత్రికి తీసువెళుకున్న క్రమంలో.. మార్గమధ్యలో మృతి చెందాడు.. మరొకరికి తీవ్రగాయాలు కాగా.. అతన్ని రాయతోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం వద్ద యాసిడ్ తో ట్యాంకర్ లారీ.. కారు ఢీకొన్నాయి.. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు మృత్యువాత పడ్డారు. మృతులు రాయచోటి సమీపంలోని ఓ గ్రామంలో జరిగే శుభకార్యానికి వెళుతుండగా శనివారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. వీరంతా కడప నగరానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. అందులో ఒకరు హెూంగార్డు కూడా ఉన్నారు.. ఒకరికి తీవ్ర గాయాలు కాగా.. రాయచోటి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. లారీని ఓవర్ టెక్ చేసే క్రమంలో కారు లారీ వెనక భాగంలో ఢీకొట్టింది.. వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టి.. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. శుభకార్యానికి బయలుదేరి వెళుతున్న క్రమంలో.. కుటుంబసభ్యులు ఇలా మృత్యువాత పడటంతో బంధువులు శోకసంద్రంలో మునిగారు.. ఇలా జరుగుతుందని అస్సలు ఊహించలేదంటూ రోదిస్తున్నారు. అన్నమయ్య జిల్లా రామాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతదేహాలను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ప్రజల ఆశలను నిజం చేస్తాం

## ఆనం రామనారాయణ రెడ్డి వ్యాఖ్యలు



**విశ్వంభర, నెల్లూరు :** జల ఆశలకు అనుగుణంగా చంద్రబాబు పాలన ఉంటుందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంత్రి నారాయణ నివాసంలో ఎమ్మెల్యేలతో మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి ఈరోజు(శనివారం) భేటీ అయ్యారు. జిల్లాలో సమస్యలు, అభివృద్ధిపై సుదీర్ఘ చర్చలు జరిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అపరిష్కృత సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధిపై అధికారులతో చర్చించి కలసి కట్టుగా పని చేస్తామని అన్నారు. పార్టీ బలోపేతానికి, జిల్లా అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ఐక్యతతో కలసికట్టుగా పనిచేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

### ఐదేళ్లలో రాష్ట్రం సర్వనాశనం: సోమిరెడ్డి

ఐదేళ్లలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. జిల్లాలో పోర్ట్, ఎయిర్ పోర్ట్ అర్థాంతరంగా ఆగిపోయాయని చెప్పారు. జిల్లాలో సెజ్‌లు, పరిశ్రమలపై దృష్టి సారించే విషయంపై ఈ సమావేశంలో చర్చించుకున్నామని అన్నారు. జిల్లాలో శాశ్వత పట్టాల పేరుతో ల్యాండ్ స్కాం జరిగిందన్నారు. జిల్లాలో రైతులకు న్యాయం చేసేందుకు, పరిశ్రమలు, పెట్టుబడులు రాబట్టేందుకు కలసికట్టుగా కృషి చేస్తామని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.

# 20 ఏళ్ల పిల్లాడిని అన్యాయంగా కొట్టారు

- మాజీ సీఎం జగన్ ఆగ్రహం
- ఆస్పత్రిలో పరామర్శ

**విశ్వంభర, పులివెందుల :** 20ఏళ్ళ పిల్లాడు అజయ్‌ను నిర్ధాక్షణ్యంగా కొట్టారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం టీడీపీ నేతల దాడిలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వైసీపీ నేత అజయ్ రెడ్డిని జగన్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీకి చెందిన వ్యక్తి అని అదే పనిగా వాహనాల్లో వచ్చి దాడి చేసి ఆసుపత్రి పాలు చేశారని అన్నారు. పులివెందులలో ఇలాంటి సాంప్రదాయం గతంలో ఎన్నడూ లేదని ఆయన విమర్శించారు. ఎన్నికల తర్వాత అంతా కలిసి ఉండే పరిస్థితి ఉంటుందని.. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ సంప్రదాయానికి తిలోదకాలు పలికి చెడు సాంప్రదాయానికి తెరలేపారన్నారు. ఇలాంటి పరిస్థితి రాష్ట్రంలో ఎన్నడూలేదని.. తమరు వేసే బీజం చెడు సాంప్రదాయమంటూ వ్యాఖ్యలు చేశారు. టీడీపీ నేతలు భయాందోళన వాతావరణం సృష్టించాలని చూస్తున్నారని.. ఇప్పటికైనా ఆపాలని హితవుపలికారు. అధికారంలో ఉండి చేసిన ఈ సంప్రదాయ పాపాలు చంద్రబాబుకు చుట్టుకుంటాయని హెచ్చరించారు. "చంద్రబాబును హెచ్చరిస్తున్నా ఈ సంప్రదాయం ఆపండి.. వ్యవస్థను గాడిలో పెట్టండి" అంటూ హితవులపికారు. బాబు మోసపూరిత వాగ్దానాలు నమ్మి ఓట్లేశారన్నారు. రుణ మాఫీ అన్నారని... మహిళకు నగదు అన్నారని... అవి చూసుకోవాలని వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. శిశుపాలుడి లా చంద్రబాబు పాపాలు వేగంగా పండుతున్నా యని... ఇంత వరకు స్కూల్ బాగ్స్ అందించలేదని విమర్శించారు. అతిసారతో ఆసుపత్రి పాలైతే పట్టించుకున్న పాపానపపోలేదని జగన్ విమర్శలు గుప్పించారు.



# బొత్సకు అచ్చెన్నాయుడు కౌంటర్

## పారదర్శకతపై మాట్లాడొద్దంటూ సెటైర్లు

**విశ్వంభర, విశాఖపట్నం :** తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశానికి సంబంధించి వైసీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన ట్వీట్‌పై టీడీపీ నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పారదర్శకత కోసం, ప్రజలకు వాస్తవాలు తెలియడానికి ముఖ్యమంత్రలు సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తే బాగుంటుందంటూ బొత్స ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌పై మంత్రి అచ్చెన్నాయుడు వేదికగా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. "భలే జోకులేస్తున్నారు బొత్స గారు..! పారదర్శకత గురించి మీరు.. జగన్ మాట్లాడితే నవ్విపోతారు.. వద్దులెండీ..? పారదర్శకతకు పాతరేసిందే మీరు.. మీ పార్టీ. ప్రెస్‌మీట్లు కూడా లైవ్ కాకుండా ఎడిట్ చేసి ఇవ్వాలని ఆదేశించే నాయకత్వంలో మీరు పని చేస్తున్నారు. దయచేసి పారదర్శకత.. వాస్తవాలు వంటి పెద్ద పెద్ద పదాలు మీరు వాడొద్దు.. ప్రజలకు అన్ని విషయాలు తెలుసు.. సమావేశమయ్యాక.. అన్ని తెలుస్తాయి" అని అచ్చెన్నాయుడు తెలిపారు.

# పసికూన చేతిలో
# ఘోరంగా ఓడిన టీమిండియా





**విశ్వంభర, స్పోర్ట్స్ :** హరారే వేదికగా జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో టీమిండియా ఘోర పరాజయం పాలయ్యింది. పసికూన చేతుల్లో భారత్ ఆలౌట్ కావడమే కాదు.. 13 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. కెప్టెన్ శుభ్‌మాన్ గిల్(31), వాషింగ్టన్ సుందర్(27), ఆవేశ్ ఖాన్(16) మినహా మిగిలిన బ్యాటర్లు సింగిల్ డిజిట్లకే పరిమితమయ్యారు. జింబాబ్వే బౌలర్లలో చటారా, కెప్టెన్ సికిందర్ రజా చెరో మూడు వికెట్లు పడగొట్టగా.. బెన్నెట్, మసకద్జా, ముజారబని, జొన్వ్లే చెరో వికెట్ తీశారు. ఇక ఇరు జట్ల మధ్య రెండో టీ20 ఆదివారం జరగనుంది. అంతకముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న టీమిండియా.. ఆతిథ్య జట్టు జింబాబ్వేను బ్యాటింగ్‌కు దింపింది. మొదటి ఓవర్‌లోనే బౌలర్ ముఖేష్ కుమార్.. జింబాబ్వే ఓపెనర్ కియాను గోల్డెన్ డకౌట్ చేశాడు. అయితే ఆ తర్వాత మదేవేరే(21), బెన్నెట్(22) రెండో వికెట్‌కు 34 పరుగులు జోడించారు. ఇక కెప్టెన్ సికిందర్ రాజా(17), మైర్స్(23), వికెట్ కీపర్ మదందే(29) హ్యాండీ రన్స్ చేయడంతో నిర్ణీత 20 ఓవర్లకు జింబాబ్వే 9 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. టీమిండియా బౌలర్లలో రవి బిష్ణోయ్ 4 వికెట్లు.. సుందర్ 2 వికెట్లు.. ఆవేశ్ ఖాన్, ముఖేష్ కుమార్ చెరో వికెట్ తీశారు. ఇక 116 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేధించే క్రమంలో భారత బ్యాటర్లు ఏమాత్రం సరైన షాట్స్‌తో అలరించలేదు. ఓపెనర్ అభిషేక్ శర్మ(0), రుతురాజ్ గైక్వాడ్(7), రియాన్ పరాగ్(2), రింకూ సింగ్(0), ధృవ్ జురెల్(6) పేలవ షాట్స్ ఆడి తమ వికెట్లను పారేసుకున్నారు. కెప్టెన్ గిల్(31) కొద్దిసేపు అలరించగా.. సికిందర్ రాజా అతడ్ని బౌల్డ్ చేసి పెవిలియన్‌కు పంపాడు. ఆల్‌రౌండర్ సుందర్(27), ఆవేశ్ ఖాన్(16)తో కలిసి మ్యాచ్ పూర్తి చేద్దామని చూసిన.. ఆఖరి ఓవర్‌లో టీమిండియా ఆలౌట్ అయింది. మొత్తానికి నిర్ణీత ఓవర్లకు భారత్ 102 పరుగులకు ఆలౌట్ అయ్యి.. 13 పరుగులతో ఓటమిని చవిచూసింది.




### అనంత్ అంబానీ- రాధికల పెళ్లి వేడుకల్లో
# ప్రపంచకప్ హీరోలకు ఘన సన్మానం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** 'సుమారు 17 ఏళ్ల తర్వాత భారత్‌కు టీ20 ప్రపంచకప్ తీసుకొచ్చిన టీమిండియాపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. విజయం సాధించి భారత్‌కు తిరిగి వచ్చిన భారత జట్టు ఆటగాళ్లను పలు చోట్ల ఘనంగా సత్కరిస్తున్నారు. ఇప్పుడు అపర కుబేరుడు ముకేశ్ అంబానీ ఫ్యామిలీ కూడా భారత జట్టును ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా, డాషింగ్ బ్యాటర్లు సూర్యకుమార్ యాదవ్‌లను వేదికపైకి ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. కాగా ప్రస్తుతం ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ -రాధికా మర్చంట్ ల వివాహ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రోహిత్, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా కూడా ప్రీ వెడ్డింగ్ వేడుకలకు హాజర్యారు. ఈ సందర్భంగా రోహిత్ సతీమణి రితికా చేయిని పట్టుకొని లోపలికి తీసుకెళ్లారు నీతా అంబానీ. ఆ తర్వాత రోహిత్ ను పట్టుకొని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆ తర్వాత సూర్యకుమార్ క్యాచ్ గురించి నీతా అంబానీ ప్రత్యేకంగా ప్రస్తావించారు.
అనంతరం టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాపై కూడా ప్రశంసల వర్షం కురిపించారు నీతా అంబానీ. కఠిన పరిస్థితు లు మనుషుల్ని మరింత బలంగా మారుస్తాయని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారామె. ప్రస్తుతం వీటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరలవుతున్నాయి.

# టీ20లకే అరవీర భయంకరుడు

**విశ్వంభర, స్పోర్ట్స్ :** లంక ప్రీమియర్ లీగ్(ఎల్‌పీఎల్ 2024)లో మరో అరుదైన రికార్డు నమోదైంది. ఇటీవల జరిగిన ఓ మ్యాచ్‌లో న్యూజిలాండ్ వికెట్ కీపర్ టిం సీఫెర్ట్ అద్భుతమైన సెంచరీ సాధించడంతో పాటు.. టోర్నీలో తన పేరు మీద రెండు రికార్డులు నెలకొల్పాడు. దంబుల్లాలోని రాంగిరి అంతర్జాతీయ స్టేడియంలో గాలె మార్వెల్స్, జాఫ్నా కింగ్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో జాఫ్నా కింగ్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. జాఫ్నా కింగ్స్ బౌలర్ల ధాటికి గాలె మార్వెల్స్ తొలి 2 వికెట్లు 45 పరుగులకే కోల్పోయిం ఓది. ఈ దశలో వన్‌డౌన్‌లో దోగిన ఆ జట్టు బ్యాటర్ టిం సీఫెర్ట్.. మొదటి బంతి నుంచి ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఫలితంగా ఈ రైట్ హ్యాండ్ బ్యాటర్ మొత్తంగా 63 బంతులు ఎదుర్కొని 6 భారీ సిక్సర్లు, 12 ఫోర్లతో 104 పరుగులు చేశాడు. అతడి సెంచరీతో గాలె మార్వెల్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. ఇక 188 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జాఫ్నా కింగ్స్‌కు కుశాల్ మెండిస్ పేలుడు ఆరంభాన్ని అందించాడు. మెండిస్ కేవలం 16 బంతుల్లోనే 30 పరుగులు చేయగా, మరో బ్యాటర్ రిలే రోసోవ్ 42 బంతుల్లో 3 సిక్సర్లు, 8 ఫోర్లతో 67 పరుగులు చేశాడు. మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారుతున్న సమయంలో అజ్మతుల్లా ఒమర్ జాహి కేవలం 13 బంతుల్లో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అతడు 2 భారీ సిక్సర్లు, 4 ఫోర్ల సాయంతో అజేయంగా 35 పరుగులు చేసి.. జాఫ్నా కింగ్స్‌కి 19.4 ఓవర్లలోనే



అద్భుత విజయాన్ని అందించాడు.

### సీఫెర్ట్ రికార్డు ఇది..

ఈ మ్యాచ్‌లో సీఫెర్ట్ సెంచరీ చేయడం ద్వారా.. టోర్నీలో శతక్కొట్టిన మొదటి విదేశీ నాన్-ఓపెనర్‌గా చరిత్ర సృష్టించాడు. అలాగే లంక ప్రీమియర్ లీగ్‌లో ఒక ఇన్నింగ్స్‌లో బౌండరీల ద్వారా అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కూడా సీఫెర్ట్ రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో సీఫెర్ట్ సిక్సర్లు, ఫోర్ల సాయంతో 84 పరుగులు రాబట్టాడు. అంతకముందు కుశాల్ పెరీరా పేరిట ఈ రికార్డు ఉంది. అతడు బౌండరీల రూపంలో 70 పరుగులు చేశాడు.



### సూర్యకుమార్ క్యాచ్
# వివాదానికి తెర..

**విశ్వంభర, స్పోర్ట్స్ :** వెస్టిండీస్‌లోని బార్బడోస్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 7 పరుగుల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్ ఆఖరి ఓవర్‌లో హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో దక్షిణాఫ్రికా విధ్వంసకర ఆటగాడు డేవిడ్ మిల్లర్ భారీ షాట్ కొట్టగా.. బౌండరీ లైన్ వద్ద సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన క్యాచ్ అందుకున్నాడు. సూర్య ఈ క్యాచ్ పట్టడంతో భారత్ విజయావకాశాలు మెరుగు అయ్యాయి. కాగా.. సూర్య బౌండరీ లైన్ వద్ద పట్టిన ఈ కళ్లు చెదిరే క్యాచ్ క్రికెట్ చరిత్రలోనే ఓ బెస్ట్ క్యాచ్‌గా నిలిచిపోయింది. అయితే.. ఈ క్యాచ్ ఎంత పాపులర్ అయ్యిందో అంతే వివాదాస్పదమైంది. ఈ క్యాచ్ పై కొందరు నెటిజన్లు సందేహాలు వ్యక్తం చేశారు. బంతిని అందుకునే క్రమంలో సూర్య బౌండరీ లైన్‌ను తాకడని ఆరోపించారు. తమ ఆరోపణలు నిజమని చెబుతూ కొన్ని అస్పష్టమైన వీడియోలు షేర్ చేశారు. అయితే.. తాజాగా ఓ వీడియోలో సూర్యకుమార్ యాదవ్ క్లీన్ క్యాచ్ అందుకున్నట్లు కనిపించింది. ప్రస్తుతం ఇది వైరల్‌గా మారింది. ఈ వీడియోతో అందరి అనుమానాలు తొలిగిపోనున్నాయి.

### ముద్దులతో హార్దిక్ పాండ్యాను
# ఉక్కిరిబిక్కిరి చేసిన ఇషాన్..!



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమ్‌ఇండియా టీ20 ప్రపంచకప్‌ను సాధించడంలో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలక పాత్ర పోషించాడు. జట్టుకు అవసరమైన సమయంలో అటు బ్యాటింగ్‌లో, ఇటు బౌలింగ్‌లోనూ తనదైన ముద్ర వేశాడు. విశ్వ విజేతగా నిలిచిన అనంతరం నాలుగు రోజుల తరువాత ఆటగాళ్లు స్వదేశానికి చేరుకున్నారు. ముంబైలో విజయోత్సవ ర్యాలీ అనంతరం ప్లేయర్లు తమ స్వస్థలాలకు వెళ్లిపోయారు. గత కొన్నాళ్లుగా తీరిక లేకుండా క్రికెట్ ఆడిన హార్దిక్ పాండ్యా ప్రస్తుతం తన ఇంట్లో సేద తీరుతున్నాడు. ప్రపంచకప్ విజయాన్ని ఆస్వాదిస్తున్నాడు. టీమ్‌ఇండియా వికెట్ కీపర్, ముంబై ఇండియన్స్ ఓపెనర్ ఇషాన్ కిషన్ చెప్పాపెట్టకుండా హార్దిక్ ఇంటికి వెళ్లాడు. అతడికి అభినందలు తెలియజేశాడు. ఇందుకు సంబంధించిన వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఆ వీడియోలో ఏం ఉందంటే..? ఫోను చూసుకుంటుండగా తన వద్దకు వచ్చిన ఇషాన్ ను చూసి పాండ్యా సర్‌ప్రైజ్ అయ్యాడు. వెంటనే ఇద్దరు కౌగిలించుకున్నారు. సంతోషంతో పాండ్య కుడి వైపు బుగ్గపై ఇషాన్ ముద్దు పెట్టాడు. ఆ వెంటనే పాండ్యా ఇటు సైటు కూడా పెట్టమని చెప్పగా ఎడమ వైపు సైతం ముద్దు పెట్టాడు. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో 'షేర్ చేశాడు ఇషాన్ కిషన్.' గత కొన్ని నెలలుగా నువ్వు ఎన్నో విషయాలను ఎదుర్కొంటున్నాను. అయినప్పటికీ ఎంతో ప్రశాంతంగా, ఏకాగ్రతతో ఉన్నావు. ఈ రోజు నీ కష్టానికి తగి ప్రతిఫలాన్ని పొందావు. ఇలాంటి విజయాలను నువ్వు మరెన్నో సాధించాలని కోరుకుంటున్నాను. నీలాంటి వారు చాలా అరుదుగా ఉంటారు. నువ్వు ఓ ఛాంపియన్ వి అంటూ రాసుకొచ్చాడు.' ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు సరదాగా కామెంట్లు చేస్తున్నారు.



### వారాంతంలో ఏపీ, తెలంగాణలో
# తగ్గిన బంగారం ధరలు

**విశ్వంభర, బిజినెస్ :** మొన్న భారీగా పెరిగిన పసిడి ధరలు నేడు వారాంతంలో స్వల్పంగా మెరుగుపడ్డాయి. అనేక అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా గోల్డ్ రేట్లు తగ్గింపు నమోదైంది. 22 క్యారెట్ల పసిడి ధరలు నిన్నటితో పోల్చితే 100 గ్రాములకు రూ.100 స్వల్ప తగ్గుదలను నమోదు చేసింది. దీంతో దేశంలోని వివిధ నగరాల్లో తగ్గిన నేటి రిటైల్ విక్రయ ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో రూ.6759, ముంబైలో రూ.6699, ఢిల్లీలో రూ.6714, కలకత్తాలో రూ.6699, బెంగళూరులో రూ.6699, కేరళలో రూ.6699, వడోదరలో రూ. 6704, జైపూరులో రూ.6714, మంగళూరులో రూ.6699, నాశిక్ రూ.6702, అయోధ్యలో రూ.6714, బళ్లారి రూ.6699, నోయిడాలో రూ.6714, గురుగ్రాములో రూ.6714 వద్ద కొనసాగుతున్నాయి. 24 క్యారెట్ల పసిడి ధరలు నిన్నటితో పోల్చితే 100 గ్రాములకు రూ.100 స్వల్ప తగ్గుదలను చూసింది. దీంతో దేశంలోని వివిధ నగరాల్లో తగ్గిన నేటి రిటైల్ విక్రయ ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో రూ.7374, ముంబైలో రూ.7308, ఢిల్లీలో రూ.7323, కలకత్తాలో రూ.7308, బెంగళూరులో రూ.7308, కేరళలో రూ.7308, వడోదరలో రూ. 7313, జైపూరులో రూ.7323, మంగళూరులో రూ.7308, నాశిక్ రూ.7314, అయోధ్యలో రూ.7323, బళ్లారి రూ.7308, నోయిడాలో రూ.7323, గురుగ్రాములో రూ.7323గా ఉన్నాయి. ఏపీ-తెలంగాణలోని నగరాలైన విజయవాడ, గుంటూరు, కాకినాడ, తిరుపతి, నెల్లూరు, అనంతపురం, గుంటూరు, కడప, విశాఖ, హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్, నిజాంబాద్, వరంగల్ నగరాల్లో 22 క్యారెట్ల పసిడి నేటి ధర రూ.6699గా ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.7308 వద్ద కొనసాగుతోంది. అలాగే తాజా వెండి ధరలను తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ విక్రయ ధరను పరిశీలిస్తే.. ధర కేజీకి నేడు రూ.1600 పెరిగి రూ.99,300 వద్ద కొనసాగుతోంది.

### స్టాక్ మార్కెట్ పెట్టుబడుల్లో
# దూసుకుపోతున్న
# హైదరాబాదీలు




**విశ్వంభర, బిజినెస్ :** దేశీయంగా స్టాక్ మార్కెట్లలో కొన్ని ఏళ్లు గా రిటైల్ ఇన్వెస్టర్ల హవా పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో చాలా మంది తమ పెట్టుబడి అవసరాలకు వివిధ సాధనాలతో పాటు ఈక్విటీలను సైతం ఉత్తమంగా పరిగణిస్తున్నట్లు తాజా ఎన్ఎస్ ఈ, బీఎస్ఈ డేటా ప్రకారం వెల్లడైంది. ఈ క్రమంలో హైదరాబాదీలకు సంబంధించి ఆసక్తికర సమాచారం బయట పడింది. తాజా డేటా ప్రకారం మహారాష్ట్ర, యూపీ, గుజరాత్, వంటి రాష్ట్రాలతో కూడిన ముంబై, అహ్మదాబాద్ వంటి సాంప్రదాయ హాట్‌స్పాట్‌లు ఇప్పటికీ అత్యధిక పెట్టుబడిదా రులను కలిగి ఉన్నాయి. అయితే ప్రస్తుతం హైదరాబాద్, జైపూ ర్, రాజ్‌కోట్, పూణే నగరాలు స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ల సంఖ్య లో మంచి వృద్ధిని నివేదించాయి. లడఖ్ 370.57 శాతం, మిజోరం 81.10 శా తం, అరుణాచల్ ప్రదేశ్ 62.19 శాతం, లక్షద్వీప్ 61.78 శాతం, త్రిపుర 56.10 శాతం, జమ్మూ కాశ్మీర్ 53.79 శాతం, నాగాలాండ్ 52.95 శాతం ఇన్వెస్టర్ల పెరుగుదలను చూశాయని బీఎస్ఈ వెల్లడించింది. ఇక కేంద్రపాలిత ప్రాంతాలను పరిశీ లిస్తే.. అండమాన్ నికోబార్ 49.51 శాతం, బీహార్ 49.41 శా తం కొత్త పెట్టుబడి దాలును నమోదు చేశాయి. ప్రస్తుత క్యాలెండర్ ఇయర్‌లో ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న మార్కెట్‌లలో భారతీయ స్టాక్ మార్కెట్‌లు ఉండటంతో ఇది ప్రా ముఖ్యతను సంతరించుకుంది. ఇన్వెస్టర్ల గణాంకాలను రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే.. మహారాష్ట్ర ఇప్పటికీ దాదాపు 3.35 కోట్ల మంది పెట్టుబడిదారులతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. దీని తర్వాత ఉత్తర ప్రదేశ్ 1.97 కోట్లు, గుజరాత్ 1.68 కోట్లు, రాజస్థాన్ 1.08 కోట్లు, పశ్చిమ బెంగాల్ 1.01 కోట్లు మంది పెట్టుబడిదారులను కలిగి ఉన్నాయి. దేశంలో కోటి మందికి పైగా నమోదిత పెట్టుబడిదారులను కలిగి ఉన్న ఐదు రాష్ట్రాలు కూడా ఇవే కావటం గమనార్హం. రాష్ట్రాల పరంగా ఉత్తరప్రదేశ్ మే నెలలో 2.6లక్షల కొత్త రిజిస్ట్రేషన్లతో ముందంజలో కొనసాగింది, నెలవారీగా 15.5 శాతం పెరుగుదల నమోదు చేసింది.




### అదిరిపోయే ఆఫర్
# లాంచ్ చేసిన పేటీఎం..

**విశ్వంభర, బిజినెస్ :** ఇటీవల బీమా రంగంలో పలు కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా హెల్త్ ఇన్స్యూరెన్స్ విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు పోటీ పడుతున్నాయి. ఒకటికి మించి మరో సంస్థ ఆఫర్స్ మీద ఆఫర్స్ ఇస్తున్నాయి. ఇటీవలే ఓ ప్రముఖ హాస్పిటల్ చైన్ కూడా ఇదే తరహా సేవలు అందించేందుకు రంగంలోకి దిగింది. తాజాగా పేటీఎం కూడా కొత్త ప్లాన్‌తో ముందుకొచ్చింది. పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ తన వ్యాపార భాగస్వాముల కోసం 'పేటీఎం హెల్త్ సాథీ' పేరిట ప్రత్యేక ఆరోగ్య మరియు ఆదాయ రక్షణ ప్లాన్ ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇది 'పేటీఎం ఫర్ బిజినెస్' యాప్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. సరసమైన ధరలో సమగ్ర ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలను తన వ్యాపార భాగస్వామ్య విస్తారమైన నెట్‌వర్క్‌కు అందించాలనే లక్ష్యంలో దీన్ని ప్రారంభించినట్లు వెల్లడించింది. పేటీఎం హెల్త్ సాథీలో భాగమయ్యేందుకు కేవలం 35 నెలవారీ సబ్‌స్క్రిప్షన్ చెల్లిస్తే సరిపోతుంది. తద్వారా సంస్థ భాగస్వామ్య నెట్‌వర్క్‌లో అపరిమిత డాక్టర్ టెలికన్సల్టేషన్ మరియు ఇన్-పర్సన్ డాక్టర్ విజిట్ లతో కూడిన కలిగి అనేక రకాల సేవలను పొందవచ్చు. ప్రమాదాలు లేదా ప్రకృతి వైపరీత్యాల వల్ల వ్యాపారానికి అంతరాయాలు కలిగితే ఆదాయ రక్షణ కవరేజీని కూడా అందిస్తుంది. డాక్టర్ టెలికన్సల్టేషన్ సర్వీస్ ద్వారా ప్రముఖ ఫార్మసీలలో డిస్కౌంట్లు , డయాగ్నస్టిక్ టెస్ట్‌లతో సహా అదనపు ప్రయోజనాలు లభిస్తాయి. క్లెయిమ్ ప్రక్రియ కూడా పూర్తిగా క్రమబద్ధీకరించబడి ఉందని పేటీఎం చెబుతోంది. యాప్‌లో కేవలం కొన్ని క్లిక్‌లతో ఈ వ్యవహారాన్ని పూర్తి చేయవచ్చని పేర్కొంది. దీని పైలట్ స్కీమ్ మేలో ప్రారంభం కాగా ఇప్పటికే 3 వేల మంది వ్యాపార భాగస్వాములు రిజిస్టర్ అయ్యారు. అదికాస్తా విజయం సాధించడంతో ఈ నెల ప్రారంభంలో ఇతర వ్యాపారులందరికీ ఈ ఫీచర్‌ను అందించేందుకు పేటీఎం రెడీ అవుతోంది.



## హమ్మయ్యా.. మంచు లక్ష్మి కష్టం తీరిపోయిందిగా..

సీనియర్ హీరో మోహన్ బాబు వారసురాలిగా టాలీవుడ్‌లో అడుగుపెట్టింది మంచు లక్ష్మి. తన నటనతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. నటిగా, టీవీ షో హోస్ట్‌గా, నిర్మాతగా విజయాలను అందుకుంది. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తనకు సంబంధించిన విషయాలను అభిమాలతో పంచుకుంటూ ఉంటుంది. ఇటీవల ఆమె తనకు సాయం చేయాలని నెటిజన్లను అభ్యర్థిచగా.. ఇప్పుడు సమస్య పరిష్కారమైంది అంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేసింది.

**అసలేం జరిగిందంటే..?**

'అమెరికా సిటిజన్ అయిన నా కుమార్తె స్కూల్ హాలీడేస్ త్వరలోనే ముగియనున్నాయి. ఈ నెల 12న మేం అక్కడకు వెళ్లాల్సి ఉంది. ఎంబసీ వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. వారిని సంప్రదించేందుకు మార్గం లేకుండా పోయింది. వీసా జారీ అయి నెలకుపైనే అయినా దాన్ని చేరవేయడంలో జాప్యం చోటుచేసుకుంది. ఎవరైనా హెల్ప్ చేయగలరా?.' అని రెండు రోజుల క్రితం మంచు లక్ష్మి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీనిపై నెటిజన్లు స్పందించారు. తమకు తెలిసిన సమాచారాన్ని చెప్పారు. తాజాగా పాస్‌పోర్టు వచ్చినట్లు మంచి లక్ష్మి తెలియజేసింది. 'ఆఖరి పాస్ పోర్టు వచ్చేసింది. సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ ఒత్తిడితో కూడిన సమయంలో ప్రేమ, మద్దతు వెలకట్టలేనిది. మీ ప్రేమకి కృతజ్ఞతలు.' అంటూ మంచు లక్ష్మి అంది.



## మాల్వీ మల్హోత్రా.. సినిమా రిలీజ్ కాకుండానే కాంట్రవర్సీ

మాల్వీ మల్హోత్రా పేరు ఇప్పుడు టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. ఈమె గురించి సోషల్ మీడియాలో తెగ సెర్చ్ చేస్తున్నారు. తిరగబడర సామి సినిమాలో రాజ్ తరుణ్ కి జోడీగా ఈ నార్త్ ఇండియన్ బ్యూటీ టాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. అయితే ఈ మూవీ ఇంకా రిలీజ్ కాకుండా మాల్వీ మల్హోత్రా తెలుగు ఇండస్ట్రీలో సెన్సేషన్ గా మారిపోయింది. ఈ సినిమా కంటే ముందు మాల్వీ హిందీలో ఒక సినిమా, మలయాళంలో ఒక మూవీ చేసింది. అయితే తెలుగులో రాజ్ తరుణ్ సినిమా ఆమెని ఏకంగా కాంట్రవర్సీలో పడేసింది. రాజ్ తరుణ్ ప్రియురాలు లావణ్య మాల్వీ మల్హోత్రా పైన తీవ్ర ఆరోపణలు చేస్తోంది. రాజ్ తరుణ్ ని నాకు కాకుండా చేయాలని మాల్వీ మల్హోత్రా ప్రయత్నం చేస్తుందని, నన్ను ఆమె అన్నయ్యతో కలిసి బెదిరిస్తుందని లావణ్య ఆరోపిస్తుంది. మా నాన్నకి హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి బాగా క్లోజ్, నిన్ను చంపేసి డెడ్ బాడీ కూడా కనిపించకుండా మాయం చేస్తాం అంటూ వార్నింగ్స్ ఇస్తుందని లావణ్య పోలీసులకి ఫిర్యాదు చేసింది. ఈ బెదిరింపుల నేపథ్యంలోనే ప్రాణ రక్షణ కోసం పోలీసులకి ఫిర్యాదు చేశానని మీడియాతో తెలిపింది. అలాగే నాతో 11 ఏళ్ళు రిలేషన్ లో ఉండి, పెళ్లి చేసుకుంటానని ప్రామిస్ చేసి రాజ్ తరుణ్ మోసం చేసాడని లావణ్య ఆరోపిస్తుంది. వారి బంధువులు కూడా రాజ్ తరుణ్ ని వదిలేయాలని బెదిరిస్తున్నారని మీడియాకి తెలియజేసింది. అయితే మాల్వీ మల్హోత్రా కూడా ఈ ఆరోపణలపై లీగల్ యాక్షన్ తీసుకోవడానికి సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మాల్వీ మల్హోత్రా ఎవరు అంటూ నెటిజన్లు గూగుల్ లో ఆమె కోసం తెగ సెర్చ్ చేస్తున్నారు.

## కల్కి మూవీలో శ్రీకృష్ణునిగా మహేష్ బాబు?



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రెబల్ స్టార్ ప్రభాస్, దీపికా పదుకొణె జంటగా నటించిన సినిమా కల్కి. ఇక అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఈ చిత్రం థియేటర్లలో భారీ అంచనాల మధ్య విడుదలై విమర్శకులు, ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను రాబడుతుంది. బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టిస్తోన్న 'కల్కి' రూ.వెయ్యి కోట్ల కలెక్షన్ల దిశగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ నాగ్ అశ్విన్ శంకరపల్లిలోని కల్కి సెట్స్ లో గ్రాండ్ గా జరిగిన మీడియా ఇంటరాక్షన్ లో ఈ మూవీకి సంబంధించిన విశేషాలు పంచుకున్నారు. ఈ సందర్భంగానే సోషల్ మీడియాలో సూపర్ స్టార్ మహేష్ బాబు కల్కి సినిమాలో కృష్ణుడి పాత్రలో కనిపించి ఉంటే బాగుండేదని చాలామంది అభిప్రాయపడుతున్నారు. దానికి మీరేం అంటారు అని అడిగితే కచ్చితంగా మహేష్ బాబు కృష్ణుడి పాత్రలో బాగుంటారు, అయితే అది ఈ సినిమాలో కాదు వేరే సినిమాల్లో అని అంటూ నాగ్ అశ్విన్ అన్నారు. నిజంగానే మహేష్ బాబు శ్రీకృష్ణుడు పాత్ర చేస్తే బాగుంటుంది. అయితే సినిమాలో కాదు వేరే సినిమాలలో అని అంటూ నాగ అశ్విన్ అన్నారు .

## టాలీవుడ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ స్వప్న వర్మ ఆత్మహత్య

టాలీవుడ్‌లో మరో విషాదం చోటు చేసుకుంది. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ స్వప్న వర్మ(33) ఆత్మహత్య చేసుకుంది. మాదాపూర్‌లో తాను నివాసం ఉంటున్న ఫ్లాట్‌లో బలవన్మరణానికి పాల్పడింది. ఆర్థిక ఇబ్బందులతోనే ఆమె ఈ పని చేసి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. స్వప్న వర్మ సొంతూరు రాజమండ్రి. సినీ రంగంలో పనిచేసేందుకు మూడు సంవత్సరాల క్రితం ఆమె హైదరాబాద్ నగరానికి వచ్చింది. గత సంవత్సరం నుంచి మాదాపూర్‌లోని కావూరి హిల్స్‌లో నివాసం ఉంటూ సినీ ఇండస్ట్రీలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పని చేస్తోంది. అయితే.. గత ఆరు నెలలగా ఆమెకు ఎలాంటి ప్రాజెక్టులు లేవు. దీంతో ఆమె ఖాళీగా ఉంటుంది. రెండు రోజు క్రితం తన ఫ్లాట్‌లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె ఫ్లాట్ నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడకి చేరుకుని ఫ్లాట్ తలుపులు పగలకొట్టి చూడగా ఉరివేసుకున్న స్థితిలో ఆమె మృతదేహం కనిపించింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.



## లావణ్యపై హీరోయిన్ మాల్వీ ఫిర్యాదు..

టాలీవుడ్ యంగ్ హీరో రాజ్ తరుణ్‌తో పాటు పలువురిపై ఆరోపణలు చేసిన లావణ్యపై హీరోయిన్ మాల్వీ మల్హోత్రా సైబరాబాద్ సీపీకి ఫిర్యాదు చేసింది. తన గురించి అసత్య ప్రచారం చేస్తున్న లావణ్యపై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపింది. అలాగే, లావణ్య చేసిన ఆరోపణలపై మాల్వీ స్పందించింది. తాను లావణ్యను బెదిరించలేదని మాల్వీ చెప్పింది. రాజ్ తరుణ్‌తో తనకు ఎలాంటి సంబంధమూ లేదని మాల్వీ చెప్పింది. రాజ్ తరుణ్ కేవలం తన సహనటుడు మాత్రమేనని తెలిపింది. అలాగే, లావణ్యతో తనకు ఎలాంటి పరిచయమూ లేదని చెప్పింది. రాజ్ తరుణ్ తో నటించే ప్రతి హీరోయిన్‌నూ లావణ్య అనుమానిస్తోందని తెలిపింది. అసలు షూటింగ్ పూర్తయ్యాక రాజ్ తరుణ్ తో తాను టచ్ లో లేనని చెప్పింది.





# బరువు తగ్గే ప్రయత్నంలో ఈ ఏడు తప్పులు చేయకండి!



**విశ్వంభర, ఫీచర్ :** బరువు తగ్గాలని లావుగా ఉన్న ప్రతి ఒక్కరు చాలా ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ ఆ ప్రయత్నంలో కొన్ని తప్పులు చేస్తుంటారు. దానివల్ల మీ సమస్య తగ్గకపోగా ఇంకా ఎక్కువ అవుతుంది. బరువు తగ్గడం అనేది శరీరంలోని కొవ్వును తగ్గించడం ద్వారా శరీర బరువును తగ్గించే ప్రక్రియ. ఆరోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమను అనుసరించడం ద్వారా బరువు తగ్గవచ్చు. శరీరం వినియోగించే దానికంటే ఎక్కువ కేలరీలు బర్న్ చేసినప్పుడు బరువు తగ్గడం జరుగుతుంది. బరువు తగ్గడానికి మీరు చేసే ఏడు సాధారణ తప్పులు మరియు వాటిని ఎలా పరిష్కరించాలో ఇక్కడ ఉన్నాయి.

**1. తక్కువ కొవ్వు ఆహారాన్ని ఎంచుకోవడం**

తక్కువ కొవ్వు లేదా తక్కువ కొవ్వు ఆహారాలు సాధారణంగా ఆరోగ్యకరమైన ఎంపికలుగా పరిగణించబడతాయి. ఇది బరువు తగ్గడానికి మీకు సహాయపడుతుంది. అయినప్పటికీ, తక్కువ కొవ్వు ఉత్పత్తులు మీకు ఆకలిని కలిగిస్తాయి. కాబట్టి మీరు మీ శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ ఆహారాన్ని తీసుకోవచ్చు . తక్కువ కొవ్వు ఉత్పత్తులకు బదులుగా, పోషకమైన ఆహారాన్ని ఎంచుకోండి. వీలైనన్ని ఎక్కువ పండ్లు మరియు కూరగాయలను ఎంచుకోండి. ఎందుకంటే వాటిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి.

**2. ఆహారం పరిమాణం తెలియకపోవడం**

మీరు ప్రతిరోజూ తినే ఆహారం మీకు తెలియదు. ఇది గణనీయమైన బరువు పెరగడానికి కారణమవుతుంది. అల్పాహారం మరియు రాత్రి భోజనం మధ్య రెండు స్నాక్స్ తినడం ప్రతి రోజు తగినంత కేలరీలను అందిస్తుంది. దీని కోసం మీరు ప్రతిరోజూ ఏమి తినాలో చార్ట్ చేయాలి. ఇది బరువు తగ్గడంలో సహాయపడుతుంది. మీరు ప్రతిరోజూ తగినంత నీరు తాగుతున్నారని నిర్ధారించుకోవడానికి ఇది సహాయపడుతుంది.

**3. భోజనం దాటవేయడం**

భోజనం స్కిప్ చేయడం లేదా మీ క్యాలరీలను విపరీతంగా తగ్గించడం మీ జీవక్రియను నెమ్మదిస్తుంది. దీంతో బరువు తగ్గడం కష్టమవుతుంది.

**4. తగినంత నిద్ర లేకపోవడం**

ఈ మధ్యకాలంలో మనలో చాలా మంది పనిలో బిజీగా ఉండడం వల్ల తగినంత నిద్రపోవడం కష్టమవుతుంది. ఇది మీ జీవక్రియను నెమ్మదిస్తుంది. కనీసం 6 నుండి 8 గంటల నిరంతర నిద్ర పొందాలి. మీరు నిద్రపోతున్నప్పుడు మీ శరీరం రిలాక్స్ అవుతుంది. రోజువారీ ఒత్తిడి మరియు నిరాశ నుండి శరీరం కోలుకుంటుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల అధిక బరువు లేదా ఊబకాయం వచ్చే ప్రమాదం ఉంది. ఎందుకంటే పేలవమైన నిద్ర మీ ఆకలిని పెంచుతుంది.

**5. 'ఆరోగ్యకరమైన' ఆహారాలు అని పిలవబడే తినడం**

చాలా కంపెనీలు తమ ఉత్పత్తిని ఆరోగ్యకరమైనవిగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. అయితే, ఇది అంత ఆరోగ్యకరమైనది కాకపోవచ్చు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులుగా తరచుగా ప్రచారం చేయబడే ప్రోటీన్లు మరియు రసాలు వంటి ఉత్పత్తులు సంతృప్త కొవ్వులు మరియు అధిక చక్కెర కంటెంట్‌ను కలిగి ఉంటాయి. ఇది మీ కొవ్వును తగ్గించే ప్రయాణాన్ని కష్టతరం చేస్తుంది. అన్ని ఉత్పత్తుల వెనుక వ్రాసిన సూచనలను తనిఖీ చేయడం మర్చిపోవద్దు.

**6. కేలరీల బర్న్‌ను ఎక్కువగా అంచనా వేయడం**

బరువు తగ్గడానికి శరీరాన్ని శిక్షించడం సర్వసాధారణం. వ్యాయామం చేసేటప్పుడు మీరు బర్న్ చేసే కేలరీల సంఖ్యను ఎక్కువగా అంచనా వేయడం అతిగా తినడానికి దారితీస్తుంది. ఇది మీ బరువు తగ్గించే ప్రయత్నాలకు ఆటంకం కలిగిస్తుంది.

**7. స్థిరత్వం లేకపోవడం**

బరువు తగ్గడం విషయంలో స్థిరత్వం చాలా ముఖ్యం . కొన్ని సమయాల్లో వర్కవుట్‌లను దాటవేయడం లేదా వర్కవుట్‌లను దాటవేయడం పురోగతిని నెమ్మదిస్తుంది లేదా బరువు పెరగడానికి దారితీస్తుంది. ఓర్పు మరియు నిబద్ధత మొత్తం బరువు తగ్గడానికి కీలకం. చాలా మంది వారం పొడవునా కఠినమైన ఆహారం మరియు వ్యాయామ నియమాలను అనుసరిస్తారు. అయితే, వారాంతంలో వారు స్వేచ్ఛగా తింటారు. ఇది బరువు తగ్గించే ప్రయత్నాలను గణనీయంగా అడ్డుకుంటుంది. వారాంతాల్లో, కొందరు వ్యక్తులు ఆల్కహాల్, అధిక కేలరీల ఆహారాలను తీసుకుంటారు. ఇది బరువు పెరగడానికి దారితీస్తుంది. కచ్చితంగా పాటిస్తేనే బరువు తగ్గడం సాధ్యమవుతుంది.






Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com